PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 247 | విజయవాడ, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 12 April 2024 | Rs

మీ ఓటు బిజెపిపై వేటు కావాలి

- త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ పిలుపు

7

ఇషాన్, సూర్య ప్రతాపం

- బుమ్రా పాంచ్ పటాకా
- ఆర్‌సిబిపై ముంబయి ఘన విజయం

2

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు, మూలం రమేష్, తదితరులు

ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం పేరిట

కేంద్రం మరో మోసం!

విశాఖలో ఏర్పాటు చేస్తామంటూ గతంలోనే లేఖ

- రాజధాని ఎక్కడంటూ నేడు ప్రశ్న
- ఎన్నికల వేళ వంచనా విన్యాసం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రత్యేకహోదాతో పాటు విభజన హామీల అమలులో రాష్ట్ర ప్రజలను దగా చేసిన నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం మరోసారి అదే తరహా విన్యాసానికి తెరతీసింది. రాష్ట్ర రాజధాని ఎక్కడో తేలిన తరువాతే ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామంటూ ఆర్‌బిఐ తాజాగా రాసిన లేఖే దీనికి నిదర్శనం. నిజానికి మూడు రాజధానుల పేరిట రాష్ట్ర పాలనా రాజధానిని విశాఖపట్నంకు తరలిస్తామంటూ వైసిపి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎక్కడా తప్పు పట్టలేదు. గతంలో రాష్ట్రంలో పర్యటించిన ప్రధానితో పాటు, కేంద్ర మంత్రులు కూడా ఈ విషయాన్ని నామమాత్రంగా కూడా ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే రిజర్వుబ్యాంకు విశాఖలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి కూడా సన్నద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపింది. దీనిపై ఈ ఏడాది ఫిబ్రవరి 18న 'ప్రజాశక్తి'లో వార్తా కథనం కూడా ప్రచురితమైంది. మరోవైపు ఎన్నికల ప్రచారంలో భాగంగా అమరావతికి సమీపంలోనే పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటకు వచ్చిన ప్రధాని మోడీ రాజధాని అంశంపై పెదవివిప్పలేదు. అయితే, అనూహ్యం గా రిజర్వుబ్యాంకు రాజధాని ఏదో ఖరారైతేనే ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు



भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

क्षेत्रीय निदेशक, आंध्र प्रदेश
Regional Director for Andhra Pradesh

10624/[illegible]/2023

DO. No. AP. HRMD. ADM. No. 531/05-01-049/2023-2024

October 31, 2023

CHIEF SECRETARY ... 07 NOV 2023

Dear Dr. Reddy Garu,

Please refer to our DO letter dated August 22, 2022 (copy enclosed), addressed to the Chief Secretary, Government of Andhra Pradesh regarding the opening of Regional Office of Reserve Bank of India for the State of Andhra Pradesh. Please also refer to our mail dated January 31, 2023 (copy enclosed) addressed to the Secretary, Finance, Government of Andhra Pradesh requesting to advise the availability of State Government owned premises at Visakhapatnam on lease basis for setting up the Regional Office of RBI in Andhra Pradesh.

చేస్తామంటూ అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షునికి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాయలం ఏర్పాటుకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆయన చేసిన విజ్ఞప్తికి సమాధానం ఆర్‌బిఐ నుండి అందింది. దీంతో ఆర్‌బిఐ వైఖరి ఒక్కసారిగా మారిన తీరు చర్చనీయాంశమైంది. కేంద్ర ప్రభుత్వ పెద్దలు జవాబు ఇవ్వకుండా వ్యూహాత్మకంగానే ఆర్‌బిఐ చేత సమాధానం ఇప్పించారని, ఈ లేఖ వెనుక బిజెపి, ఎన్‌డిఎ కూటమి రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌బిఐ గతంలో ఇలా...!

ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలు 2022వ సంవత్సరంలోనే ప్రారంభమైనాయి. ఆ ఏడాది ఆగస్టు 22న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో రాష్ట్రానికి సంబంధించిన ప్రాంతీయ కార్యాలయాన్ని మూడు డిపార్ట్‌మెంట్లతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన చిరునామా, అధికారుల ఫోన్ నంబర్లను కూడా ఆ లేఖలో ఇచ్చారు. 2023 జనవరి 31న రాసిన లేఖలో విశాఖలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు గురించిన ప్రస్తావన చేశారు. అపాయింట్‌మెంట్ ఇస్తే రాష్ట్ర ప్రభుత్వ ఫైనాన్స్ కార్యదర్శితో కలిసి ఇదే అంశంపై చర్చిస్తామని కూడా తెలిపారు. అక్టోబర్ 31,2023న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డికి మరో లేఖ రాశారు. ఈ లేఖలో గతంలో రాసిన రెండు లేఖల అంశాన్ని ప్రస్తావించారు. విశాఖలో ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరారు. 30,000–35,000 చదరపు అడుగుల మధ్య కార్యాలయం ఏర్పాటుకు అనువుగా ఉండాలని, నీటి సరఫరా, వాష్ రూమ్‌లు, రెండు లిఫ్టులు, విద్యుత్ కనెక్షన్, ఇంటర్నల్ పార్కింగ్, పబ్లిక్ కౌంటర్ల ఏర్పాటుకోసం గ్రౌండ్ లెవల్ హాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్ తదితర ప్రాథమిక సౌకర్యాలు ఉన్న భవనాన్ని ఐదు సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వాలని కోరారు. ఆర్‌బిఐ నుండి వరుసగా వస్తున్న లేఖల నేపథ్యంలో విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఈ దిశలో అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 31వ తేదిన (31.01.24) ఈ మేరకు మిగతా 2లో

ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఎం లక్ష్యం

నెల్లూరులో ఇంటింటి ప్రచారంలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నెల్లూరు

ప్రతి నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజా పక్షాన నిలిచే సిపిఎం పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. నెల్లూరులో సిపిఎం అభ్యర్థి మూలం రమేష్‌కు ఓట్లు వేయాలని కోరుతూ గురువారం నగరంలోని శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో ఆయన నాయకత్వాన ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిపిఎం అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన మూలం రమేష్‌కు యువజన సంఘంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మిగతా అభ్యర్థులకు భిన్నంగా ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఉద్యమాలు, పోరాటాలతో ముందుకు సాగారని తెలిపారు. అటువంటి అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించుకోవడం ప్రజలందరి బాధ్యత అని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలందరి తరుపున పోరాటం చేశారని.. నేడు ప్రజలు, ఉద్యోగుల, వ్యాపారస్తుల, శ్రామిక మహిళల తరుపున పోరాటం చేసేందుకు అసెంబ్లీలో ఒక గొంతుకు కావాలని అది కమ్యూనిస్టు పార్టీకి చెందిన అభ్యర్థి మూలం రమేష్ వల్లే సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, మత విద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. దాంతో జతకట్టిన టిడిపి–జనసేనలను, నిరంకుశ వైసిపిని ఓడించాలన్నారు. బిజెపి–టిడిపి–జనసేన కూటమి, వైసిపి అభ్యర్థులు ఇబ్బడిముబ్బడిగా నగదు, మద్యం పంపిణీ చేసి ఓట్లు కొనుగోలు చేసి రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి సంపాదనకు ఒక సాధనంగా మార్చుకుంటు న్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలు లేవని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని, ధరలు ఆకాశాన్నంటు తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు బతుకుదెరువు ఒక సమస్యగా మారిపోయిన ఈ రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేసే సిపిఎం అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లాలో జెన్‌కోను ప్రయివేటీకరణ చేయకుండా అడ్డుకున్నామంటే అది సిపిఎం, ట్రేడ్ యూనియన్లు చేసిన పోరాట ఫలితమే అని గుర్తు చేశారు. సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి, అభ్యర్థి మూలం రమేష్ మాట్లాడుతూ... తాము ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో స్థానికులు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అనుమతులు లేవంటూ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరాటం చేస్తుందన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా

- వెబ్‌క్యాస్టింగ్,జిపిఎస్‌తో అనుసంధానం
- ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు వెబ్‌క్యాస్టింగ్, జిపిఎస్ సాంకేతికత ద్వారా నిఘా పెంచేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఎమ్‌డిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. మద్యం తయారీ సంస్థలు, మద్యం గోడౌన్లలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, మద్యం తయారీ, నిల్వ చేసేటువంటి కీలక స్థానాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా సంస్థలు, గోడౌన్లకు వచ్చి వెళ్లే వాహనాలు, మద్యం తరలించే వాహనాలకు జిపిఎస్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాలన్నారు. తయారీ సంస్థల నుంచి మద్యం షాపులు, బార్లు ఇతర సంస్థలకు సరఫరా చేస్తున్న వాహనాలపై జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను అంతా వెబ్ క్యాస్టింగ్ ద్వారా గమనించేలా సిఇఒ కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేయాలన్నారు. ఈ నెల 15లోపు వెబ్‌క్యాస్టింగ్, జిపిఎస్ ట్రాకింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

రూ.100 కోట్లకు పైగా నగదు, లిక్కర్, డ్రగ్స్ జప్తు

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత నుంచి రాష్ట్రంలో రూ.100 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్ ఇతర వస్తువులను జప్తు చేశామని మీనా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్ వచ్చిన 24 గంటల్లోనే రూ.197.66 లక్షల విలువైన వస్తువులను జప్తు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.2 కోట్ల నగదు, రూ.12 కోట్లు విలువ చేసే 6,14,837.76 లీటర్ల లిక్కర్, సుమారు రూ.3 కోట్లు లక్షల విలువైన 11,54,618,90 గ్రాముల ప్రెషస్ మెటల్స్, రూ.2.42 కోట్లు విలువైన ఫ్రీ బీస్సు (ఉచితాలు), రూ.7 కోట్ల విలువైన 9,84,148 ఇతర వస్తువలను జప్తు చేశామని వివరించారు.

అందరికీ వైద్య బీమా ఎండమావే!

- లక్ష్యం చేరని పిఎంజెఎవై
- కేంద్రానికి ప్రచారం..రాష్ట్రాలపై పెను భారం
- లోపాలపై గతంలోనే నిలదీసిన కాగ్

2

శంకరరావు

తుపాకీతో కాల్చుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖలో ఎస్‌ఫిఎఫ్ కానిస్టేబుల్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిఐ రమేష్ కథనం మేరకు.. మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన పి.శంకరరావు (35) ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు వద్ద గన్‌మ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం ఉదయం ఐదు గంటలకు ఆయన విధులకు వెళ్లారు. బ్యాంకు ప్రాంగణంలో తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నది తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కవిత మళ్లీ అరెస్టు

నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న సిబిఐ

ఇప్పటికే మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేసిన ఇడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కె కవితను సిబిఐ గురువారం అరెస్టు చేసింది. మనీలాండరింగ్ కేసులో ఆమెను ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) చేసింది. తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఆమెను సిబిఐ అరెస్టు చేసింది. కేసు దర్యాప్తులో సహకరించనందున ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు కవిత భర్త అనిల్‌కు సమాచారం ఇచ్చింది. ఐపిసి 477, 120(బి), పిసి చట్టం 7 సెక్షన్ల ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. శుక్రవారం 10:30 నిమిషాలకు కవితను జైలు నుంచి నేరుగా ట్రయల్ కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం. ఈ నెల 6న దాదాపు మూడు గంటల పాటు ఆమెను సిబిఐ ప్రశ్నించింది. విచారణకు సహకరించడం లేదని, ఆమెను అరెస్టు చేసేందుకు అనుమతివ్వాలని ట్రయల్ కోర్టులో సిబిఐ అప్లికేషన్ దాఖలు చేయగా, కోర్టు అందుకు అనుమతించడంతో గురువారం ఈ అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. గత నెల 15న ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) హైదరాబాద్‌లోని కవిత నివాసంలో సోదాలు తరువాత ఆమెను అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించగా, రౌస్ ఎవెన్యూ కోర్టు న్యాయమూర్తి రెండు దఫాలుగా మొత్తం 10 రోజుల ఇడి కస్టడీకి అప్పగించారు. మళ్లీ 14 రోజులు కస్టడీ విధించారు. ఈ నెల 9న ఆ కస్టడీ గడువు ముగియడంతో ఈ నెల 23 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించారు. ప్రస్తుతం కవిత తీహార్ జైలులోని మహిళా ఖైదీలు ఉండే 6వ నెంబరు కాంప్లెక్స్‌లో ఉన్నారు.

కవిత అరెస్టు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆమె తరపు న్యాయవాది మోహిత్‌రావు అన్నారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవితను అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోర్టు వాదనల తరువాత సిబిఐ స్పెషల్ కోర్టు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమను పూర్తిగా బ్లాక్ (చీకట్లో)లో ఉంచి కవితను అరెస్ట్ చేశారని ఆరోపించారు. చట్టం ప్రకారం... ప్రతివాదులుగా తమకు నోటీసు ఇవ్వాలన్నారు. కవిత అరెస్ట్‌పై న్యాయపోరాటం చేస్తామని ఆయన వెల్లడించారు.

బౌద్ధ, జైన, సిక్కు మతాల్లోకి మారాలన్నా

మా అనుమతి తప్పనిసరి

గుజరాత్ ప్రభుత్వ హుకుం

న్యూఢిల్లీ : హిందూమతం నుంచి ఎవరైనా బౌద్ధ, జైన, సిక్కు మతాల్లోకి మారాలనుకుంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం హుకుం జారీ చేసింది. గుజరాత్ హోం శాఖ చడీచప్పుడు లేకుండా ఇందుకు సంబంధించిన ఒక సర్క్యులర్‌ను ఇటీవల జారీ చేసింది. ముందస్తు అనుమతి కోరుతూ దరఖాస్తులు అందినప్పుడు సంబంధిత కార్యాలయాలు రాజ్యాంగంలోని 25(2) అధికరణ కింద సిక్కు, జైన, బౌద్ధ మతాలు హిందూమతంలోనే చేర్చబడినందున అటువంటి మత మార్పిడికి ముందస్తు అనుమతి అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని, ఇక నుండి అలా కుదరదని ఆ సర్క్యులర్‌లో ప్రభుత్వం పేర్కొంది. మత మార్పిడికి అనుమతించేటప్పుడు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆ సర్క్యులర్ పేర్కొంది. హిందూ మతంలో కుల వివక్షకు వ్యతిరేకంగా దసరా వంటి పండగల సందర్భంలో దళితులు బౌద్ధమతంలోకి మూకుమ్మడిగా మారడం ఈ రాష్ట్రంలో సాధారణంగా జరుగుతూ ఉంటుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బౌద్ధంలోకి మారినవారు ఉన్నారు. 'హిందువుగా పుట్టినందుకు గర్వించు, హిందువుగానే జీవించు' అన్న ఫాసిస్టు ఆరెస్సెస్ నినాదానికి భిన్నంగా జరుగుతున్న ఈ పరిణామాలను బిజెపి ప్రభుత్వం అడ్డుకోవాలనుకుంది. అంతే ఆగమేఘాల మీద సర్క్యులర్ జారీ చేసింది.. హిందూమతం నుంచి బౌద్ధమతానికి మారేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించే సమయంలో కొంతమంది జిల్లా మేజిస్ట్రేట్‌లు చట్టానికి, ఆ నిబంధనలకు తప్పుగా భాష్యం చెబుతున్నారని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. గుజరాత్ బౌద్ధ అకాడమీ కార్యదర్శి రమేష్ బంకర్ మాట్లాడుతూ, బౌద్ధమతమనేది ప్రత్యేక మతమని, దీనికి హిందూమతంతో సంబంధం లేదని ఈ సర్క్యులర్ స్పష్టం చేసిందన్నారు.

నేడు ఇంటర్ ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. మార్చి ఒకటి నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,559 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ విద్యామండలి పరీక్షలు నిర్వహించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు మొత్తం 10,52,221 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలకు 10 లక్షల 2,150 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యామండలి కార్యదర్శి సౌరబ్ గౌర్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఫలితాలను resultsbie.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

పార్టీల ఎన్నికల వ్యయానికి పగ్గాల్లేవ్!

- సగానికి పైగా వాటా బిజెపిదే
- ఎన్నికల బాండ్లు ఓ పెద్ద స్కామ్

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల్లో పోటీ చేయడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. కోట్ల రూపాయల్లో అయ్యే ఖర్చును భరించడం సామాన్యులకు సాధ్యం కాదు. ప్రతి సారి ఎన్నికల వ్యయం పెరగడమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. ఎన్నికల కమిషన్ అందజేసిన సమాచారం ప్రకారం 2013-14, 2022-23 మధ్యకాలంలో దేశంలోని రాజకీయ పార్టీలన్నీ కలిపి రూ.15,647 కోట్లు ఖర్చు చేశాయి. ఇది ఇసికి వివిధ పార్టీలు సమర్పించిన లెక్కల్లో చూపిన వ్యయం మాత్రమే. వాస్తవానికి దీనికి అనేక రెట్లు అధికంగా ఖర్చయింది. పోనీ అధికారిక లెక్కలనే తీసుకున్నా రాజకీయ పార్టీలన్నీ కలిసి పెట్టిన ఖర్చులో ఒక్క బిజెపి వాటాయే 55 శాతంగా ఉంది. కాంగ్రెస్ 30 శాతం, సిపిఐ (ఎం) ఆరు శాతం ఖర్చుతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

లోక్‌సభ ఎన్నికల్లో డబ్బు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తున్నారు. 2013-14లో అన్ని పార్టీల ఎన్నికల వ్యయంలో బిజెపి వాటా 29 శాతంగా ఉంది. 2014-15 నాటికి వచ్చేసరికి ఇది 48 శాతానికి, 2019-20లో 53 శాతానికి, 2022-23లో 66 శాతానికి చేరుకుంది. ఎన్నికల వ్యయంలో కాంగ్రెస్ వాటా 2013-14లో 58 శాతంగా ఉండగా, 2014-15లో 40 శాతం, 2019-20లో 32 శాతం, 2022-23లో 22 శాతానికి పడిపోయింది.

పార్టీల వ్యయంపై పరిమితి లేదు

2019-20లో రాజకీయ పార్టీలు గరిష్ట స్థాయిలో అంటే రూ.3,073 కోట్లు దాకా ఖర్చు చేశాయి. ఇదొక రికార్డు. దేశంలో రాజకీయ పార్టీల ఎన్నికల వ్యయంపై ఎన్నికల సంఘం ఎలాంటి పరిమితి విధించ లేదు. అభ్యర్థుల ఖర్చుపైనే పరిమితి విధించింది.. చట్టంలోని ఈ లొసుగులనే పార్టీలు అవకాశంగా తీసుకున్నాయి.

ఎన్నికల ప్రచారం కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాయి. మొత్తం వ్యయంలో ఈ ప్రచార వ్యయమే అధికంగా ఉంటుంది.

ఎన్నికల బాండ్లు అతి పెద్ద స్కాము

మోడీ ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల స్కీము అతి పెద్ద స్కాముగా మారింది. కార్పొరేట్ సంస్థలు పెద్ద మొత్తంలో రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేశాయి. బిజెపి 2014 ఎన్నికల్లో మీడియా ప్రకటనల కోసం రూ.342.5 కోట్లు ఖర్చు చేస్తే, 2019 నాటికి ఆ ఖర్చు రూ.460.8 కోట్లకు పెరిగింది. పర్యటనల వ్యయం రూ.160.2 కోట్ల నుండి రూ.248 కోట్లకు, ఇతర ఖర్చులు రూ.6.7 కోట్ల నుండి రూ.201.5 కోట్లకు పెరిగాయి. ప్రచార వ్యయం రూ.32 కోట్ల నుండి రూ.83 కోట్లకు, ఇతర పార్టీలకు ఇచ్చిన డబ్బు రూ.0.2 కోట్ల నుండి రూ.73.7 కోట్లకు పెరిగింది. ర్యాలీల ఖర్చు మాత్రం రూ.89.5 కోట్ల నుండి రూ.47.7 కోట్లకు తగ్గింది. పార్టీ అభ్యర్థుల ఖర్చు రూ.83.1 కోట్ల నుండి రూ.149.1 కోట్లకు పెరిగింది.

కాంగ్రెస్ వ్యయం ఇలా...

అదే సమయంలో కాంగ్రెస్ వ్యయం రూ.516 కోట్ల నుండి రూ.820 కోట్లకు పెరిగింది. కాంగ్రెస్ మీడియా ప్రకటనలపై ఖర్చు రూ.289.1 కోట్ల నుండి రూ.411.9 కోట్లకు, పర్యటనల వ్యయం రూ.121.1 కోట్ల నుండి రూ.127.8 కోట్లకు, ఇతర ఖర్చులు రూ.19 కోట్ల నుండి రూ.22.2 కోట్లకు పెరిగాయి. ప్రచార వ్యయం రూ.24.2 కోట్ల నుండి రూ.58.6 కోట్లకు పెరగ్గా, ర్యాలీల ఖర్చు మాత్రం రూ.33.07 కోట్ల నుండి రూ.6.2 కోట్లకు తగ్గింది. పార్టీ అభ్యర్థుల ఖర్చు రూ.29.6 కోట్ల నుండి రూ.194 కోట్లకు పెరిగింది.

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు ప్రచారం కోసం పెట్టే వ్యయంలో 10.2 శాతం పెరగుదల ఉండవచ్చునని మీడియా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ గ్రూప్ ఎం అంచనా వేసింది.

అందరికీ వైద్య బీమా ఎండమావే!

- లక్ష్యం చేరని పిఎంజెఎవై
- కేంద్రానికి ప్రచారం..రాష్ట్రాలపై పెను భారం
- లోపాలపై గతంలోనే నిలదీసిన కాగ్

న్యూఢిల్లీ: దేశంలో వైద్య సేవల ఖర్చు భరించలేనంతగా పెరిగిపోతోంది. పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఏదైనా ప్రాణాంతక వ్యాధి వచ్చిందంటే ఇక అంతే సంగతులు. వైద్య బీమా ఉంటే సరేసరి. లేకుంటే...ఆ ఖర్చు తడిసిమోపెడవుతుంది. జేబులు ఖాళీ అవుతాయి. ఆస్పత్రి బిల్లులు కట్టేసరికి తల ప్రాణం తోకకు వస్తుంది. అప్పులు కూడా చేయాల్సి వస్తుంది. చివరికి కుటుంబాలు రోడ్డు మీద నిలబడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. దేశ ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పిస్తామంటూ ప్రచార బాకాలూదుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పిఎంజెఎవై) లబ్ధిదారుల దరి చేరడం లేదు.

2018 నాటికి పట్టణాలలో 19.1 శాతం, గ్రామాలలో 14.1 శాతం మందికి మాత్రమే వైద్య బీమా ఉంది. అంటే 80 శాతానికి పైగా ప్రజలు ఆస్పత్రి బిల్లులు చెల్లించాల్సిందే. ఈ నేపథ్యంలోనే పిఎంజెఎవై తీసుకొచ్చారు. దేశంలోని 15.5 కోట్ల పేద కుటుంబాలకు ఆస్పత్రి సేవలను అందిస్తామని ఘనంగా ప్రచారం దట్టించారు. దేశ జనాభాలో చివరి స్థానంలో ఉన్న 60 కోట్ల మంది లబ్ధిదారులకు దీని ద్వారా ప్రయోజనం చేకూర్చడం లక్ష్యం. ఈ పథకం కింద సంవత్సరానికి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకూ వైద్య బీమా కవరేజీ లభిస్తుంది. ప్రపంచంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఆరోగ్య బీమా పథకాలలో ఇదే అతి పెద్దదిగా మోడీ సర్కార్ ప్రచారం చేసుకుంది. కానీ ఆచరణలో ఎండమావిని తలపిస్తోంది.

40 కోట్ల మందికి బీమా లేదు

పథకంలో అనేక లోపాలు కన్పిస్తున్నాయి. దేశంలో ఔట్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్న 40 నుండి 80 శాతం మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఈ పథకం కింద చాలా రాష్ట్రాలలో వైద్యానికి అయ్యే ఖర్చులో 60 శాతం వరకూ కేంద్రమే భరించాల్సి ఉంటుంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్, ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో మొత్తం ఖర్చులో కేంద్రం 90 శాతం వరకూ చెల్లించాలి. కొన్ని చోట్ల అయితే కేంద్ర ప్రభుత్వమే పూర్తి వ్యయాన్ని భరించాలి. వాస్తవానికి కేంద్రం చెల్లిస్తున్న వైద్య ఖర్చులు చాలా తక్కువగానే ఉంటున్నాయి. రాష్ట్రాలపైనే భారం ఎక్కువగా పడుతోంది. ఈ పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ ఇంకా 40 కోట్ల మందికి వైద్య బీమా లభించపోవడం గమనార్హం.

కేంద్రం ఇచ్చింది 28శాతం మాత్రమే

ఈ పథకం ప్రస్తుతం 23 రాష్ట్రాలలో అమలవుతోంది. రాష్ట్ర స్థాయిలో తమకు వేరే ఆరోగ్య బీమా పథకాలు ఉన్నాయన్న కారణంతో పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఢిల్లీ రాష్ట్రాలు ఇందులో చేరలేదు. బడ్జెట్ ప్రకారం 2019 నుండి 2023-24 వరకూ కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ఆస్పత్రి అడ్మిషన్ల కోసం రూ.23,575.89 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి రూ.15,712,26 కోట్లు సమకూర్చాయని అంచనా. అయితే ప్రభుత్వ గణాంకాలు మరోలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 2వ తేదీ నాటికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.80,000 కోట్లు ఖర్చు చేశామని పిఎంజెఎవై డాష్‌బోర్డు తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించిన ప్రీమియం కంటే ఇది రెండు రెట్లు అదనం. మొత్తం వ్యయం రూ.80,000 కోట్లలో కేంద్రం ఇచ్చింది రూ.23,575 అయితే మిగిలింది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు భరించినట్లే కదా. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే పిఎంజెఎవై కింద రాష్ట్రాలు 72శాతం సమకూర్చితే కేంద్రం విదిల్చింది కేవలం 28శాతం మాత్రమే.

లబ్ధిదారుల ఎంపిక రాష్ట్రాలదే

ఆరోగ్యం అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశమే. అందులో సందేహం ఏమీ లేదు. అయితే ఇప్పటికే నిధుల పంపిణీ విషయంలో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆర్థికపరమైన సమస్యలు, వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పిఎంజెఎవై పథకం రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతోంది. పథకంలో ఎంతమంది లబ్ధిదారులనైనా రాష్ట్రాలు చేర్చవచ్చు. ఇందులో కేంద్రం ప్రమేయం ఉండదు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో రాష్ట్రాలు వేర్వేరు సమాచారాలను పరిగణనలోకి తీసుకున్నాయి. ఇరవై రాష్ట్రాలు 2011 నాటి జనగణన లేదా ఎస్ఈసీసీ వివరాలను ఆధారంగా చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తమ పౌర సరఫరాల విభాగాలు అందించిన సమాచారంపై ఆధారపడ్డాయి. జార్ఖండ్ వంటి కొన్ని రాష్ట్రాలు ప్రజా పంపిణీ వ్యవస్థ గణాంకాలను ప్రామాణికంగా తీసుకున్నాయి. పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, లఢక్ వంటి కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రం నిర్దేశించిన లక్ష్యాల కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా లబ్ధిదారులను ఎంపిక చేశాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాలు లక్ష్యాల కంటే 25శాతం అదనంగా లబ్ధిదారులను ఎంపిక చేసుకున్నాయి. చాలా రాష్ట్రాలు మాత్రం లక్ష్యాలకు అనుగుణంగానే వ్యవహరించాయి. ఇంకొన్ని రాష్ట్రాలు తమకు లక్ష్యంగా నిర్దేశించిన లబ్ధిదారుల సంఖ్యలో 32-80 శాతం మందిని మాత్రమే ఎంపిక చేశాయి.

కార్డుల జారీలో...

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ పథకానికి విశేష ప్రాచుర్యం కల్పించి పేదలు, మధ్య తరగతి ఓటర్లను ఆకర్షించాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో పిఎంజెఎవై కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. చాలా రాష్ట్రాలు మాత్రం దీనిపై పెద్దగా ముందడుగు వేయడం లేదు. 19 రాష్ట్రాలు జాతీయ స్థాయి (57.46శాతం) కంటే ఎక్కువగా 31 కోట్ల కార్డులు జారీ చేశాయి. 14 రాష్ట్రాలు జాతీయ స్థాయి కంటే తక్కువగానే కార్డులు ఇచ్చాయి. వీటిలో కేరళ, తమిళనాడు, కర్నాటక ఉన్నాయి. రాష్ట్ర స్థాయి పథకాలలో ఎక్కువ మంది లబ్ధిదారులను చేర్చిన ప్రభుత్వాలు, పీఎంజేఏవై లక్ష్యం కంటే తక్కువగానే కార్డులు జారీ చేశాయి. బీహార్ రాష్ట్రంలో కేవలం లక్ష్యంలో 13శాతం మాత్రమే కార్డులు జారీ అయ్యాయి.

అందుబాటులో సుమారు 30 వేల ఆస్పత్రులు

పిఎంజెఎవై పథకం కింద వైద్య సేవలు పొందడానికి 17,135 ప్రభుత్వ, 12,626 ప్రైవేటు (మొత్తం 29,761) ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఒక్కో ఆస్పత్రిలో సగటున 48 బెడ్లు ఉన్నాయి. అంటే పథకం కింద వైద్య సేవలు పొందుతున్న 31.63 కోట్ల మందికి 14.28 లక్షల బెడ్లు అందుబాటులో ఉన్నాయన్న మాట. ఈ సంఖ్య తక్కువే అయినప్పటికీ జాతీయ సగటు (వెయ్యి మందికి 0.6 బెడ్లు) కంటే మాత్రం ఎక్కువే. జాతీయ స్థాయిలో ప్రతి లక్ష మంది లబ్ధిదారులకు 9.41 ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయి. అయితే కేరళ వంటి 12 రాష్ట్రాల్లో జాతీయ స్థాయి కంటే తక్కువ సంఖ్యలోనే ఆస్పత్రులు ఈ పథకం కింద వైద్య సేవలు అందజేస్తున్నాయి. రాష్ట్రాల మధ్య మాత్రమే కాదు...రాష్ట్రంలోని కొన్ని జిల్లాల మధ్య కూడా ఆస్పత్రుల కేటాయింపు సరిగా జరగలేదు.

అవగాహనా లోపంతో...

ఈ పథకం కింద ప్రతి వెయ్యి మంది లబ్ధిదారుల్లో సగటున సుమారు 160 మంది వైద్య సేవలు పొందుతున్నారు. అయితే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, హర్యానా, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాల్లో వైద్య సేవలు పొందుతున్న వారి సంఖ్య జాతీయ సగటు (ప్రతి వెయ్యి మందికి 29 మంది) కంటే తక్కువగా ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించకపోవడమే దీనికి కారణంగా చెప్పవచ్చు. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువ సంఖ్యలో ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు.

కాగ్ అక్షింతలు

పథకం అమలులో అవకతవకలను, లోపాలను గత సంవత్సరం ఆగస్టులో కాగ్ ఎత్తిచూపింది. ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, పరికరాలు, వైద్యుల సంఖ్య తక్కువగా ఉంది. కొన్ని చోట్ల వైద్య పరికరాలు పనిచేయడం లేదు.

అనేక ఆస్పత్రులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను, ప్రమాణాలను పాటించడం లేదు. ఆస్పత్రులు కూడా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. అనేక చోట్ల ఫిర్యాదులను పరిష్కరించే నాథుడే లేడు. వ్యాధులకు ప్రత్యేక చికిత్స అందజేస్తున్న దాఖలాలు లేవు. ఒకే ఫోన్ నెంబరు లేదా పనిచేయని నెంబరుతో అనేకమంది లబ్ధిదారుల పేర్లను రిజిస్టర్ చేశారు. ఎంపికకు ముందు ఆస్పత్రులను తనిఖీ చేసి మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది లభ్యతపై సంతృప్తి చెందాల్సి ఉంటుంది. అయితే మూడు రాష్ట్రాలలో ఈ నిబంధనను పాటించలేదు. ఇక వైద్య సేవలకు అయ్యే ఖర్చుకు, బీమా కవరేజీకి మధ్య చాలా వ్యత్యాసం ఉంటోంది. ఈ తేడా 73 శాతం వరకూ ఉంటోందని అంచనా. దీంతో లబ్ధిదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దేశ జనాభాలో 30శాతం మందికి (40 కోట్లు) ఈ పథకం అందుబాటులో లేదని సాక్షాత్తూ నీతి ఆయోగ్ సంస్థే చెప్పింది.

అంతులేని అక్రమాలు

కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో రిజిస్ట్రేషన్ నడిచే ఈ పథకంలో అక్రమాలు అంతులేకుండా పోయాయి. గతేడాది ఆగస్టులోనే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదించింది. 7,49,820 మంది లబ్ధిదారులు ఒకే బెనిఫిషియరీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (బిఐఎస్)లో ఒకే మొబైల్ నంబరుతో అనుసంధానించినట్లు కాగ్ పరిశీలనలో వెల్లడైంది. ఈ పథకం అసలైన లబ్ధిదారులకు కాకుండా అక్రమార్కుల కోసమే తీసుకొచ్చినట్లు కనిపిస్తోందని అప్పట్లో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాగ్ లేవనెత్తిన లోపాలను సరిదిద్ది పేదలందరికీ ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశాయి. కానీ మోడీ సర్కార్ పట్టించుకున్న పాపాన పోలేదు.

'ఉక్కు' రక్షణకు నడుం బిగించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రజలంతా నడుంబిగించాలని, రాజకీయ పార్టీలు కలిసి రావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1155వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్ఎండి విభాగాల కార్మికులు కూర్చున్నారు. అక్కడే జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ పేదల పెన్నిధి జ్యోతిరావు పూలే అని అన్నారు. అటువంటి మహనీయుడు చూపిన మార్గంలో దేశ పాలకులు నడవాల్సి ఉండగా.. ఆ మార్గాన్ని విస్మరించి ప్రజాస్వామ్య విలువలకు పాతరేయడం తగదన్నారు. త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుని తీరుతామని స్పష్టం చేశారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేటట్లు కేంద్రం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మరు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలంటీర్ల కొనసాగింపు, వారి వేతనాల అంశాలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను వలంటీర్లతోపాటు జనం కూడా నమ్మే పరిస్థితి లేదని వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు అవకాశం ఇస్తే వలంటీర్లను తీసేసి, తిరిగి జన్మభూమి కమిటీలను తీసుకొస్తారని ఆరోపించారు. ఇంతకముందు వలంటీర్లపై అవమానకరంగా మాట్లాడారని, ఇప్పుడేమో వలంటీర్లను కొనసాగిస్తా.. వారికి రూ.పది వేలు ఇస్తా అంటూ మభ్యపెడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో గెలవలేమని తెలిసే టిడిపి గొడవలు సృష్టిస్తోందని విమర్శించారు. వృద్ధులు చనిపోతే దానిని వైసిపికి అంటకట్టాలని శవ రాజకీయాలు చేస్తున్నారన్నారు.

దేశంలోనే జెఎన్‌యుకు టాప్ ర్యాంక్

- క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2024 విడుదల
- టాప్ 500లో 69 భారతీయ విశ్వవిద్యాలయాలు

న్యూఢిల్లీ : 69 భారతీయ విశ్వవిద్యాలయాలు (యూనివర్శిటీలు) తాజాగా క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ లోకి ప్రవేశించాయి. 55 సబ్జెక్టులలో మొత్తం 424 విశ్వవిద్యాలయాలు ఎంట్రీలు అయ్యాయి. ప్రపంచ ఉన్నత విద్యా నిపుణులచే రూపొందించబడిన జాబితాలో 101 సంస్థలు ఉన్న చైనా తర్వాత భారతదేశం ఆసియాలో రెండవ అత్యధిక ప్రాతినిధ్యం కలిగిన దేశంగా నిలిచింది. ఈ సంవత్సరం మొత్తం భారతీయ ఎంట్రీలలో అత్యధికంగా 72 శాతం మంది జాబితాలోకి కొత్తవారు, వారి స్థానాలను మెరుగుపరుచుకున్నవారు లేదా కొనసాగించినవారుగా ఉన్నారు. కేవలం 18 శాతం మంది ప్రదర్శన క్షీణించింది. 16,400 యూనివర్సిటీలు నిర్వహించిన కార్యక్రమాలు, 95 దేశాలు, ద్వీపాలలోని 1,500 యూనివర్సిటీలలో విద్యార్థులు చేసిన కార్యక్రమాలు, అకాడమీ క్రమశిక్షణ, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, లైఫ్ సైన్స్, నేచ్యురల్ సైన్సు అండ్ సోషల్ సైన్స్ వంటి ఐదు విభాగాల పనితీరులను విశ్లేషించి ఈ ర్యాంకులను విడుదల చేశారు. ఈ జాబితాలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) అత్యధిక ర్యాంక్ పొందిన భారతీయ విశ్వవిద్యాలయంగా నిలిచింది. బుధవారం విడుదల చేసిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో డెవలప్‌మెంట్ స్టడీస్ సబ్జెక్ట్ కేటగిరీలో జెఎన్‌యు 20వ స్థానంలో నిలిచింది. భూగోళశాస్త్రం, చరిత్ర, ఆధునిక భాషలు, రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు, ఆంత్రోపాలజీ, ఆంగ్ల భాష, సాహిత్యం, భాషాశాస్త్రం సబ్జెక్టులలో జెఎన్‌యు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) అహ్మదాబాద్ బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సబ్జెక్టులో 22వ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. బెంగళూరు అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ సబ్జెక్టులో ఐఐఎం మొదటి స్థానంలో నిలిచింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఐఐటి బొంబాయి ఇంజనీరింగ్-మినరల్ అండ్ మైనింగ్ సబ్జెక్టులో 25వ ర్యాంక్ సాధించింది. పెట్రోలియం ఇంజినీరింగ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటిఎం) 29వ స్థానంలో నిలిచింది. క్యూఎస్ ప్రకారం, భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న పరిశోధనా కేంద్రాలలో ఒకటిగా ఉంది.

ఇషాన్, సూర్య ప్రతాపం

- బూమ్రా పాంచ్ పతాకా
- ఆర్‌సిబిపై ముంబయి ఘన విజయం

ముంబయి: ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69 పరుగులు), సూర్య కుమార్ యాదవ్ (19 బంతుల్లో 52 పరుగులు) విజృంభించడంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ముంబయి ఇండియన్స్ ఏడు వికెట్లతో ఘన విజయం సాధించింది. ఆర్‌సిబి విధించిన 197 పరుగులు లక్ష్యాన్ని ఇంకా 27 బంతులు మిగిలిఉండగానే ముంబయి ఇండియన్స్ ఛేధించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబయికి ఓపెనర్లు ఇషాన్, రోహిత్ శర్మ (24 బంతుల్లో 38 పరుగులు) మంచి శుభారంభం ఇచ్చారు. తరువాత వచ్చిన సూర్య కుమార్ ఆర్‌సిబి బౌలర్లు చుక్కలు చూపించాడు. ఈ తరువాత హర్ధిక్ పాండ్య (6 బంతుల్లో 21), తిలక్ వర్మ (10 బంతుల్లో 16) అజేయంగా నిలిచి ముంబయికి విజయాన్ని అందించారు. అంతకు ముందు ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సిబిపై స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (5/21) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. ఐపీఎల్‌లో అత్యధిక సార్లు 3కు పైగా వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు.

ఆర్‌సిబి ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు అర్థ సెంచరీలతో కదం తొక్కగా.. మరో ముగ్గురు బ్యాటర్లు సున్నా పరుగులకే నిష్క్రమించారు. గురువారం వాంఖడే స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. దినేశ్ కార్తీక్ (53 నాటౌట్, 23 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), రజత్ పాటిదార్ (50, 26 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), డుప్లెసిస్ (61, 40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

ఆ ముగ్గురు మెరువగా.. : సొంతగడ్డ వాంఖడేలో టాస్ నెగ్గిన ముంబయి ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ విరాట్ కోహ్లి (3) సహా విల్ జాక్స్ (8) పవర్‌ప్లేలోనే డగౌట్‌కు చేరుకున్నారు. కెప్టెన్ డుప్లెసిస్ (61), రజత్ పాటిదార్ (50) మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. అర్థ సెంచరీలతో మెరిసిన ఈ ఇద్దరూ బెంగళూర్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. జస్‌ప్రీత్ బుమ్రా పరుగుల పొదుపుతో పాటు రెండుసార్లు వరుస వికెట్ల ప్రతాపంతో బెంగళూర్‌ను దెబ్బకొట్టాడు. వికెట్లు పడుతున్నా దూకుడుగా ఆడిన బెంగళూర్ రన్‌రేట్ విషయంలో రాజీపడలేదు. గ్లెన్ మాక్స్‌వెల్ (0), మహిపాల్ లామ్రోర్ (0), విజయ్ కుమార్ (0)లు డకౌట్‌గా నిష్క్రమించారు. డెత్ ఓవర్లలో దినేశ్ కార్తీక్ (53 నాటౌట్) దంచికొట్టాడు. 21 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన దినేశ్ కార్తీక్ ఇన్నింగ్స్ ఆఖరు ఓవర్లో 19 పరుగులు పిండుకున్నాడు. దీంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 196 పరుగులు చేసింది.

123 మంది వలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం 123 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను అధికారులకు అందజేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి పంచాయతీ పరిధిలో 50 మంది వలంటర్లు రాజీనామా చేసి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు సమర్పించారు. పాతపట్నం మండలంలో 20 మంది, ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయిలో 49 మంది, ఇందుగుపల్లి గ్రామానికి చెందిన నలుగురు తమ విధులకు రాజీనామా చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం పేరిట
కేంద్రం మరో మోసం!

మొదటిపేజి తరువాయి

రాతపూర్వక ఆదేశాలు కూడా విశాఖ కలెక్టర్‌కు అందాయి. ఆర్‌బిఐ కోరిన మేరకు విశాఖలో భవనాన్ని కూడా సిద్ధం చేశారంటూ వార్తలు వచ్చాయి.

ఇప్పుడెందుకు ఇలా...?

రాష్ట్రంలో రాజధాని అంశంపై జరుగుతున్న వివాదం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంకు

పాలనా రాజధానిని తరలించి, అమరావతిని అసెంబ్లీ సమావేశాలకే పరిమితం చేయాలంటూ తీసుకున్న నిర్ణయాన్ని వైసిపి మినహా అన్ని పార్టీలు వ్యతిరేకించాయి. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అమరావతి ప్రాంతంలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వారి ఆందోళనలు ఉధృతంగా జరుగుతున్న సమయంలోనే విశాఖలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తామంటూ ఆర్‌బిఐ వరుసగా లేఖలు రాసింది.ఇప్పుడు రాజధాని వివాదాన్ని తెరమీదకు తీసుకువచ్చింది. ఎన్నికల వేళ ఆర్‌బిఐ తీసుకున్న ఈ చర్య ఎవరికి ఉపయోగపడుతుందో, ఎవరికి ఇబ్బందిగా మారుతుందో ప్రత్యేంగా చెప్పనవసరం లేదు. కేంద్ర ప్రభుత్వ పెద్దల ఒత్తిడి లేకుండా ఆర్‌బిఐ ఈ తరహా నిర్ణయం తీసుకుంటుందా...ఆలోచించాల్సిందే!

వైసిపివి హింసా రాజకీయాలు

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసిపి హింసా రాజకీయాలు చేస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. రౌడీయిజం చేయకపోతే పూటగడవదన్నట్లుగా వ్యవహరిస్తోందని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఒంగోలులో ప్రభుత్వం ఇచ్చే పారితోషికం తీసుకుంటూ పార్టీ ప్రచారంలో పాల్గొన్న వలంటీరును ప్రశ్నించిన ప్రభావతి కుటుంబాన్ని వైసిపి రౌడీమూక చంపేస్తామని బెదిరించిందని అన్నారు. కుటుంబానికి అండగా నిలిచిన టిడిపి నేత మోహన్‌పై మూకుమ్మడి దాడి చేశారని ఆగ్రహించారు. దాడి సమయంలో ఘటనా స్థలంలో ఉన్నప్పటికీ అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం పోలీస్ అధికారుల వైఖరి ఏంటో తెలియజేస్తోందని అన్నారు. దాడికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డే కారణమని ఆరోపించారు.

మద్యపాన నిషేధం పేరుతో రూ.లక్షల కోట్ల దోపిడీ

మద్యపాన నిషేధం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రూ.లక్షల కోట్లు దోపిడీకి పాల్పడ్డారని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు విమర్శించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బిజెపి నేత లంకా దినకర్ గురువారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి నాయకులు దోచుకున్న డబ్బులను ఎన్నికల కోసం కంటైనర్లలో తరలిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి కోడ్ నడుస్తోందని విమర్శించారు. అప్పుల బాధలు తాళలేక చనిపోయిన పోలీస్ ఉద్యోగి శంకరావు మృతికి జగనే కారణమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు.

పులివెందుల అసెంబ్లీపై ప్రత్యేక దృష్టి

పులివెందుల అసెంబ్లీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి నేత కనకమేడల రవీంద్ర లేఖ రాశారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలని ఇసిఐ ఆదేశించినా అధికార పార్టీ ఒత్తిడితో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పెంచాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - అచ్యుతాపురం (అనకాపల్లి)

అమల శేఖర్ జ్యోతి ప్రకాష్

బైక్‌ను లారీ ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ సంఘటన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గురు వారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దుక్కుతూరుకు చెందిన గొల్లపల్లి శేఖర్ (19), జంగుళూరుకు చెందిన దూది జ్యోతి ప్రకాష్ (14) స్నేహితులు. వారిద్దరూ ఎస్‌టిబిఎల్ సినిమా హాలు వద్ద జ్యూస్ పార్లర్ నడుపుతున్న దుక్కుతూరుకు చెందిన నర్మాల అమల (38) వద్ద జ్యూస్ తాగేందుకు వచ్చారు. అనంతరం వారు బైకుపై బయలుదేరుతుండగా అచ్యుతాపురంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లాలని, అక్కడి వరకూ తనను తీసుకెళ్లాలని అమల కోరారు. దీంతో ముగ్గురూ కలిసి బైకుపై బయలుదేరారు. ఎన్‌టిపిసి నుంచి రాజమండ్రికి ఫ్లయాష్ బూడిదను తరలిస్తున్న లారీ అచ్యుతాపురం వద్ద వీరి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యారు. ప్రమాద విషయం తెలిసిన మృతుల కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని తమకు న్యాయం చేయాలని అచ్యుతాపురం - యలమంచిలి రోడ్డుపై బైఠాయించారు. మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామనిసిఐ ఎం.బుచ్చిరాజు, ఎస్ఐ నారాయణరావు తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

జనసేన మూసేస్తే మంచిది : ముద్రగడ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి)

జనసేన పార్టీని మూసివేసి.. సినిమాలు చేసుకుంటే బాగుంటుందని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి కాపు ఉద్యమ నేత, వైసిపి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం విమర్శించారు. కాపు యువత జీవితాలతో ఆడుకోవద్దని, ఆ 20 సీట్లు కూడా వెనక్కి ఇచ్చేసి పార్టీని విలీనం చేసి షూటింగులకు వెళితే బాగుంటుందన్నారు. కొంతమంది తనను తెరచాటు నుంచి సపోర్టు చేయొచ్చు కదా అని అడిగారని, తాను పవన్‌కు ఎందుకు సపోర్టు చేయాలని ప్రశ్నించారు. తాడేపల్లిగూడెం మాగంటి ఫంక్షన్ హాల్లో గురువారం జరిగిన కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. జగన్ ప్రకటించిన అభ్యర్థులను బలపర్చాలని, వారి విజయానికి సహకరించాలని కోరారు. 2014లో అధికార దాహంతో ఉన్న చంద్రబాబు ఆ దాహం తీర్చుకోవడానికి కాపు, తెలగ, బలిజలకు రిజర్వేషన్లు పునరుద్ధరిస్తానని మోసగించారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయమంటే తనకు, తన కుటుంబాన్ని అవమానాలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఐదేళ్లు చంద్రబాబు పక్కనే ఉన్న పవన్ కల్యాణ్ ఏనాడైనా ముద్రగడను ఎందుకు అవమానించారని చంద్రబాబును అడిగారా? అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని అందరూ కోరుకునే వారని, చంద్రబాబు మాత్రం లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి యువగళం పాదయాత్ర పెట్టించారన్నారు. అడిగిన సీట్లు ఇవ్వకుండా, పవర్ షేరింగ్ లేకుండా కేవలం 21 సీట్లకు పవన్ కల్యాణ్ పరిమితం అయిపోవడం దారుణమన్నారు.

న్యూమిస్మాటికా ఇండికా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి సీతారామారావు తదితరులు

నాణేలు చరిత్రను బహిర్గతం చేస్తాయి

- అంబేద్కర్ వర్సిటీ విసి సీతారామారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ చరిత్ర లోహంతో ముడిపడి ఉందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బిఆర్ఎఒయు) విసి కె సీతారామారావు అన్నారు. లోహంతో తయారయ్యే నాణేలు మాత్రమే ఆయా ప్రాంత, దేశ చరిత్రను బహిర్గతపరుస్తాయని చెప్పారు. 'న్యూమిస్మాటిక్స్-దక్షిణ భారత దేశ చరిత్ర పునర్నిర్మాణం'అనే అంశంపై హైదరాబాద్‌లోని అంబేద్కర్ వర్సిటీలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ పరిశోధకులు ఈ అంశాలపై దృష్టి పెడితే చరిత్రకు సంబంధించిన మరిన్ని చారిత్రక అంశాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఎఎస్ఐ డైరెక్టర్ సత్య మూర్తి ఈ ముగింపు సదస్సులో కీలకోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పురాతన నాణేలు ప్రపంచ చరిత్రను వెలికితీసేలా చేశాయని అన్నారు. చరిత్రకారులు పురాతన నాణేలను మరింత అధ్యయనం చేయాలనీ, తవ్వకాల్లో బయటపడే నాణేలను సేకరించి మరింత లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సుధారాణి మాట్లాడుతూ.. ఈ సదస్సులో అనేక చారిత్రక ఆనవాళ్లు, విభిన్నమైన నాణేలు, వాటిపై పరిశోధనలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించామని వివరించారు. సౌత్ ఇండియన్ న్యూమిస్మాటిక్స్ సొసైటీ అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ.. సొసైటీని మరింత పటిష్ట పర్చాలనీ, దేశ చరిత్రను అధ్యయనం చేయడానికి ఈ సదస్సు దోహదపడుతుందని చెప్పారు. ఇంటాక్ (న్యూ ఢిల్లీ) గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వేద కుమార్ మాట్లాడుతూ.. చారిత్రక నేపథ్యం కలిగిన అత్యంత పురాతన నాణేలు సేకరించడంలో హైదరాబాద్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ పి అనురాధ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ చారిత్రక ఆనవాళ్లు నాణేలలో నిక్షిప్తమై ఉందనీ, యువ పరిశోధకులు చారిత్రక నాణేలను సేకరించి అధ్యయనంపై దృష్టిసారించాలని సూచించారు. ఈ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలతో కూడిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ పి చెన్నారెడ్డి రచించిన న్యూమిస్మాటికా ఇండికా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి జి.దయాకర్, డీన్ వడ్డాణం శ్రీనివాస్ సదస్సులో కార్యక్రమ వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు. అన్ని విభాగాల డీన్లు, డైరెక్టర్లు, బ్రాంచ్‌ల అధిపతులు, ఇతర విశ్వవిద్యాలయాల చరిత్రకారులు, వివిధ శాఖల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలేకు పలువురు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అధికారులు, వివిధ రాజకీయపక్ష నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. టిడిపి నాయకులు దేవినేని ఉమా మహేశ్వరరావు, బొండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, రామకృష్ణ, బిజెపి నాయకులు లంకా దినకర్, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. టిడిపి అధినేత చంద్రబాబు కూడా నివాళులర్పించారు. ఆధునిక సమాజంలో కుల నిర్మూలన ఉద్యమాలకు బీజం నాటిన తొలితరం సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కాగా, తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

14న బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్లీనరీ

ప్రజాశక్తి-గుంటూరు

భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై ఈ నెల 14న గుంటూరులో రాష్ట్ర ప్లీనరీ సమావేశం నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల హక్కుల సాధనతోపాటు, సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నామని, రాజకీయంగా కొద్ది మంది మాత్రమే వివిధ పార్టీలలో పదవులు స్వీకరించి ఎదుగుతున్నారన్నారు. సామాన్యుల జీవితాల్లో ఎలాంటి మార్పులు రావట్లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత, 2029 ఎన్నికల్లో రాజకీయంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై సమగ్రంగా చర్చించుకునేందుకు ఈ ప్లీనరీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి 26 జిల్లాల నుండి బిసి సంక్షేమ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కన్న మాస్టారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే దంపతుల ఆశయాలు స్ఫూర్తిదాయకం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పూలే దంపతుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

ప్రజాశక్తి-నెల్లూరు, ప్రకాశం

కులవ్యవస్థను నిర్మూలించేందుకు పూలే దంపతులు చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని గురువారం నెల్లూరులోని పూలే దంపతుల విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా, ప్రతి ఒక్కరినీ చదివించి తద్వారా సామాజిక విముక్తి సాధించాలన్న లక్ష్యంతో పూలే దంపతులు ఎన్నో కష్టాలు, నిర్బంధాలు ఎదుర్కొన్నారని చెప్పారు.

అటువంటి వారు నేటికీ ప్రజల మధ్య సజీవంగా ప్రజలు ఇచ్చే నినాదాల రూపంలో ఉన్నారంటే ఆనాడు వారు చేసిన త్యాగాలే కారణమన్నారు. ఆడపిల్లలకు చదువు చెప్పాలని, కుల వివక్షత రూపుమాపాలని వారు ఎన్నో పోరాటాలు చేశారని వివరించారు. ఆ పోరాటాలు రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌కు, కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. సిపిఎం తరపున జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలేకు జోహారులు అర్పిస్తూ వారి ఆశయాల సాధన కోసం పనిచేస్తామని చెప్పారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వాహనం తనిఖీ

ఎన్నికల తనిఖీలలో భాగంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వాహనాన్ని గురువారం పోలీసులు తనిఖీ చేశారు. నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లా వైపు వస్తున్న ఆయన కారును ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం, పాత శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీ చేశారు.

ఎపి భవన్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మహాత్మా జ్యోతి బా పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం నాడిక్కడ ఎపి భవన్‌లోని బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో మహాత్మా జ్యోతి బా పూలే 197వ జయంతి వేడుకలు జరిగాయి. రెసిడెంట్ కమిషనర్ (ఆర్‌సి) లవ్ అగర్వాల్, అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ (ఎఆర్‌సి) హిమాంశు కౌశిక్ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లవ్ అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి, పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పూలే సంఘ సంస్కర్త అని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు, సిబ్బంది, అతిథులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

23 వేల టీచర్ పోస్టులేవీ?

- సిఎం జగన్‌కు ఎపిసిసి అధ్యక్షులు షర్మిల ప్రశ్న

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

'జాబు రావాలంటే జగన్ కావాలని' నినాదం ఇస్తూ ఘరానా మోసానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తెరలేపారని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. జాబు కావాలంటే బాబు రావాలని టిడిపి అధినేత చంద్రబాబు చేసిన మోసం చాలదంటూ.. జగన్ కూడా ఇటువంటి నినాదం ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని గురువారం ట్విట్టర్ వేదికగా ఆమె ఆరోపించారు. '2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని గద్దెనెక్కిన మీరు అయిదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ఆత్మ విమర్శ చేసుకోండి' అని సిఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏటా జాబ్ కేలండరు అని, జంబో డిఎస్‌సి అని, ఎపిపిఎస్‌సి నుంచి వరుస నోటిఫికేషన్లు అని నమ్మించి నిరుద్యోగులను జగన్ నిండా ముంచారని, ఆయన మోసానికి బ్రాండ్ అంబాసిడర్ లాంటివారని విమర్శించారు. వైసిపి అవసరాల కోసం వలంటీరు వ్యవస్థను తెచ్చి 2 లక్షల ఉద్యోగాలు నింపామని చెప్పుకోవటం తప్పా.. గౌరవంగా చెప్పుకునే ఒక్క ఉద్యోగం అయినా భర్తీ చేశారా? అని ప్రశ్నించారు.

ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్
- ప్రకాశం జిల్లాలో పలు చెక్ పోస్టుల తనిఖీ

ప్రజాశక్తి-మద్దిపాడు, శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేసి ట్రెజరీలో జమ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా గుండ్లపల్లిలో వాహనాల తనిఖీ తీరు, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానంపై చెక్‌పోస్ట్‌లోని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు, ఇందుకు సంబంధించిన రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ వద్ద చెక్‌పోస్టును పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా అనుమానాస్పద వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. మహిళా ప్రయాణికుల బ్యాగులను కచ్చితంగా మహిళా సిబ్బందితోనే తనిఖీ చేయించాలన్నారు. జిల్లాలోని చెక్‌పోస్టుల పనితీరుపై సిఇఒ సంతప్తి వ్యక్తం చేశారు. చెక్‌పోస్టుల పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేయడానికి ప్రకాశం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో రెండు రోజులపాటు తాను పర్యటిస్తున్నట్లు ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు.

ఉగాది ఉత్సవంలో విషాదం

- 17 మందికి కరెంటు షాక్
- పది మంది చిన్నారులకు గాయాలు

కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి బంధువులతో మాట్లాడుతున్న నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు ఉగాది ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. ఉగాది ప్రభోత్సవ ఊరేగింపులో విద్యుత్ తీగలు తగిలి 17 మందికి గాయాలయ్యాయి. అందులో 10 మంది చిన్నారులు ఉన్నారు. గాయపడిన చిన్నారులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నటేకూరులో గ్రామ ప్రజలు గురువారం ఉదయం ప్రభోత్సవ ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు జరుగుతుండగా వడ్డే మద్దిలేటి ఇంటి సమీపానికి ఉత్సవ ప్రభ రాగానేఎ0

సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి షార్ట్ సర్క్యూట్ అయింది. ఎద్దుల బండిపై కూర్చున్న పది మంది చిన్నారులు, బండిని లాగుతున్న ఏడుగురు పెద్దలు కరెంటు షాక్‌కు గురయ్యారు. పెద్దలు వెంటనే తేరుకోగా చిన్నారులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. గాయపడిన చిన్నారులను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదమేమి లేదని వైద్యులు తెలిపారు. బాధిత చిన్నారులను నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరితరెడ్డి కర్నూలు జనరల్ హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు.

కిలో బంగారం పట్టివేత

- రూ.2.08 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం పలు చోట్ల పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పట్టణంలోని చెక్‌పోస్ట్ వద్ద కిలో బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలోని రాయఘడ నుంచి శ్రీకాకుళం వెళు_న్న సింహాద్రి సూరత్ అనే వ్యక్తికి చెందిన కారును తనిఖీ చేయగా బంగారం ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో పార్వతీపురం ట్రెజరీకి తరలించారు. గుంటూరు జిల్లాలో వేర్వేరు చోట్ల తనిఖీలు చేపట్టి రూ.2,08,500ల నగదు సీజ్ చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.లక్ష, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.1,08,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు.

పార్లమెంట్ ఎన్నికలపై ఎందుకు మాట్లాడరు ?

- వైసిపి, టిడిపిలకు రామకృష్ణ సూటి ప్రశ్న

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోసం తప్ప పార్లమెంట్ ఎన్నికల విషయాలపై వైసిపి, టిడిపి కూటమి నాయకులు ఎందుకు మాట్లాడడంలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది పార్లమెంట్ ఎన్నికలు అనే విషయాన్ని విస్మరించి ప్రజలను మోసగించడం దుర్మార్గమని అన్నారు. విశాఖ అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరల నియంత్రణలో మోడీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై టిడిపి, వైసిపి నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మోడీ అధికారంలోకి వస్తే ప్రాంతీయ పార్టీలను మూసేస్తారని, రాజ్యాంగం, లౌకికవాదం ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నశించాయన్నారు. రాష్ట్రంలో వైసిపికి, టిడిపి - జనసేన - బిజెపి కూటమికి వ్యతిరేకంగా ఇండియా వేదిక భాగస్వాములైన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని తెలిపారు. ఇండియా వేదిక తరుపున విశాఖ జిల్లాలో పోటీ చేస్తున్న వారిని గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం సిపిఐ అభ్యర్థి అత్తిలి విమల, పార్టీ రాష్ట్ర నాయకులు చలసాని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

త్వరలో ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం డిక్లరేషన్

- వరికి గిట్టుబాటు ధర కల్పిస్తాం
- ప్రజాగళం సభలో చంద్రబాబు
- కోనసీమను కలహాల సీమగా మార్చారు : పవన్ కల్యాణ్

పి. గన్నవరంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రోడ్‌షో

ప్రజాశక్తి - అమలాపురం, అంబాజీపేట(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

బిసిల తలరాతలకు మార్చేందుకు డిక్లరేషన్ తెచ్చామని, త్వరలోనే ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం డిక్లరేషన్ ఉంటుందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గోదావరి జిల్లాల్లో దెబ్బతిన్న కొబ్బరి పంటకు పూర్వ వైభవం తెస్తామని, వరికి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే మొదటి సంతకం మెగా డిఎస్‌సిపైనే చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం, అమలాపురం నియోజకవర్గాల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి ఆయన గురువారం రోడ్‌షో, బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అంబాజీపేటలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల సంక్షోభానికి, సమస్యలకు చెక్‌పెట్టే సమయం వచ్చిందన్నారు. సబ్ ప్లాన్ కింద ఏడాదికి రూ.30 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి బిసిలను ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బిసిల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పారు. వైసిపి పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. పోలీసులకు బకాయిపడ్డ నిధులను ప్రభుత్వం ఇవ్వలేదని ఆరోపించారు. విశాఖలో ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్ శంకర్రావు ఆర్థిక ఇబ్బందులతో చనిపోయారని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సామాజిక న్యాయమే తమ అజెండా అని అన్నారు. కోనసీమకు వన్నె తెచ్చిన వ్యక్తి బాలయోగి అని గుర్తు చేశారు. జగన్ విధ్వంస పాలనలో ప్రజలు ఎంతో నష్టపోయారని, తనతో సహా అందరూ బాధితులే.అని చెప్పారు. వైసిపి ఐదేళ్ల పాలనలో విద్యుత్ ఛార్జీలతో ప్రజల నడ్డి విరిచారని, నిత్యావసర ధరలు పెంచి పేదల పొట్టకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్‌కల్యాణ్ అని చెప్పారు. నేడు టిడిపి, జనసేన, బిజెపి కలిసి పోటీ చేస్తున్నాయని, తమ ముందు నిలబడే దమ్ము జగన్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. కాపుల్లో కూడా పేదలున్నారని, వారి కోసం ఏడాదికి రూ. 1000 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. కాపుల కోసం ఐదేళ్లలో రూ. 10 వేల కోట్లు ఖర్చు పెడతానని ప్రగల్భాలు పలికిన జగన్ కనీసం రూ.10 కోట్లు కూడా ఖర్చుపెట్టలేదని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రేమ సీమగా ఉన్న కోనసీమనుకలహాల, కొట్లాట సీమగా జగన్ మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించలేని వైసిపి ప్రభుత్వం అవసరం లేదన్నారు. కోనసీమకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని సిఎం జగన్‌ను ప్రశ్నించారు. ఈ సభలో టిడిపి పార్లమెంట్ అభ్యర్థి జి.హరీష్‌మాథూర్, పి.గన్నవరం నియోజకవర్గ జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండి టికెట్ రామరాజుకే ఇవ్వాలి !

- టిడిపి జిల్లా అధ్యక్షులు ఇంటిని ముట్టడించిన ఆ పార్టీ కార్యకర్తలు

సీతారామలక్ష్మి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజుకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉండి నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గురువారం టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి ఇంటిని ముట్టడించారు. సిట్టింగ్ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల టిడిపి అధ్యక్షుల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు నగరంలోని ఎమ్మెల్యే రామరాజు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి కార్లు, బైకులతో ర్యాలీగా జువ్వలపాలెం రోడ్డు నుంచి డిఎన్ఆర్ కాలేజీ రోడ్డు మీదుగా తోట సీతారామలక్ష్మి ఇంటికి చేరుకున్నారు. ఆమె ఇంటి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. ఇంటి పక్కనే ఉన్న జిల్లా కార్యాలయం వద్ద సీతారామలక్ష్మి మాట్లాడేందుకు సిద్ధమవ్వగా ఒక్కసారిగా కార్యకర్తలు ఆమె వైపు దూసుకొచ్చారు. దీంతో ఆమె కార్యాలయం లోపలకు వెళ్లిపోయారు. లోపలికి వెళ్లేందుకు కార్యకర్తలు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు తోసుకుంటూ కార్యకర్తలు లోపలికి వెళ్లిపోయారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకు సీటు ఇస్తా అన్న చంద్రబాబు ఎందుకు మాట తప్పారని ప్రశ్నించారు. రఘురామకృష్ణంరాజు గతంలో పార్టీలోకి వచ్చిన పది రోజులకే బయటికెళ్లి ఉండి సెంటర్‌లో సైకిల్ తగలబెట్టారని, అలాంటి వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ.. మీ ఆవేదనలో, ఆందోళనలో న్యాయం ఉందని, ఆందోళన చెందవద్దని కోరారు. ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, కార్యకర్తలు అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమెకు టిడిపి నాలుగు మండల అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యకర్తలు అక్కడి నుంచి తిరిగి రాంబాబు కార్యాలయానికి వెళ్లిపోయారు.

గాడిన పడుతున్నాం

- విస్తారా ఎయిర్‌లైన్స్ సిఇఒ వెల్లడి

న్యూఢిల్లీ : ఇటీవల పైలట్ల నుంచి తీవ్ర ఆందోళనను ఎదుర్కొన్న విస్తారా ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు తిరిగి పుంజుకుంటున్నట్లు ప్రకటించింది. గత వారం చోటు చేసుకున్న సర్వీసుల రద్దు, ఆలస్యంపై విస్తారా ఎయిర్‌లైన్స్ సిఇఒ వినోద్ కన్నన్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గడ్డు పరిస్థితులు తొలగిపోయాయని సిబ్బందితో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో పేర్కొన్నారు. కార్యకలాపాలు కూడా గాడిన పడ్డాయని తెలిపారు. ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త కాంట్రాక్టుతో వేతనాలు తగ్గుతాయని విస్తారా పైలట్లు అసంతృప్తితో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ నిర్ణయాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అనారోగ్యం సాకుతో వారంతా మూకుమ్మడిగా సెలవులు పెట్టారు. దీంతో మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 మధ్య సగానికి పైగా సర్వీసులు రద్దయ్యాయి. అర్ధంతరంగా విమానాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీనిపై విస్తారా యాజమాన్యాన్ని రెగ్యూలేటర్ డిజిసిఎ తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే ఆ సంస్థ పైలట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాజీకి వచ్చిందని సమాచారం. వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వటంతో వివాదం సద్దుమణిగినట్లు ఆ వర్గాలు తెలిపాయి. తాము ప్రణాళికలను మరింత పటిష్టంగా రూపొందించి ఉండాల్సిందని కన్నన్ పేర్కొన్నారు. ఈ అనుభవం తమకు ఒక గొప్ప గుణపాఠమని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ఆరంభం చాలా సవాళ్లతో ప్రారంభమైందని పేర్కొన్నారు. తమ ప్రయాణికుల ఇబ్బందుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించగలిగామన్నారు. విమానాల రద్దు, ఆలస్యం వల్ల ప్రభావితమైన ప్యాసింజర్లకు తగిన పరిహారం చెల్లించామన్నారు.

జెఎల్ఆర్ ఇండియా అమ్మకాల్లో 81% వృద్ధి

న్యూఢిల్లీ : భారత్‌లో లగ్జరీ కార్ల అమ్మకాలకు డిమాండ్ పెరగింది. టాటా గ్రూపునకు చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల కంపనీ జాగ్వర్ ల్యాండ్ రోవర్ (జెఎల్ఆర్) అమ్మకాలు రికార్డ్ స్థాయిలో పెరగడమే ఇందుకు నిదర్శనం. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో జెఎల్ఆర్ 81 శాతం వృద్ధితో 4,436 యూనిట్లను విక్రయించింది. 2009లో భారత మార్కెట్‌లో ప్రవేశించినప్పటి నుంచి ఇదే అత్యంత మెరుగైన అమ్మకాలని పేర్కొంది. అన్నింటింకి మించి గత ఐదేళ్లలో ఈ ఏడాది నమోదు చేసిన వృద్ధే అత్యధికమని ఆ కంపెనీ పేర్కొంది. గడిచిన ఏడాదిలో మొత్తం రిటైల్ అమ్మకాల్లో రేంజ్ రోవర్ 160 శాతం, డిఫెండర్ 120 శాతం పెరిగాయని జెఎల్ఆర్ తెలిపింది. ఇక ఈ మధ్యే ప్రారంభమైన 2024 మోడల్ డిస్కవరీ స్పోర్ట్, రేంజ్ రోవర్ ఎవోక్ ఈ ఏడాదికి 50 శాతం, 55 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. 2024 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మొత్తం రిటైల్ అమ్మకాలు 43 శాతం వృద్ధితో 854 యూనిట్లుగా నమోదయ్యాయి. "గతేడాదిలో జెఎల్ఆర్ ఇండియా రిటైల్ అమ్మకాల్లో రికార్డులను సృష్టించింది. రాబోయే రోజుల్లో మా వ్యూహాలను పెంచుకుని వృద్ధిపై మరింత దృష్టి సారిస్తాం. మా ఉత్పత్తి విభాగాల్లో, ముఖ్యంగా రేంజ్ రోవర్, డిఫెండర్ బ్రాండ్‌లలో గత ఏడాది మేము సాధించిన సానుకూల లాభాలు భారతదేశంలో అధిక నాణ్యత గల ప్రీమియం లగ్జరీ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తున్నాయి." అని జెఎల్ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబ తెలిపారు.

మెకిన్సీలో 360 ఉద్యోగుల కోత

న్యూయార్క్ : పొదుపు చర్యల్లో భాగంగా టెక్ దిగ్గజాలు వరుసగా వేటు వేస్తున్నాయి. మరోవైపు ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలకు దిగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ దిగ్గజం మెకిన్సీ 360 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. సంస్థలో పనిచేస్తున్న వారిలో 3 శాతం మందిని తొలగించే యోచనలోనూ ఉందని పేర్కొంది. డిజైన్, డేటా ఇంజినీరింగ్, క్లౌడ్, సాఫ్ట్‌వేర్ సహా పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 12,000 మంది సిబ్బందిపై ఈ లేఆఫ్స్ ప్రభావం ఉండనున్నట్లు పేర్కొంది. తొలగింపులతో పాటు పలువురు ఉద్యోగుల పనితీరుపై కూడా హెచ్చరించినట్లు తెలిపింది. సుమారు 3వేల మంది ఉద్యోగులను పనితీరులో మెరుగుదల అవసరం గురించి హెచ్చరించినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.

లక్షద్వీప్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తొలి శాఖ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తన సేవలను లక్షద్వీప్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. లక్షద్వీప్ రాజధాని కవరాట్టిలో తన శాఖను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అక్కడ ఏర్పాటు చేసిన తొలి ప్రయివేటు బ్యాంకింగ్ శాఖ ఇదే కావడం విశేషం. ఇటీవల పర్యాటకంలో లక్షద్వీప్‌కు విశేష ప్రచారం లభించడంతో భవిష్యత్తు పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని అక్కడ కొత్త శాఖను ఏర్పాటు చేసింది.

భారత వృద్ధి 7 శాతంగా ఉండొచ్చు : ఎడిబి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 7 శాతంగా ఉండొచ్చని ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) అంచనా వేసింది. ఇంతక్రితం 6.7 శాతం అంచనాతో పోల్చితే ఎక్కువ. ప్రభుత్వ, ప్రయివేటు రంగ పెట్టుబడులు పెరగడంతో పాటుగా వినియోగదారుల విశ్వాసంలోనూ మెరుగుదల వృద్ధికి మద్దతు చేయనుందని పేర్కొంది. వచ్చే 2025-26 జిడిపి 7.2 శాతం పెరగొచ్చని తెలిపింది. 2024-25లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.6 శాతంగా, 2025-26లో 4.5 శాతంగా ఉండొచ్చని తెలిపింది. ఈ ఏడాది అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 5.7 శాతానికి తగ్గొచ్చని ఎడిబి పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. మార్చి గణంకాలు వెలుపడాల్సి ఉంది.

రసవత్తరంగా బంగ రాజకీయం


ఎం.డి సలీం

సుకాంత మజుందార్

మమతా బెనర్జీ

- దీదీ, మోడీ ప్రభుత్వాలపై విమర్శల వెల్లువ
- ప్రజల వెంట వామపక్షాలు
- బలోపేతమైన ఇండియా ఫోరం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో మోడీ నియంతృత్వ పోకడలకు, మమతా బెనర్జీ అహంకార ధోరణులకు వ్యతిరేకంగా ఇండియా ఫోరం నడుమ పోరాటం జరుగుతోంది. రాష్ట్రంలో కుంభకోణాలు, అరాచక విధానాలు, ప్రభుత్వ వ్యతిరేకతతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టిఎంసి, బిజెపి, కమ్యూనిస్ట్‌- కాంగ్రెస్‌ ఫోరం మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. మమతా బెనర్జీ, బిజెపికి ఈసారి పార్లమెంటు ఎన్నికలు నల్లేరుపై నడక కాదు. 2019లో 22 నియోజకవర్గాల్లో నెగ్గిన తృణమూల్‌ కాంగ్రెస్‌,18 స్థానాల్లో గెలిచిన బిజెపికి ఈసారి ఎన్ని స్థానాల్లో నెగ్గుతాయో అన్నది చర్చనీయాంశం. వరుస స్కామ్‌ లు, స్కామ్‌ లలో చిక్కినవారిని రక్షించే వైఖరి, నార్త్‌ 24 పరగణాల జిల్లా సందేశ్‌ ఖలీలో భూకబ్జాలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ షాజహాన్‌ షేక్‌ ను రక్షించేందుకు చేసిన యత్నాలు, ప్రజల్లో టిఎంసి ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత తెచ్చిపెట్టాయి. అలాగే ధరలపెరుగుదల, నిరుద్యోగం, రైతు సమస్యలు, సిఎఎ వంటి వాటివల్ల మోడీ సర్కార్‌ వ్యతిరేకత మూటకట్టుకుంది. బెంగాల్‌లో బిజెపి కుల, మత విభజనకు పాల్పడుతుంది. అక్కడ ప్రజాస్వామ్య వాతావరణాన్ని ధ్వంసం చేస్తూ ప్రజలు ఐక్యంగా ఉండకుండా చీలికలు తెచ్చింది.

ఏ పార్టీ, ఎన్ని సీట్లలో పోటీ?

పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి, బిజెపి ఒంటరిగానే బరిలోకి దిగాయి. అప్పటి వరకు ఇండియా ఫోరంతో కలిసి నడిచిన మమత, చివరి నిమిషంలో ఒంటరిగా పోటీకి సిద్ధమైంది. బిజెపి కూడా ఒంటరిగానే పోటీ చేస్తోంది. ఇండియా ఫోరంలో భాగంగా సిపిఎం, కాంగ్రెస్‌, సిపిఐ, ఆర్‌ఎస్పి, ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీలు పోటీ చేస్తున్నాయి. టిఎంసి, బిజెపిలు 42 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియా ఫోరం పార్టీల్లో సిపిఎం 23, కాంగ్రెస్‌ 12, ఆర్‌ఎస్పి 3, సిపిఐ, ఫార్వర్డ్‌ బ్లాక్‌ లు చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియన్‌ సెక్యులర్‌ ఫ్రంట్‌ పేరుతో ముస్లింలు ప్రత్యేకగా 42 సీట్లకు పోటీ పడుతున్నారు. దీంతో పలు చోట్ల త్రిముఖ, చతుర్ముఖ పోటీలు జరిగే అవకాశం ఉంది. 2019లో మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో 22 టిఎంసి, 18 బిజెపి, 2 కాంగ్రెస్‌ గెలిచాయి.

పుంజుకున్న వామపక్షాలు

పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం, వామపక్షాలు పుంజుకున్నాయి. ప్రజా సమస్యలపై ఆందోళనలు, క్షేత్రస్థాయి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టిన సిపిఎం అందుకనుగుణంగా కార్యచరణలోకి వెళ్లింది. గ్రామ స్థాయిలో కార్యక్రమాల నిర్వహించింది. ఇటీవలి యువజన సంఘం కీలక పాత్ర పోషించింది. డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 50 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను కలుపుతూ 3 వేల కిలోమీటర్ల మేర "ఇన్సాఫ్‌" యాత్ర జరిగింది. 12 లక్షల మంది ప్రజలు భాగస్వామ్యమయ్యారు. అనంతరం కలకత్తాలోని బ్రిగేడ్‌ పరేడ్‌ గ్రౌండ్‌ లో జస్టిస్‌ ర్యాలీ నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా బెంగాల్‌లో సిపిఎం, వామపక్షాల పాత్ర మీడియాలో చర్చనీయాంశం అయింది.

సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

రాజధాని కలకత్తాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సిపిఎం తరపున ఈసారి ఎక్కువ మంది యువకులు పోటీ చేస్తున్నారు. విద్యార్థి, యువజన నాయకులు, న్యాయవాది, ఉపాధ్యాయ రంగాల నేతలు బరిలో ఉన్నారు. సిపిఎం పోటీ చేసే 23 స్థానాల్లో 20 మంది అభ్యర్థులు 45 ఏళ్ల లోపు వారే ఉన్నారు. బిజెపి ఎన్నికల బాండ్లు, మతోన్మాదం, రాష్ట్ర టిఎంసి ప్రభుత్వ అవినీతి, స్థానికంగా సంచలనం కలిగించిన సందేశ్‌ఖలి అంశాలపై ఎక్కుపెట్టారు. సిపిఎం నేత సుజన్‌ చక్రవర్తి డమ్‌డమ్‌ నుండి పోటీ చేస్తున్నారు. ఈ ప్రాంత కార్మికుల దుస్థితి గురించి బాగా అర్థం చేసుకున్న చక్రవర్తి ఈసారి తన గెలుపును ఆశిస్తున్నారు. జాదవ్‌పూర్‌ నుండి వామపక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన సృజన్‌ భట్టాచార్య, ముర్షిదాబాద్‌ నుండి మహ్మద్‌ సలీంలు కూడా స్థానిక సమస్యలతోపాటూ సందేశ్‌ఖలిపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. సిపిఎం తరపున మీనక్షి ముఖర్జీ, శత్రూప్‌ ఘోష్‌, అభాస్‌ రాయ్‌ చౌదరి, ఎండి సలీంలు ప్రచారం చేస్తున్నారు.

సామాజిక సమీకరణాలు మత సామరస్యానికి విఘాతం

పశ్చిమ బెంగాల్‌లో అన్ని సామాజిక వర్గాలు బలంగా ఉన్నాయి. అక్కడ మైనార్టీలు కూడా బలమైన ప్రజా సమూహంగా ఉన్నారు. అయితే బిజెపి మతోన్మాద చర్యలతో రాజకీయ పబ్బం గడుపుకోవడానికి తీవ్రమైన కుట్రలు పన్నుతోంది. మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీలను ఉసిగొల్పుతోంది. సిపిఎం నేతృత్వంలోని 34 ఏళ్ల వామపక్ష ప్రభుత్వ హయంలో మత హింసకు చోటు లేదు. మమతా బెనర్జీ వచ్చిన తరువాత, రాష్ట్రంలో బిజెపికి అవకాశం కల్పించింది. బిజెపి మెజారిటీ మత రాజకీయాలకు మమత మైనార్టీ మత రాజకీయాలకు పాల్పడుతుంది. దీంతో హింస, తగాదాలు, దాడులు పరస్పరం పెరిగుతున్నాయి. ఈ రెండు పార్టీల మత రాజకీయాలను వ్యతిరేకంగా సిపిఎం, వామపక్షాలు పోరాడుతున్నాయి. బెంగాల్‌లో ఒబిసి 17 -20 శాతం, ఒసి 15-18 శాతం, ఎస్సిలు 23.51 శాతం, ఎస్టిలు 5.8 శాతం, ముస్లింలు 30 శాతం ఉన్నారు. ఎస్సిల్లో 90 శాతం బంగ్లాదేశ్‌ మూలాలు ఉన్నవారే. అందుకే బిజెపి సిఎఎ తెచ్చి లాభపడాలని చూస్తోంది. పెద్ద నగరాల్లో ఆధిపత్యం చెలాయించే అగ్రకులాలను ఆకర్షించేందుకు బిజెపి ప్రయత్నాలు చేస్తోంది.

ప్రధాన సమస్యలు

ఎన్నికల్లో ప్రధాన అంశాలు పౌరసత్వం సవరణ చట్టం, జూట్‌ మిల్లు కార్మికులు, జూట్‌ సాగు రైతుల సమస్యలు, ధరల పెరుగుదల, ఇతర సమస్యలు ఉన్నాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పించిన జూట్‌ మిల్లులు, జూట్‌ సాగు రైతులు ప్రస్తుతం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పెరిగి పోతున్న శాంతి భద్రతల సమస్య పట్ల సామాన్య జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మమతా బెనర్జీ పరిస్థితిని అదుపు చేయలేదని కాంగ్రెస్‌, వామపక్షాలు నిలదీస్తున్నాయి. మొత్తం 42 స్థానాలున్న రాష్ట్రంలో ఏప్రిల్‌ 19 నుంచి జూన్‌ 1 వరకూ ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతాయి.

మొత్తం పార్టీలు 3,345

- గుర్తింపులేని రిజిస్టర్‌ పార్టీలు 2764
- ఉనికిలో లేనివి మరో 218 పార్టీలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో కలిపి ఏకంగా 3,345 రాజకీయ పార్టీలు ఉన్నట్లు తేలింది. ఇందులో జాతీయ పార్టీలు ఆరే ఉండగా, మిగిలినవన్నీ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు, గుర్తింపు లేకుండా కేవలం రిజిస్ట్రేషన్‌ మాత్రమే చేయించుకున్న పార్టీలు ఉన్నాయి. వీటికి అదనంగా రిజిస్ట్రేషన్‌ దశలో ఉన్నవి ఇంకొన్ని వందల్లోనే ఉన్నట్లు చెబుతున్నారు. జాతీయ పార్టీల్లో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్‌, భారత కమ్యూనిస్ట్‌ పార్టీ (మార్క్సిస్ట్‌), బహుజన్‌ సమాజ్‌ పార్టీ, ఆమ్‌ ఆద్మీ, నేషనల్‌ పీపుల్స్‌ పార్టీ ఉన్నాయి. గుర్తింపు లేకుండా, ఎన్నికల కమిషన్‌ వద్ద రిజిస్టర్‌ అయిన పార్టీలు మరో 2,764 ఉన్నట్లు తేలింది. వీటిల్లో ఆంధ్రప్రదేశ్‌లోనే పదుల సంఖ్యలో పార్టీలు ఉన్నట్లు తేలింది. తెలుగు జనతా పార్టీ, తెలుగు రాష్ట్ర శక్తి, తెలుగు విజయం, తెలుగు ప్రజాపథం, తెలుగు కాంగ్రెస్‌, తెలుగు బహుజన పార్టీలంటూ ఎనిమిది పార్టీలు ఉన్నాయి. ఆంధ్రా పేరుమీద కూడా ఆంధ్రా చైతన్య పార్టీ, రాష్ట్ర సమైక్య సమితి, పెన్షనర్ల పార్టీ, రాష్ట్ర ప్రజాసమితి వంటివి నాలుగు రిజిస్టర్‌ అయి ఉన్నాయి.

రద్దు చేసినవీ ఎక్కువే..

దేశ వ్యాప్తంగా 282 పార్టీలను డీలిస్ట్‌ చేస్తూ ఎన్నికల కమిషన్‌ నిర్ణయించింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవి ఎక్కువగానే ఉన్నాయి. వీటిల్లో అఖిల భారత మహిళా డెమొక్రటిక్‌ ఫ్రంట్‌, బి వైఎస్‌ఆర్‌ కాంగ్రెస్‌ (భారతీయ యువత సమత రాష్ట్రీయత) పార్టీ, ఇండియన్స్‌ ఫ్రంట్‌, జాతీయ తెలుగు అభివృద్ధి సేవా సమూహం, మన పార్టీ, ప్రజా భారత్‌ పార్టీ, ప్రజా చైతన్య పార్టీ, సెక్యులర్‌ డెమొక్రటిక్‌ లేబర్‌ పార్టీ, సూరజ్‌ పార్టీ వంటివి ఉన్నాయి.

ఉనికిలో లేకుండా

దేశ వ్యాప్తంగా 218 పార్టీలు ఉనికిలో లేకుండా ఉన్నాయని ఎన్నికల కమిషన్‌ గుర్తించింది. ఎన్నికల సమయంలో ఓటర్లను ఏమార్చేందుకుగానూ ఒకే పేరుతో వచ్చేలా కొన్ని పార్టీలను రిజిస్టర్‌ చేయడం కూడా పరిపాటిగా మారింది. ఈ పార్టీలు కేవలం సింబల్‌ కోసమే బరిలోకి దిగేందుకు కూడా ప్రయత్నించిన ఘటనలు కనిపించాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి అఖిలాంధ్ర మహాదేశం, ఆల్‌ ఇండియా ముక్తిదళ్‌, ఎపి నవోదయ ప్రజా పార్టీ, భారత్‌ అభ్యుదయ పార్టీ, నేషనలిస్టిక్‌ తెలంగాణ రాష్ట్ర సమితి వంటివి ఇన్‌ యాక్టివ్‌గా ఉన్నట్లు ఇసి ప్రకటించడం గమనార్హం.

ఒక్కసారీ పోటీ చేయకుండానే..

అనేక పార్టీలు తమ పేర్లను రిజిస్టర్‌ చేయించుకున్నప్పటికీ, ఎన్నికల బరిలోకి దిగేందుకు మాత్రం ప్రయత్నించడం లేదు. కేవలం వేరే ప్రధాన పార్టీలకు అనుకూలంగా వ్యవహరించేందుకే పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. కొన్ని పార్టీలు ఎన్నికల బరిలో నిలిచినా, చివరకు ఇతర పార్టీలకు ఎన్నికల వాహనాలు, ఏజెంట్లను సమకూర్చే పార్టీలుగా మారిపోతున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇంకొన్ని పార్టీలైతే ఎన్నికల బరిలో దిగడం, ఇతర ప్రధాన పార్టీల నుంచి నిధులను పొంది, తరువాత ఉపసంహరించుకోవడం పరిపాటిగా మారింది.

సీట్లు కన్నా పార్టీలు ఎక్కువ

దేశంలో 543 లోక్‌సభ స్థానాలుండగా, పార్టీలు అంతకు మించి ఆరు రెట్లు ఎక్కువగా ఉండడం ఆశ్చర్యం కలిగించేదే. అంటే ఒక్కో స్థానానికి 6.16 శాతం పార్టీలు నమోదై ఉన్నాయి. అలాగే గత ఎన్నికల్లో 8,039 మంది అభ్యర్థులు బరిలోకి దిగగా, పార్టీలు మాత్రం మూడు వేలకు పైగా ఉండడం గమనార్హం.

సికార్‌లో దూసుకెళ్తున్న అమ్రారాం

- 'ఇండియా' తరపున బరిలో సిపిఎం అభ్యర్థి
- రైతు నేతగా గుర్తింపు
- వామపక్షాలకు బలమైన కేంద్రం

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

ఆరావళి కొండల సరిహద్దులో ఉన్న సికార్‌ మండలం పాత కోటలు, హవేలీలతో నిండి ఉంది. పదేళ్లుగా సికార్‌ బిజెపికి కంచుకోటగా ఉంది. స్వామి సుమేదానంద సరస్వతి, ఆర్యసమాజ్‌ సన్యాసి, 2014, 2019లో గెలిచారు. హర్యానాకు చెందిన సుమేదానంద ఎంపిగా పూర్తిగా విఫలమయ్యారనే విషయాన్ని సికార్‌లోని బిజెపి నేతలు కూడా అంగీకరిస్తున్నారు. కానీ మోడీ, అమిత్‌ షా ద్వయం సుమేదానందాన్నే మళ్లీ బరిలోకి దింపింది. సుమేదానంద, సంఘ్‌ పరివార్‌ కోటలను బద్దలు కొట్టడానికి ఇండియా ఫోరం రైతు నాయకుడు అమ్రారామ్‌కు బాధ్యత అప్పగించింది. అమ్రారామ్‌ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి. కిసాన్‌ సభ అఖిల భారత ఉపాధ్యక్షుడు. సికార్‌లోని దోడ్‌, దాతారమ్‌గఢ్‌ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. సికర్‌ లోక్‌సభ నియోజకవర్గానికి 2006లో జరిగిన ముక్కోణపు పోటీలో ఆయనకు 1.62 లక్షల ఓట్లు వచ్చాయి.

రైతు నేతగా చారిత్రాత్మక పోరాటాలు

రైతు నేత అమ్రారామ్‌ లోక్‌సభ నియోజకవర్గ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వసుంధర రాజే హయాంలో వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఎఐకెఎస్‌ నాయకత్వంలో అమ్రారామ్‌ ఆధ్వర్యంలో జరిగిన దిగ్గజ పోరాటం రాష్ట్రాన్ని కుదిపేసింది. సచివాలయం చుట్టూ రెండు వారాలుగా సాగిన ఆందోళనకు బిజెపి ప్రభుత్వం దిగి రావాల్సి వచ్చింది. విద్యుత్‌ ఛార్జీలు, పంటల బీమా, సాగు నీరు వంటి పలు డిమాండ్లను లేవనెత్తుతూ సికార్‌, సమీప ప్రాంతాల్లో అనేక ఆందోళనలకు అమ్రారామ్‌ నాయకత్వం వహించారు. రాజస్థాన్‌లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి కూడా ఆయన నేతృత్వం వహించారు.

సికార్‌లో బిజెపి ఎన్నికల కమిటీకి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మనోజ్‌ సైనీ, అమ్రారామ్‌ బలమైన ప్రత్యర్థి అని బహిరంగంగా అంగీకరించారు. ఆయన గొప్ప వ్యక్తి అని అన్నారు. తమ సిట్టింగ్‌ ఎంపిపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని తెలిపారు కూడా. సిపిఎం జిల్లా కార్యదర్శి కిషన్‌ పారిఖ్‌ మాట్లాడుతూ సికార్‌లో 'సుత్తి కొడవలి నక్షత్రం' గుర్తుకు మంచి గుర్తింపు ఉందన్నారు. అమ్రారామ్‌ ప్రత్యర్థులు కూడా గుర్తించే వ్యక్తిత్వం ఉన్నవారని, బిజెపి సికార్‌ నుంచి పారిపోతుందని పారిఖ్‌ అన్నారు.

'సికర్‌ అతనితో ఉన్నాడు'

సికార్‌లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటైన నీమ్‌కటనాలోని హేమ్‌రాజ్‌పురాలో అభ్యర్థి పర్యటన సందర్భంగా అమ్రారామ్‌ మాట్లాడారు. నీమ్‌కటనా ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నాయకుడు సురేష్‌ మోడీ ఆయనతోనే ఉన్నారు. ఇండియా ఫోరం అభ్యర్థిని సికార్‌ ప్రజలు ఉత్సాహంగా స్వీకరిస్తున్నారని అమ్రారామ్‌ అన్నారు. "సిట్టింగ్‌ ఎంపిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. సికార్‌ లో పర్యటించడమే చాలా అరుదు. సికార్‌ ఆయన యాక్షన్‌ ఫీల్డ్‌. అది ఓటర్లకు కూడా తెలుసు" అని అన్నారు. రైతులు పూర్తి స్థాయిలో తమతోనే ఉన్నారని, రైతాంగ సమస్యలు, నియోజకవర్గంలో అభివృద్ధి లేమి, అగ్నిపథ్‌ సహా యువత సమస్యలు, ధరల పెరుగుదల, అవినీతి, బిజెపి నిరంకుశం, వంటి సమస్యలను సిపిఎం అభ్యర్థి ప్రచారాస్త్రాలుగా సంధిస్తున్నారు. కాంగ్రెస్‌తో సహా ఇండియా ఫోరంలోని ఇతర పార్టీల కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో భాగస్వాములవుతున్నారు. బిజెపిని ఓడించేందుకు సికార్‌లో ఇండియా ఫోరం ఏకమైందని అమ్రారామ్‌ అన్నారు. సికార్‌లో ఇండియా ఫోరం ఐక్యంగా ఉందని కాంగ్రెస్‌ నేత సురేశ్‌ మోడీ అన్నారు. అమ్రారామ్‌ నామినేషన్‌ దాఖలకు మాజీ ముఖ్యమంత్రి అశోక్‌ గెహ్లాట్‌, సచిన్‌ పైలట్‌, పిసిసి అధ్యక్షుడు గోవింద్‌ సింగ్‌ తోడస్రా హాజరయ్యారు. తొడస్రా సికార్‌లోని లక్ష్మణ్‌గఢ్‌ నుండి ఎమ్మెల్యే. ప్రచార కార్యక్రమాలను ఆయన సమన్వయం చేస్తున్నారు. రాజస్థాన్‌లోకాంగ్రెస్‌తో పాటు సిపిఎం, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్‌ పార్టీ, భారత్‌ ఆదివాసీ పార్టీ ఇండియా ఫోరంలో ఉన్నాయి. చురు, బికనీర్‌ వంటి నియోజకవర్గాల్లో సిపిఎంతో కలిసి ఉండడం వల్ల కాంగ్రెస్‌కు లాభం చేకూరుతుందని మోడీ అన్నారు.

బలంగా 'ఇండియా'

నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సికార్‌లోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఐదింటిని కాంగ్రెస్‌ గెలుచుకుంది. సిపిఎం దోడ్‌ నియోజకవర్గంలో రెండో స్థానంలో, దాతారంగఢ్‌లో మూడో స్థానంలో నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఫోరంలో అన్ని పార్టీలు 1.38 లక్షలకు పైగా ఓట్లను సాధించాయి. సికార్‌లోని 1.5 లక్షల మైనారిటీల ఓట్లు కూడా ప్రభావం చూపనున్నాయి.

మోడీ వస్తే సార్వత్రిక ఎన్నికలు చూడలేం...

- డీఎంకె కూటమికి అన్ని సీట్లు



ప్రజాశక్తి - చెన్నై

లోకసభ ఎన్నికల్లో ఈసారి బిజెపి మళ్లీ వస్తే దేశం మరోసారి సార్వత్రిక ఎన్నికలు చూడబోదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ అన్నారు. భారతదేశంలో ఉన్న ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా మార్చి వేసి నిరంకుశత్వాన్ని తీసుకొస్తారని మోడీపై ధ్వజమెత్తారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో డీఎంకే అధినేత స్టాలిన్‌ ఓ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యాంగం మారకుండా అడ్డుకోవడమే తమ కూటమి లక్ష్యం అన్నారు. నరేంద్ర మోడీ మళ్ళీ అధికారంలోకొస్తే ఏ ఒక్కరికీ న్యాయం జరగదన్నారు. బిజెపి దక్షిణాది రాష్ట్రాల్లో చేస్తున్న ఎన్నికల ప్రచారంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఉత్తర భారత దేశంలోనూ బిజెపి ప్రభావం క్రమంగా తగ్గుతోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రజలు బిజెపికి ఓట్లు వేయరని స్పష్టం చేశారు. ఇండియా కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థి ఎన్నికల ఫలితాల అనంతరమే తెరమీదకు వస్తారని తెలిపారు. గతంలో మన్మోహన్‌ సింగ్‌ మాదిరిగానే, ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక పీఎం అభ్యర్థిని ఇండియా కూటమి ప్రకటిస్తుందన్నారు. ఇండియా కూటమిలో ప్రధాని అభ్యర్థులుగా సమర్థులైన, అనుభవం గల నేతలు చాలామంది ఉన్నారని గుర్తు చేశారు. కచ్చతీవు ద్వీపం వ్యవహారంపై మాట్లాడుతూ.. ప్రధాని మోడీ శ్రీలంకను చాలాసార్లు సందర్శించారు. ఎందుకు ఒక్కసారి కూడా కచ్చతీవు గురించి ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ఎన్నికలవేళ కచ్చ తీవు వ్యవహారంపై మోడీ మొసలి కన్నీరు కారుస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే కూటమికి 38 ఎంపీ సీట్లు వచ్చాయన్నారు. డీఎంకెకి 23, కాంగ్రెస్‌ కి 8, సిపిఎంకు రెండు, సిపిఐ 2, వీసీకే కి రెండు, ముస్లిం లీగ్‌ పార్టీకి ఒక ఎంపీ సీటు వచ్చిందన్నారు. ఈసారి తమకూటమికి 39కి 39 సీట్లు కచ్చితంగా వచ్చి తీరుతాయని ధీమా వ్యక్తం చేశారు.

తగ్గేదే...లే!

- 2004 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి వరుసగా ఓడిపోతున్నా సరే

పాట్నా : బీహార్‌లోని ఓ స్వతంత్ర అభ్యర్థి 2004 నుంచి వరుసగా ఓడిపోతున్నా.. గెలుపుకోసం పట్టువదలని విక్రమార్కుడిలా మళ్లీ మళ్లీ పోటీ చేస్తూనే ఉన్నారు. తగ్గేదేలే అంటున్నారీయాన. ఇప్పుడు జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కూడా తాను పోటీ చేసే నియోజవర్గంలో ఇంటింటికీ గ్యాస్‌ సిలిండర్లు ఇస్తూ తనదైనశైలిలో ప్రచారం చేస్తున్నారు. ఈ అభ్యర్థి పేరు ఛోటేలాల్‌ మహ్తో. కిషన్‌గంజ్‌ లోక్‌సభ స్థానం నుండి పోటీ చేస్తున్నారు. ఈయన 2004 నుంచీ ఇక్కడి నుంచి పోటీ చేయడం విశేషం. అందుకే మిస్టర్‌ ఎమ్మెల్యేగా ప్రసిద్ధి చెందారు. కుల రాజకీయాలు నడుస్తున్నా.. తాను మాత్రం కులాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు అడగనని తేల్చి చెప్పారు. కేవలం స్థానికులతో తనకున్న వ్యక్తిగత సంబంధాల ద్వారా మాత్రమే ఓట్లను అడుగుతున్నట్లు మహ్తో తెలిపారు.

కాలినడకనే...

ఎన్నికల ప్రచారానికి మహ్తో మోటార్‌ సైకిల్‌ని కానీ ఇతర వాహనాల్ని కానీ ఉపయోగించడు. నడుచుకుంటూ వెళ్లడమో, సైకిల్‌పైనో వెళ్లి ప్రజలను కలుస్తానని చెబుతున్నాడు. 2000లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహ్తో అభ్యర్థిగా నామినేషన్‌ దాఖలు చేశారు. అప్పటికి తన వయసు 25 ఏళ్లు నిండకపోయేసరికి ఆ నామినేషన్‌ తిరస్కరించబడింది. తర్వాత 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల్లో అతనికి 11,479 ఓట్లు వచ్చాయి. ఎన్ని తడవలు అపజయం పాలైనా తాను గెలిచేవరకూ పోటీ చేస్తూనే ఉంటానని మహ్తో చెప్పారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తాడనే ఆత్మవిశ్వాసంతో ఉన్నానని మహ్తో భార్య గీతా దేవి అన్నారు.

భార్య కోళ్లను పెంచుతుంది

ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ భార్యాభర్తలిద్దరూ నాలుగైదు సంవత్సరాలపాటు డబ్బు ఆదా చేస్తారు. బంధువులు, స్థానికుల నుండి విరాళాలు తీసుకుంటారు. నెలకు 15 వేల రూపాయలు సంపాదించే మహ్తో ఎన్నికల కోసం నాలుగు లక్షల కంటే ఎక్కువ ఖర్చుచేస్తారట. మహ్తో భార్య గీత కుటుంబాన్ని పోషించడం కోసం కోళ్లు, మేకల్ని పెంచుతుంది. నాలుగుసార్లు పోటీ చేసిన నాలుగుమార్లు మహ్తో గ్యాస్‌ సిలిండర్‌ గుర్తుపైనే పోటీ చేశారు.

కలం బాణాలు

కేంద్రం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన మారింది - పురంధరేశ్వరి

ఉక్కును కాపాడంటే
ఒత్తిఉత్తి మాటలు
ప్రైవేటే కాదంటూ
బూటకాల కోటలు

తెలుసునులే బిజెపి
కార్పోరేటు నాటకం
తేలిపోవులే రేపు
ఓట్లతోటి జాతకం



బాబా రాందేవ్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

సుప్రీం ముందా బాబా
యోగవిద్య విన్యాసం
చాచికొట్టెలే తీర్పు
తప్పదింక సన్యాసం

మోడీజీమీ జతగా
వేశారని ఆసనాలు
చెల్లేనా ఎల్లపుడు
మీ మౌఢ్యపు శాసనాలు?

చైనా భారత మైత్రి ప్రపంచానికే మంచిది

భారతచైనా స్నేహం
విశ్వహితం సదానిజం
ఆమాటే అన్నామా
విషపుదాడి పరివారం

మోడీజీ నోటివెంట
వినిపించెను ఈ సత్యం
మైత్రి నిపెంచారంటే
మహీతలం సంస్తుత్యం

- తె.ర



కృష్ణాలో హోరాహోరీ!

- పట్టుకోసం వైసిపి, విపక్ష పార్టీల యత్నాలు
- ప్రభుత్వంపై వివిధ తరగతుల్లో వ్యతిరేకత
- ఫలితాలపై ప్రభావం చూపనున్న ఇండియా వేదిక అభ్యర్థులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతోంది. జిల్లాలోని మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంతోపాటు అన్ని అసెంబ్లీ స్థానాలకూ ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. ఎన్నికల ప్రచారం జోరందుకుంది. గత ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తడంతో మచిలీపట్నం పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల వైసిపి విజయం సాధించింది. టిడిపి ఒక్క స్థానానికే పరిమితమైంది. ఆ తర్వాత ఆ ఎమ్మెల్యే వైసిపితో జతకట్టారు. ప్రభుత్వంపై వివిధ తరగతుల్లో ఉన్న వ్యతిరేకత తమకు కలిసొస్తుందని టిడిపి, జనసేన, బిజెపి కూటమి భావిస్తోంది. ప్రభుత్వం ఐదేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాలకు తోడు బందరులో పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు ఏడాది క్రితం ప్రారంభించడం, మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టి దానిని వేగంగా పూర్తి చేసి ప్రారంభించడం వంటి కార్యక్రమాలు తమను తిరిగి గెలిపిస్తాయని అధికార వైసిపి అభ్యర్థులు ధీమాతో ఉన్నారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఇండియా వేదిక అభ్యర్థులకు పడే ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉంది. పామర్రు, మచిలీపట్నం అసెంబ్లీ నియోకవర్గాల్లో ఇండియా వేదిక నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గన్నవరం నుంచి సిపిఎం అభ్యర్థి పోటీ చేస్తున్నారు.

రాజకీయ పార్టీల అభ్యర్థులు వీరే...

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ అధికార వైసిపి అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్, టిడిపి, బిజెపి బలపరిచిన జనసేన అభ్యర్థిగా సిట్టింగు ఎంపి వల్లభనేని బాలశౌరి పేర్లను ఆయా పార్టీల అధిష్టానాలు ప్రకటించాయి. ఇండియా వేదిక నుంచి అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణ కుమారుడు సింహాద్రి చంద్రశేఖర్ తొలిసారి ఎన్నిక బరిలో దిగుతున్నారు. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన బాలశౌరి ఈ ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా రంగంలో దిగారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి, సిట్టింగు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ మతీన్ పోటీ చేస్తున్నారు. పెడనలో వైసిపి నుంచి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ఉప్పాల రాము, టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు కుమారుడు కాగిత కృష్ణప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శొంఠి నాగరాజు పోటీలో ఉన్నారు. అవనిగడ్డలో వైసిపి అభ్యర్థిగా సిట్టింగు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, జనసేన అభ్యర్థిగా మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అందే శ్రీరామ్మూర్తి పోటీ చేస్తున్నారు. ఇక్కడ టిడిపి నుంచి ఇటీవల జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్‌కు పవన్‌కల్యాణ్ టికెట్ కేటాయించడాన్ని ఆ నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. పామర్రులో వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, టిడిపి అభ్యర్థిగా వర్ల కుమార్ రాజా, ఇండియా వేదిక నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా డివై దాస్ రంగంలో ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఇక్కడ ఎప్పుడూ టిడిపి గెలుపొందలేదు.

టిడిపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతలోనూ గత ఎన్నికల్లో గన్నవరం నుంచి ఆ పార్టీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ స్వల్ప ఓట్ల మెజారిటీతో రెండోసారి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో గన్నవరం నుంచి వంశీమోహన్ వైసిపి అభ్యర్థిగా పోటీలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన యార్లగడ్డ వెంకట్రావు ఓటమిపాలయ్యారు. కొద్దికాలం తర్వాత టిడిపిలో చేరిన ఆయన ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ఇండియా వేదిక నుంచి సిపిఎం పోటీ చేస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ డబ్బులను మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు పెడుతున్నారు. పెనమలూరు నుంచి అధికార వైసిపి అభ్యర్థిగా మంత్రి జోగి రమేష్, టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా ఎలిసల సుబ్రమణ్యం పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పెనమలూరు నుంచి పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి టిడిపిలో చేరారు. ఈసారి ఆయన నూజివీడు నుంచి బరిలో నిలిచారు. దీంతో, వైసిపి అధిస్టానం జోగి రమేష్‌ను పెడన నుండి తీసుకొచ్చి ఇక్కడ పోటీకి పెట్టింది. గుడివాడ నుంచి వైసిపి అభ్యర్థిగా సిట్టింగు ఎమ్మెల్యే కొడాలి నాని, టిడిపి అభ్యర్థిగా ఎన్‌ఆర్‌ఐ వెనిగండ్ల రాము, కాంగ్రెస్ అభ్యర్థిగా వడ్డాది గోవిందరావు (రాజేష్) పోటీ చేయనున్నారు. గుడివాడలో ఈసారి గట్టి పోటీ నెలకొంది.

3 నియోజకవర్గాల్లో

మైనార్టీల ఓట్లు కీలకం

కృష్ణా జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీల ఓట్లు కీలకం కానున్నాయి. పెనమలూరులో 38 వేలు, మచిలీపట్నంలో 19 వేలు, గుడివాడలో 10 వేలకుపైగా ముస్లిం మైనార్టీల ఓట్లు ఉన్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల వివక్షతో కూడిన సిఎఎను అమలు చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో బిజెపితో పొత్తు కారణంగా ముస్లిం మైనార్టీల ఓట్లు దూరమవుతాయని టిడిపి నేతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉయ్యూరులో జరిగిన సభలో టిడిపి అధినేత చంద్రబాబు... ముస్లిం మైనార్టీలకు టిడిపి అండగా ఉంటుందని ప్రధానంగా ప్రస్తావించడం గమనార్హం.

ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రణాళిక మేనిఫెస్టో ఆవిష్కరణ

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

విభజన చట్టాన్ని అమలు చేయకుండా.. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి సహకరించేలా రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వ్యవహరించడం దారుణమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయం వైపు ఆలోచించాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడ్డవారికే మద్దతునివ్వాలని కోరారు. అరకులోయలోని గిరిజన సంఘం భవనంలో ఉత్తరాంధ్ర అభివద్ధి ప్రణాళిక మేనిఫెస్టోను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి కాకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం విచారకరమన్నారు. ఈ ప్రాంతాన్ని పదేళ్లుగా అభివృద్ధి చేయకుండా పాలకులు అవకాశవాదం ప్రదర్శించారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో ఉత్తరాంధ్రలో విస్తారంగా ఉన్న అటవీ భూములను కాజేసి.. గిరిజనులను రోడ్లమీద నెట్టేయాలని పాలకులు చూస్తున్నారని తెలిపారు. సముద్రంతోపాటు సహజ వనరులు అన్నింటినీ కార్పొరేట్లపరం చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడాల్సిన టిడిపి, జనసేనలు ఆ పని చేయకపోగా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో జతకట్టడం అన్యాయమన్నారు. బిజెపికి సహకరించేలా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు.

ఒకే కుటుంబంలో ఇరు పార్టీల సీట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కుటుంబ రాజకీయాలే నడుస్తున్నాయి. కుటుంబ రాజకీయాలు పోవాలంటూనే బంధుగణాన్ని బరిలోకి దింపుతున్నారు. టిడిపి, వైసిపి అధినేతలు కూడా కుటుంబ రాజకీయాలు చేసి పైకి వచ్చిన బాపతే. ఒకరు తండ్రి ఇమేజ్ ద్వారా ముఖ్యమంత్రి కాగా, మరొకరు మామ ద్వారా మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసి ప్రస్తుతం ప్రతిపక్షనేతగా ఉన్నారు. ఇప్పుడు ఆ రెండు పార్టీల్లో కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు.

నారా-నందమూరి బంధుత్వంలో ఐదుగురు

టిడిపిలో కుటుంబానికి ఒక్కటే సీటు అని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కానీ ఈ నిబంధన ఆయన కుటుంబానికి వర్తించలేదు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన కొడుకు నారా లోకేష్ గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం, ఆయన బావమరిది, వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ అనంతపురం జిల్లా హిందూపూర్ నియోజకవర్గం నుంచి పోటీ

చేస్తున్నారు. బాలకృష్ణ చిన్న అల్లుడు, ఎం భరత్ విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు. నందమూరి, నారా కుటుంబాలతో బంధుత్వం ఉన్న దగ్గుబాటి పురందేశ్వరి రాజమండ్రి లోక్‌సభ నుంచి బిజెపి తరపున పోటీలో ఉన్నారు.

యనమల కుమార్తె, అల్లుడుకు టికెట్లు

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు టిడిపి నుంచి ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె తుని నుంచి పోటీ చేస్తుండగా, ఆయన చిన్నల్లుడు ఏలూరు పార్లమెంటు నుంచి బరిలో ఉన్నారు. ఆయన వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ కడప జిల్లా మైదుకూరు నుంచి బరిలోకి దిగనున్నారు.

కింజరాపు కుటుంబానికి మూడు టికెట్లు

ప్రస్తుతం టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నుంచి, ఆయన అన్న ఎర్రన్నాయుడు కుమారుడు రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉన్నారు. రామ్మోహన్‌నాయుడు సోదరి భర్త ఆదిరెడ్డి వాసు రాజమండ్రి సిటీ నుంచి పోటీ చేస్తున్నారు.

బరిలో వేమిరెడ్డి దంపతులు

ఇటీవల వైసిపి నుంచి టిడిపిలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబం రెండు చోట్ల పోటీ చేయనుంది. నెల్లూరు లోక్‌సభ స్థానానికి ఆయన పోటీ చేస్తుండగా, ఆయన భార్య వేమిరెడ్డి ప్రశాంతి కొవ్వూరు నుంచి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. నెల్లూరు సిటీ నుంచి మాజీమంత్రి పి నారాయణ బరిలో ఉండగా విశాఖపట్నం భీమిలి నుంచి ఆయన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు.

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల శాసనసభ నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన బాబాయి కొడుకు వైఎస్ అవినాష్ రెడ్డి కడప లోక్‌సభ నుంచి, ఆయన మేనమామ రవీంద్రనాథ రెడ్డి కమలాపురం నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. జగన్ కుటుంబంతోనే బంధుత్వం ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు నుంచి పోటీ చేయనున్నారు.

బొత్స కుటుంబానికి నాలుగు టికెట్లు

మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి వైసిపిలో నాలుగు టికెట్లు దక్కాయి. చీపురుపల్లి నుంచి ఆయన పోటీ చేస్తుండగా, ఆయన భార్య బొత్స ఝాన్సీ విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి, సోదరుడు అప్పల నరసయ్య గజపతినగరం నుంచి, తమ్ముడు వరుసైన అప్పలనాయుడు నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి వైసిపి తరపున పోటీ చేయనున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో మంత్రి ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి, ఆయన సోదరుడు ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేట నుంచి పోటీ చేయనున్నారు.

పెద్దిరెడ్డి కుటుంబానికి మూడు టికెట్లు

చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి మూడు టికెట్లు దక్కాయి. పుంగనూరు నుంచి ఆయనకు తంబళ్లపల్లి నుంచి ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, రాజంపేట లోక్‌సభ నుంచి ఆయన కొడుకు ఎంపి మిథున్ రెడ్డి బరిలోకి దిగనున్నారు.

శిల్పా, చెవిరెడ్డి, మేకపాటి, అంబటి కుటుంబాలకు చెరో రెండు

కర్నూలు జిల్లాలో శిల్పా కుటుంబానికి, చిత్తూరులో చెవిరెడ్డి కుటుంబానికి, నెల్లూరులో మేకపాటి కుటుంబానికి, గుంటూరు జిల్లాలో అంబటి కుటుంబానికి రెండు టికెట్లు చొప్పున దక్కాయి. శ్రీశైలం నుంచి శిల్పా చక్రపాణి రెడ్డి పోటీ చేస్తుండగా, ఆయన సోదరుడి కుమారుడు శిల్పా రవిచంద్రారెడ్డి నంద్యాల నుంచి బరిలో ఉన్నారు. చంద్రగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఈసారి ఒంగోలు పార్లమెంటు నుంచి పోటీలో ఉండగా, ఆయన కొడుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చంద్రగిరి నుంచి బరిలోకి దిగనున్నారు. మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి ఉదయగిరి నుంచి, ఆయన కుమారుడు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆత్మకూరు నుంచి బరిలో దిగనున్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నుంచి మంత్రిగా ఉన్న అంబటి రాంబాబు సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తున్నారు. ఇదే జిల్లా పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా రాంబాబు సోదరుడు అంబటి మురళి పోటీ చేయనున్నారు.

విజయవాడలో అన్నదమ్ముళ్ల మధ్య పోటీ

విజయవాడ లోక్‌సభ నుంచి అన్నదమ్ముళ్లు పోటీపడుతున్నారు. 2019లో టిడిపి నుంచి గెలిచిన కేశినేని శ్రీనివాస్(నాని) ఇటీవల వైసిపిలో చేరారు. చేరిన వెంటనే వైసిపి లోక్‌సభ అభ్యర్థిగా ఆయన్ను ప్రకటించింది. ఇప్పుడు టిడిపి నుంచి అతని తమ్ముడు కేశినేని శివనాథ్ (చిన్ని) బరిలో దిగనున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు నుంచి కొలుసు పార్థసారధి టిడిపి నుంచి బరిలో ఉండగా, ఆయన వియ్యంకుడు బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరు వైసిపి అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. గుంటూరు జిల్లాలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీగా ఉన్న మురుగుడు హనుమంతరావు కోడలు మంగళగిరి నుంచి పోటీ చేయనున్నారు. లావణ్య తల్లి కండ్రు కమల గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు.

సిక్కోలులో టికెట్ల లొల్లి

- ప్రధాన పార్టీలకు అసమ్మతి బెడద
- తిరగబడ్డ ఆశావహులు
- స్వతంత్ర అభ్యర్థులుగా ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

టికెట్ల ప్రకటన పూర్తయిన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో వైసిపి, టిడిపిలో అసమ్మతి రాజుకుంది. నాలుగు నియోజకవర్గాల్లో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అభ్యర్థులను మార్చాలంటూ అసమ్మతి నాయకులు పార్టీ అధిష్టానంపై పలు రూపాల్లో ఒత్తిడి తెచ్చినా అధిష్టానం వారినే మళ్లీ అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో రెండుచోట్ల అసమ్మతి నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిర్ణయించి ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టారు. మరోవైపు టిడిపి శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చి ఇబ్బందులను తెచ్చుకుంది. అధిష్టానం తీరుపై పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అభ్యర్థుల మార్పు జరుగుతుందంటూ ప్రచారం సాగడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జులు వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టిడిపి నుంచి సిట్టింగు ఎమ్మెల్యే బెందాళం అశోక్, వైసిపి అభ్యర్థిగా పిరియా విజయ, కాంగ్రెస్ అభ్యర్థిగా వైసిపి ఎంపిటిసి వసుపత్రి చక్రవర్తి రెడ్డి పోటీ చేస్తున్నారు. పలాస నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, టిడిపి నుంచి గౌతు శిరీష మళ్లీ పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మజ్జి త్రినాథ్‌బాబు బరిలో ఉన్నారు. ప్రభుత్వంపై సహజంగా ఉండే వ్యతిరేకత, గ్రూపుల పోరు వైసిపికి బలహీనతగా ఉంది. టిడిపి అభ్యర్థిగా గౌతు శిరీష 2019లో ఓటమిపాలైన తర్వాత కొంత సానుభూతి, శ్రేణులు కలిసికట్టుగా పనిచేయడం బలంగా కనబడుతోంది. కాంగ్రెస్ పార్టీ తరపున మజ్జి కుటుంబం నుంచి ఆయన కుమారుడు మజ్జి త్రినాథ్‌బాబు పోటీ చేస్తుండడం, కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుతో వైసిపికి నష్టం కలిగించవచ్చన్న చర్చ నడుస్తోంది.

టెక్కలిలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, సిట్టింగు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. పార్టీలో గ్రూపులు, దువ్వాడ శ్రీనివాస్ సతీమణి దువ్వాడ వాణి సైతం శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం బలహీనతగా ఉన్నాయి. 2019 ఎన్నికల తర్వాత వైసిపిలోకి వెళ్లిన టిడిపి శ్రేణులు మళ్లీ పార్టీలోకి వస్తుండడంతో కొంత బలంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరపున కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పోటీ చేస్తున్నారు. ఆమె 2003లో కాంగ్రెస్‌లో చేరి 2004 ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపిగా పోటీ చేశారు. టిడిపి అభ్యర్థి కింజరాపు ఎర్రన్నాయుడు చేతిలో ఓటమిపాలయ్యారు. 2009 ఎన్నికల్లో ఎర్రన్నాయుడును ఓడించారు. నరసన్నపేటలో మాజీ డిప్యూటీ సిఎం, సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరోసారి పోటీ పడుతున్నారు. ధర్మాన కృష్ణదాస్ సతీమణి పద్మప్రియ, కుమారుడు కృష్ణచైతన్య తీరుతో తీవ్ర విసిగివేశారిన నాలుగు మండలాల నాయకులు ఎన్నికల్లో ఆయనను ఓడిస్తామని చెప్తున్నారు. అభ్యర్థుల ప్రకటనకు ముందు వారంతా సమావేశమై కృష్ణదాస్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎం నరసింహమూర్తి పోటీచేస్తున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసిపి తరపున రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, టిడిపి తరపున గొండు శంకర్, కాంగ్రెస్ అభ్యర్థిగా పైడి నాగభూషణరావు బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి టికెట్ నిరాకరించడంతో టిడిపి శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు.. గుండ కుటుంబాన్ని పిలిచి మాట్లాడారు. నాలుగైదు రోజుల్లో ఒక నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు.

పాతపట్నం నియోజకవర్గంలో వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టిడిపి అభ్యర్థిగా మామిడి గోవిందరావు పోటీ పడుతున్నారు. మాజీ ఎమ్యెల్యే కలమట వెంకటరమణకు టిడిపి టికెట్ నిరాకరించడంతో పార్టీ శ్రేణులు ఆగ్రహిస్తున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు.. కలమట వెంకటరమణను పిలిచి మాట్లాడారు. నాలుగైదు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తామన్నారు. టికెట్ దక్కకపోతే ఆయన ఇండిపెండెంట్‌గా బరిలో దిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కొప్పురౌతు వెంకటరావు ప్రభావంతో వైసిపికి నష్టం కలుగుతుందనే చర్చ నడుస్తోంది.

ఆమదాలవలస నియోజకవర్గం నుంచి శాసనసభాపతి తమ్మినేని సీతారాం, టిడిపి నుంచి మాజీ విప్ కూన రవికుమార్ పోటీ చేస్తున్నారు. తమ్మినేని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ పొందూరు మండలానికి చెందిన సువ్వారి గాంధీ ఇండిపెండెంటుగా ప్రచారం సాగిస్తున్నారు. నియోజకవర్గ వైసిపి నాయకులు ప్రచారానికి దూరంగా ఉండటం వైసిపికి మైనస్‌గా మారింది. మరోవైపు ఒకరిద్దరు నాయకులు ఇండిపెండెంట్లుగా బరిలో దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి సనపల అన్నాజీరావు పోటీ చేస్తున్నా పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఎచ్చెర్ల సీటును బిజెపికి కేటాయించడంతో అభ్యర్థిగా ఎన్ ఈశ్వరరావు పోటీ చేస్తున్నారు. ఈయన గతంలో టిడిపి నాయకుడిగా ఉండటం, సీనియర్ నాయకుడు కళా వెంకటరావు అనుచరుడు కావడంతో టిడిపి శ్రేణులు సహకరిస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై వ్యతిరేకత, గ్రూపుల పోరు ఆ పార్టీకి మైనస్‌గా మారాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి కరిమజ్జి మల్లేశ్వరావు పోటీ చేస్తున్నారు.

రామ్మోహన్ నాయుడు హ్యాట్రిక్ కొట్టేనా..?

శ్రీకాకుళం ఎంపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు టిడిపి నుంచి పోటీ చేస్తున్నారు. కళింగ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేరాడ తిలక్‌ను వైసిపి తన అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ప్రచారంపై దృష్టి సారించారు తప్ప ఎంపి అభ్యర్థి విషయాన్ని పట్టించుకోకపోవడం మైనస్‌గా ఉంది. పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో కలమట, గుండ కుటుంబాలకు టికెట్లు నిరాకరిస్తే మాత్రం కొంత కష్టంగా మారే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది.

1967 ఎన్నికల్లో భారీగా ఇండిపెండెంట్ల ఎన్నిక

1952 నుంచి 1966 వరకూ ప్రభుత్వాలు రకరకాల ఒడుదుడుకులతో నడిచినా.. పెద్ద సంచలనాత్మకమైన సంఘటనలు మాత్రం 1967 ఎన్నికలకు కొద్దికాలం ముందు జరిగాయి. విశాఖ ఉక్కు ఉద్యమం రాష్ట్రంలో ఎంతో సంచలనం కలిగించింది. ఐదేళ్ల పదవీ కాలానికి ప్రతిసారీ ముఖ్యమంత్రులు మారడం, లేదా రాష్ట్ర భౌగోళిక స్వరూపాల్లో మార్పులు జరగడం (రాష్ట్ర విభజనలు, కొత్త కలయికల)తో అన్నీ సంచలనాలకు దారితీశాయి. విశాఖలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని.. 1967లో సార్వత్రిక ఎన్నికలు జరగడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఉద్యమం రాజుకుంది. ఈ ఉద్యమంలో సుమారు 32 మంది పోలీసు కాల్పుల్లో ఆహుతి అయ్యారు. దాదాపు 70 మంది శాసనసభ్యులు రాజీనామా చేయడం అప్పటివరకూ జరిగిన రాజకీయ చరిత్రలో సంచలనం. సిపిఐకి చెందిన 30 మంది శాసనసభ్యులు, సిపిఐ(ఎం)కు చెందిన 21 మంది శాసనసభ్యులు, స్వతంత్ర పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు, నేషనల్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన ఇద్దరు, కమ్యూనిస్టు సానుభూతిపరులైన నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. దీంతో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు అంకురార్పణ ఏర్పడింది.

పి.వి. నరసింహారావు

కాసు బ్రహ్మానందరెడ్డి

గౌతు లచ్చన్న

1967 శాసనసభలో లో బలాబలాలు

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
కాంగ్రెస్	287	165	62,92,649	45.42
ఇండిపెండెంట్లు	401	68	36,58,928	26.41
స్వతంత్ర పార్టీ	90	29	13,63,382	9.84
సిపిఐ	104	11	10,77,499	7.78
సిపిఐ(ఎం)	83	09	10,53,855	7.61
ఆర్‌పిఐ	11	01	36,753	0.27
ఎస్‌ఎస్‌పి	08	01	49,669	0.36

రికార్డు స్థాయిలో 68 మంది ఇండిపెండెంట్ల ఎన్నిక

ఈ నేపథ్యంలో.. 1967 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఈ సారి శాసనసభ సీట్ల సంఖ్య తగ్గింది. 1962 నాటి శాసనసభలో 300 స్థానాలుండగా.. ఈ ఎన్నికలకు 287కు సీట్లు తగ్గాయి. అధికార కాంగ్రెస్ మొత్తం 287 స్థానాలకూ పోటీ చేసింది. 165 స్థానాలు గెలుచుకుంది. 62,92,649 (45.42 శాతం) ఓట్లు సాధించింది. స్వతంత్ర పార్టీ 90 స్థానాల్లో పోటీ చేసి 29 స్థానాల్లో విజయం సాధించింది. 13,63,382 (9.84 శాతం) ఓట్లు సంపాదించింది. 104 స్థానాలకు పోటీ చేసిన సిపిఐ 11 స్థానాల్లో గెలుపొందింది. 10,77,499 (7.78 శాతం) ఓట్లు సంపాదించింది. సిపిఐ(ఎం) 83 స్థానాలకు పోటీ చేసి 9 స్థానాల్లో విజయం సాధించింది. 10,53,855 (7.61 శాతం) ఓట్లు సాధించింది. ఇండిపెండెంట్లు కనీవినీ ఎరుగని రీతిలో 68 మంది గెలిచారు. దాదాపు 25 శాతం ఓట్లు సంపాదించారు. ఒక విధంగా కాంగ్రెస్ తరువాత అత్యధిక సీట్లు సంపాదించినవారు ఇండిపెండెంట్లే. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇంత మంది ఇండిపెండెంట్లు శాసనసభ్యులుగా గెలుపొందడం ఇప్పటివరకూ ఇదే మొదటిసారి.

ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి, ప్రతిపక్ష నేతగా గౌతు లచ్చన్న

కాంగ్రెస్ నేత కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రతిపక్ష నేతగా స్వతంత్ర పార్టీ నేత గౌతు లచ్చన్న ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన కాసు బ్రహ్మానందరెడ్డితోపాటు, పి.వి. నరసింహారావు, జలగం వెంగళరావు వంటివారు ఎన్నికకాగా, స్వతంత్ర పార్టీ పక్షాన ప్రధాన నాయకుడుగా గౌతు లచ్చన్న ఎన్నికయ్యారు. సిపిఐ పక్షాన పూల సుబ్బయ్య, చిట్టూరు ప్రభాకర చౌదరి వంటి వారు విజయం సాధించగా, సిపిఐ(ఎం) పక్షాన టి.నాగిరెడ్డి, రజబ్‌అలీ వంటి నేతలు గెలుపొందారు. అలాగే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) పక్షాన జె.ఈశ్వరీబాయి శాసనసభకు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పక్షాన బ్రహ్మానందరెడ్డి 1970 సెప్టెంబరు 30 వరకూ ముఖ్యమంత్రిగా పనిచేశారు. అదే తేదీ నుంచి ఆయన స్థానంలో పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 1952 నుంచి ప్రతి పదవీ కాలపరిమితిలో ఇద్దరు ముఖ్యమంత్రులు మారడం పరిపాటిగా మారింది. 1952 -55 మధ్య చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ), టంగుటూరి ప్రకాశం పంతులు, 1955-62 మధ్య బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, 1962-67 మధ్య నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, 1967-72 మధ్య కాసు బ్రహ్మానందరెడ్డి, పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రులుగా కొనసాగారు.

- యు. రామకృష్ణ

సంపాదకీయం

ప్రజల అజెండా

దేశ ప్రజలను భావోద్వేగాల్లో ముంచెత్తి, ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని కాషాయ పరివారం ఉబలాటపడుతోంది. దానికి తగ్గట్టుగానే రామమందిరం, పౌరసత్వం వంటి మత సంబంధ అంశాలను ప్రచారంలో పెట్టటానికి తన సర్వశక్తులూ, కుయుక్తులూ ప్రయోగిస్తోంది. ప్రస్తుత బతుకుల్లో ఎలాంటి మేలునీ, మార్పునూ తేలేని గతంలోని నిర్మాణాలను, వివాదాలను చర్చలోకి తెచ్చి, ఆవేశాల చిచ్చు రగిలించాలని చూస్తోంది. అదే సమయంలో, ప్రజలు మళ్లీ మళ్లీ ఆ మాయలో పడబోరని గ్రహించడం వల్ల కాబోలు; మరోపక్క ప్రతిపక్షాల మీదికి ఇడి, సిబిఐ వంటి జేబు సంస్థలను ఉసిగొల్పి, వాటి మనోధైర్యాన్ని దెబ్బ తీయాలని బరి తెగిస్తోంది.

అయితే, మోడీ షా బృందం మాయా మంత్రాంగం మరోసారి నెరవేరే పరిస్థితి కనపడడం లేదు. గుజరాత్ తరహా అభివృద్ధి అంటూ 2014 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఊదరగొట్టిన గాలి బుడగ కొద్ది రోజుల్లోనే పేలిపోయింది. మోడీ ఇచ్చిన ఏడాది రెండు కోట్ల ఉద్యోగాల హామీ కూడా ఉత్తుత్తిదేనని ఆచరణలో తేలిపోయింది. దాదాపు పదేళ్ల పాలనలో బిజెపి సాధించిన అభివృద్ధి ఏమిటో, ఇచ్చిన హామీల్లో నెరవేర్చింది ఎంతో దేశ ప్రజలకు వివరించి, ఓట్లు అడగటం సమంజసం. కానీ, ఆ విధంగా ముందుకు వెళ్లటానికి ముఖం చెల్లని కాషాయదళం భావావేశాలను రెచ్చగొట్టటం ద్వారానే పబ్బం గడుపుకోవాలని చూస్తోంది. అభివృద్ధి, ఉద్యోగాల కల్పన అంటూ గత ఎన్నికల్లో తాను ఇచ్చిన వాగ్దానాలకు తానే మంగళం పాడేసి, మతపరమైన అజెండాతో మళ్లీ మోసగించటానికి మోహరిస్తోంది.

కానీ, ప్రజలు దైనందిన జీవితాల్లోంచి, తమ జీవన స్థితిగతుల్లోంచి నెమ్మది నెమ్మదిగా వాస్తవాలను గ్రహిస్తున్నారు. తాజాగా "ది హిందూ సిఎస్‌డిఎస్ – లోక్‌నీతి" నిర్వహించిన ప్రీ పోల్ సర్వేలో జనం మనోగతం వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిపిన ఈ సర్వేలో– ప్రజలు తమ ప్రాధాన్యాంశాలు ఏమిటో స్పష్టం చేశారు. ఉద్యోగం – ఉపాధి కల్పన, ధరల నియంత్రణ తమ అత్యంత కీలకమైన అవసరాలని పేర్కొన్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో మూడింట రెండొంతుల మంది తమ జీవిక అవసరాలకే ప్రప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం ప్రజాకాంక్షకు అద్దం పడుతోంది. తాము ఉద్యోగం, ఉపాధి పొందటం, నిలుపుకోవడం ఈ ఐదేళ్ల కాలంలో అత్యంత కష్టంగా మారిందని అన్ని నివాసిత ప్రాంతాల్లోనూ 60 శాతానికి పైగానే జనం ఆవేదన వ్యక్తం చేయటం దేశంలోని నిరుద్యోగ తీవ్రతను చెప్పకనే చెబుతోంది. దళితులు, ఆదివాసీలు, ముస్లిముల్లో ఈ ఆక్రందన మరింత ఎక్కువగా ఉంది. బిజెపి హయాంలో అత్యంత వేగంగా అమలు చేస్తున్న ఉదార ఆర్థిక విధానాలు పేదలను మరింత పేదరికంలోకి, కార్పొరేట్లను శతాధిక కోట్ల లాభాల్లోకీ ఏవిధంగా నెడుతుందో ఈ సర్వేలో వెల్లడైన ఆవేదన ఒక సోదాహరణ.

ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, అనుభవాల ఆధారంగా ఎన్నికల్లోకి వెళితే– కమల నాథుల డొల్లతనమంతా బట్టబయలు అవుతుంది. పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కాలాన లాక్‌డౌన్, ప్రభుత్వరంగం నిర్వీర్యం, రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో పక్షపాతం, పెద్దఎత్తున పరిశ్రమల మూసివేత, ఉపాధి దిగ్గోత వంటి ముఖ్యమైన అంశాలన్నీ ముందుపీఠిన ప్రచారంలోకొస్తాయి. మోడీ పాలనలోని అప్రయోజకత్వం, అచేతనత్వం ప్రజలకు మరింత బాగా అర్థమవుతాయి. ఊకదంపుడు మాటలు తప్ప ఉద్ధరించింది ఏమీ లేదని తేటతెల్లమవుతుంది. ప్రశ్నించే గొంతుల మీద పేట్రేగుతున్న నిరంకుశం ఎంతో ప్రజల్లో చర్చకు వెళుతుంది. ఎలక్టోరల్ బాండ్లు తదితర పేర్లతో అడ్డగోలుగా సాగించిన 'చందా ఇచ్చుకో– దేశాన్ని దోచుకో' అన్న దందాతనం వెల్లడవుతుంది. వీటన్నిటి గురించి ప్రజల్లో చర్చ జరిగి, ఎన్నికల్లో ఆ చర్చ సారాంశమే ఫలితాలను నిర్ణయించగలిగితే– కాషాయ జట్టు తట్టా బుట్టా సర్దుకోవాల్సి ఉంటుంది. అందుకనే, అది దేశ ప్రజల తక్షణ అవసరాల మీద, దైనందిన జీవన పరిస్థితుల మీదా చర్చ జరగనివ్వదు. ప్రజలు తమ బతుకు గురించి ఆలోచిస్తూ ఉంటే, బిజెపి వారిని భావావేశాల మీదికి మళ్లించేందుకే మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూ ఉంటుంది. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల అజెండాకే ప్రాధాన్యం లభించేలా ప్రతిపక్షాలు ప్రయత్నించాలి. ఈ దేశ సంస్కృతిని, సామరస్యాన్ని, ఐక్యతని, అభివృద్ధినీ కోరుకునే ప్రతి ఒక్కరూ ప్రజల అవసరాలపైనే చర్చ జరిగేలా కృషి

నివాళి

నేడు ఎం.బి వర్ధంతి



విప్లవకర సిద్ధాంతమైన మార్క్సిజం, లెనినిజానికి చివరి వరకు కట్టుబడి, పీడిత ప్రజల విముక్తి కోసం విశిష్ట సేవలందించిన నేత మాకినేని బసవపున్నయ్య. భారతదేశంలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన వక్రీకరణలకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాటం సాగించారు. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంత వ్యాప్తికి, భారత ప్రజల విముక్తికి గణనీయమైన సేవలందించారు. మహత్తర వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులలో మాకినేని ఒకరు.

జననం: 14.12.1914 మరణం: 12.4.1992

'నమో' సర్కార్ నూరు పాపాలు

విశ్లేషణ

వి. రాంభూపాల్

బిజెపి అండ్ కో పాల్పడిన వంద కుంభకోణాల వివరాలు 'కరప్ట్ మోడీ.కామ్' వెబ్‌సైట్‌లో వున్నాయి. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన బిజెపి మంత్రులు, నేతలు దర్జాగా అధికారాన్ని చెలాయిస్తుంటే... సమాజ హితం కోసం విలువైన మేధస్సును, జీవిత కాలాన్ని ఫణంగా పెట్టిన మేధావులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష రాజకీయ నాయకులు జైళ్లల్లో మగ్గుతున్నారు. తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మతాన్ని ముసుగుగా వాడుకుంటూ, కార్పొరేట్ కంపెనీల సేవలో తరిస్తూ కోట్ల సంపదను అటు కార్పొరేట్లు, ఇటు బిజెపి నేతలు కొల్లగొడుతున్నారు. దేశభక్తి, దైవభక్తి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ...అక్రమాలకు, అవినీతికి విచ్చలవిడిగా పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని కేంద్రంలో గద్దె దించడం మనందరి కర్తవ్యం.

బిజెపి నేతలు వల్లిస్తున్న నీతిసూక్తుల తీరు చూస్తుంటే 'ఎదుటివారికి చెప్పేటందుకే నీతులు' చందంగా వుంది. 'అవినీతిపరులు వుండాల్సింది జైల్లోనే' అని ఎన్నికల సభల్లో ప్రధాని పదేపదే చెబుతున్నారు. అదే నిజమైతే 'కరప్ట్ మోడీ.కామ్' వెబ్‌సైట్ ప్రకటించిన వంద కుంభకోణాల బిజెపి వివరాలు చూస్తే ఆ పార్టీ నేతల్లో అత్యధికమంది వుండాల్సింది జైళ్లలోనే. మోడీ పాలనా కాలంలో దేశంలో, బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరిగిన అవినీతి కుంభకోణాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా దేశభద్రతకు సంబంధించిన ఆయుధాలు మొదలుకొని, ప్రజారోగ్యానికి అవసరమైన మందులు, పాఠశాలల్లో చిన్నపిల్లలకు ఇచ్చే చిక్కీల వరకు అవినీతిని సర్వవ్యాపితం చేశారు. ఇంతా చేసిన వీరే 370–400 సీట్లు ఇవ్వాలని...పరీక్షలు రాయకుండానే నూరు మార్కులు కోరుకునే రౌడీ విద్యార్థి లాగా ఈ దేశ ప్రజలను డిమాండ్ చేస్తున్నారు.

కరప్ట్ మోడీ.కామ్ వెబ్‌సైట్‌లో ఇంగ్లీషు అక్షర క్రమం 'ఎ' నుండి 'జెడ్' వరకు ఒక్కో అక్షరాన్ని క్లిక్ చేస్తే దానికి సంబంధించిన బిజెపి కుంభకోణాల జాబితా వస్తుంది. ఈ వెబ్‌సైట్ ప్రకటించిన వంద కుంభకోణాల్లో కొన్నింటిని పరిశీలిస్తే వీరి గురువింద గింజ నీతి అర్థమవుతుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డైరెక్టర్‌గా వున్న అహమ్మదాబాద్ జిల్లా కోఆపరేటివ్ బ్యాంకులో పెద్దనోట్ల రద్దు సందర్భంగా కేవలం ఐదు రోజుల్లో రూ.745.58 కోట్ల పెద్ద నోట్లు జమ అయ్యాయి. దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే ఇదో రికార్డు అవినీతి. మోడీ ప్రధాని అయిన తర్వాత అమిత్‌షా కుమారుడు జే షా కు చెందిన కంపెనీ టర్నోవర్ ఒక్క సంవత్సర కాలంలో 16 వేల రెట్లు పెరిగింది. కంపెనీ ఆదాయం కేవలం రూ.50,000 నుంచి ఒక్క ఏడాదిలోనే రూ.80,00,00,000కు పెరిగింది. ఇది ప్రపంచ ఎనిమిదో వింత! కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరణ్ రిజిజు, అతని బంధువు–కాంట్రాక్టర్ గోబోయ్ రిజిజు నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్‌లో భాగంగా రెండు ఆనకట్టల నిర్మాణంలో రూ.450 కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు ఈ విద్యుత్ సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సతీష్ వర్మ నివేదికల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయినా ఆయన కేంద్రమంత్రిగానే కొనసాగారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి డి.వి.సదానందగౌడ కర్ణాటక ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 2012 జనవరిలో మార్కెట్ ధర ఎకరం మూడు కోట్లు వున్న ప్రభుత్వ భూమిని ఎకరం కేవలం రూ.60 లక్షల చొప్పున పది ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మిన కుంభకోణంలో వున్నారు. ఇలా అనేకమంది కేంద్ర మంత్రుల అవినీతి భాగోతం ఈ వెబ్‌సైట్‌లో వుంది.

దేశంలో ఆరు అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్వహణను ప్రైవేటీకరించాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు టెండర్లు పిలిచారు. ఆరింటిలో ఐదింటిని అదానీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ దక్కించుకుంది. ఇప్పటి వరకు అదానీ గ్రూపుకు విమానాశ్రయాలు నిర్వహించిన అనుభవం ఏ మాత్రం లేకపోయినా దేశాధినేతల దీవెనలతో ఏకపక్షంగా ఆయన ఈ టెండర్ దక్కించుకోగలిగారు. అయితే కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటీకరించడాన్ని అక్కడ అధికారంలో వున్న వామపక్ష ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. అయినా కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని బేఖాతరు చేసి టెండర్ పిలిచింది. విమానాశ్రయ నిర్వహణకు ఒక్కో ప్రయాణికునికి రూ.168 ఇవ్వాలని అదానీ సంస్థ టెండర్ వేయగా, రూ.135కు మేమే నిర్వహించగలమని కేరళ రాష్ట్ర ప్రభుత్వం 'ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ద్వారా టెండర్‌లో పాల్గొన్నది. అయినా అదానీకే అప్పగించడం వెనుక కోట్ల అవినీతి, ఆశ్రిత పక్షపాతం వుంది. ప్రభుత్వ ప్రకటనలు దినపత్రికలకు, టీవీ ఛానళ్లకు ఇస్తారు. ఇందుకు భిన్నంగా మధ్యప్రదేశ్ బిజెపి ప్రభుత్వం రూ.14 కోట్లను ప్రకటనల పేరుతో వెబ్‌సైట్ పత్రికలకు ఇచ్చింది. ఈ డబ్బు పొందిన 234 వెబ్‌సైట్ పత్రికల అడ్రసే లేదు. ఒకవైపు పత్రికాస్వేచ్ఛను హరించివేస్తూ, మరోవైపు అక్రమంగా కోట్ల రూపాయలను పత్రికల పేరుతో కాజేశారు.

బిజెపి ఎంపీ ఆర్.పి.శర్మ కుమార్తె అస్సాంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అక్రమాలకు తెగబడ్డారు. పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ కావడం ఇప్పటి వరకు విన్నాం. కానీ ఇక్కడి బిజెపి నేతలు డబ్బులు తీసుకుని జవాబు పత్రాలే సప్లయి చేసి కొత్త చరిత్ర సృష్టించారు. లక్షల రూపాయల విలువచేసే చదరపు గజం భూమిని కేవలం ఒక్క రూపాయి నుండి 32 రూపాయల చొప్పున 14,305 ఎకరాల భూమిని గుజరాత్‌లో అదానీ గ్రూపుకు బిజెపి ప్రభుత్వం కేటాయించింది. మధ్యప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ ప్యాకేజి కింద రూ.3,860 కోట్లను యుపిఎ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ డబ్బుతో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని చెప్పిన బిజెపి రాష్ట్ర ప్రభుత్వం అదే పనుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి రూ. 2100 కోట్లు డ్రా చేసుకుని కుంభకోణానికి పాల్పడింది. రాజస్థాన్‌లో ప్రభుత్వ ఆరోగ్య బీమా కింద ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కయిన బిజెపి నేతలు వ్యాధులు, వైద్యం పేరుతో వేల కోట్ల రూపాయల క్లెయిమ్ చేసుకున్నారు. దీనిపై ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం కనీసం స్పందించలేదు. గుజరాత్ బిజెపి నేత నళిన్ కోటాడియా 'హవాలా' లావాదేవీల ద్వారా గుజరాత్ సిఐడి రిపోర్టు ప్రకారం రూ.5,000 కోట్లు(వాస్తవంగా రూ.88,000 కోట్లు) అక్రమ డబ్బును బిట్‌కాయిన్ (క్రిప్టో కరెన్సీ)ద్వారా మార్చాడు. ఈయన ప్రత్యక్షంగా బిజెపి కార్యక్రమాల్లో పాల్గొంటున్నా, పరారీలో వున్నట్లు పోలీసు రికార్డుల్లో వుండడం బిజెపి మాయాజాలం.

గోవా ముఖ్యమంత్రిగా వున్న రోజుల్లో మనోహర్ పారికర్ తనకు సన్నిహితుడైన నీలేష్ అమోంకర్‌కు చెందిన పట్టో ప్లాజాలోని భవంతిని రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ. 5,5,10,538 అద్దెకు తీసుకుంది. ఇది ఆ భూమి అమ్మకం ధర కంటే అధికం కావడం విశేషం. చత్తీస్‌గఢ్‌లో 2015–17 మధ్యకాలంలో 111 చిట్‌ఫండ్ కంపెనీల వల్ల 1,33,697 మంది వాటాదార్లు రూ. 484,39,18,122 మోసపోయారు. ఆ రాష్ట్రంలో జరిగిన అతి పెద్ద కుంభకోణం ఇది. లక్ష మందికి పైగా నష్టపోయిన సొమ్మును చిట్‌ఫండ్ కంపెనీల నుండి రికవరీ చేయాల్సిన రాష్ట్ర బిజెపి ప్రభుత్వం కనీస ప్రయత్నాలు చేయకపోవడంపై అనేక అనుమానాలు వున్నాయి. ఇదే రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టా 109 పవర్ ఇ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసింది. తక్కువ ధరకు ఇవ్వడానికి ముందుకు వచ్చిన కంపెనీలను కాదని ఒకే టెండర్ ద్వారా హెలికాప్టర్ ఖరీదులో 30 శాతం డీలర్‌కు కమీషన్ ఇచ్చేటట్లుగా ఒప్పందం చేసుకుంది. ఇందులో కోట్ల రూపాయల అవినీతి జరిగింది. మూడు లక్షల కంటే ఎక్కువ విలువ చేసే ఏ కొనుగోలుకైనా ఈ టెండర్ ద్వారా కొనుగోలు చేయాలనే మహారాష్ట్ర ప్రభుత్వ నిబంధనను గాలికి వదిలి పాఠశాలల పిల్లలకు అందించే చిక్కీల కాంట్రాక్టులో రూ. 206 కోట్ల కుంభకోణానికి బిజెపి ప్రభుత్వం పాల్పడింది. నాటి బిజెపి మంత్రి పంకజా ముండే అనుచరులు ఈ టెండర్లు దక్కించుకున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్రలో 2015–16లో పప్పుధాన్యాల సంక్షోభం వచ్చింది. పాలకులే కృత్రిమ కొరత సృష్టించి, ప్రజల అవసరాల పేరుతో 150 నుండి 200 శాతం అధిక ధర చెల్లించి ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానా నుండి వేల కోట్ల అవినీతి జరగడంతో పాటు, ప్రజలపై ధరల భారం పడింది. మధ్యప్రదేశ్‌లో బిజెపి నాయకుడు రాజేంద్ర సింగ్ డెంటల్ అండ్ మెడికల్ అడ్మిషన్ టెస్ట్ (డి మాట్) పరీక్షాపత్రం లీకేజి కేసులో ముద్దాయి. పది వేల కోట్ల రూపాయలకు సంబంధించిన ఈ కుంభకోణాన్ని సిబిఐ విచారించి సుప్రీంకోర్టుకు అందచేసిన అఫిడవిట్‌లో "2009 నుండి ఉద్దేశపూర్వకంగా జరిగిన డి మాట్ కుంభకోణంలో ప్రతి సంవత్సరం వేలమంది విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటా నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు పొందారా"ని చెప్పింది. అయినా ఆ బిజెపి నేతపై చర్యలులేవు.

గుజరాత్‌లో వచ్చిన భూకంపాన్ని అవినీతికి ఉపయోగించుకున్నారు నాటి రాధన్‌పూర్ బిజెపి ఎంఎల్‌ఎ. తన నియోజకవర్గ పరిధిలో దెబ్బ తిన్న పాఠశాల పునర్నిర్మాణం పేరుతో ప్రధానమంత్రి సహాయనిధి నుండి 20 లక్షల 78 వేల రూపాయలు పొంది, ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు. గుజరాత్ హైకోర్టు ఈ ఎమ్మెల్యేను దోషిగా నిర్ధారించి పది శాతం వడ్డీతో మొత్తం సొమ్ము తిరిగి చెల్లించాలని తీర్పు ఇచ్చింది. రాజస్థాన్‌లో బిజెపి మాజీ మంత్రి మదన్ దిలావర్ కుమారుడు నకిలీ సర్టిఫికెట్ల ద్వారా 'నకిలీ పైలట్ల' నియమాకాల కుంభకోణానికి పాల్పడినట్లు రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసింది. కేరళ రాష్ట్రంలో బిజెపి నాయకుడు రాకేష్ నకిలీ కరెన్సీ కేసులో త్రిసూర్‌లో అరెస్టు అయ్యాడు. రూ.20 నోట్ నుండి రూ.2 వేల నోట్ల వరకు నకిలీవి ప్రింట్ చేసినట్లు పోలీసు దర్యాప్తులో రుజువైంది. ఆయన బిజెపి అనుబంధ యువజన విభాగానికి నాయకుడయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ఎమ్మెల్సీ సరోజినీ అగర్వాల్ భర్త ఓంప్రకాష్ అగర్వాల్, కుమార్తె నీమా అగర్వాల్ సమాజ్‌వాదీ ఆవాస్ యోజన కింద ఇల్లు ఇప్పిస్తామని ఒక్కో వ్యక్తి నుండి పది లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేసుకున్నారు.

ఇలాంటి వంద కుంభకోణాల వివరాలు 'కరప్ట్ మోడీ.కామ్' వెబ్‌సైట్‌లో వున్నాయి. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన బిజెపి మంత్రులు, నేతలు దర్జాగా అధికారాన్ని చెలాయిస్తుంటే...సమాజ హితం కోసం విలువైన మేధస్సును, జీవిత కాలాన్ని ఫణంగా పెట్టిన మేధావులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష రాజకీయ నాయకులు జైళ్లల్లో మగ్గుతున్నారు. తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మతాన్ని ముసుగుగా వాడుకుంటూ, కార్పొరేట్ కంపెనీల సేవలో తరిస్తూ కోట్ల సంపదను అటు కార్పొరేట్లు, ఇటు బిజెపి నేతలు కొల్లగొడుతున్నారు. దేశభక్తి, దైవభక్తి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ అక్రమాలకు, అవినీతికి విచ్చలవిడిగా పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని కేంద్రంలో గద్దె దించడం మనందరి కర్తవ్యం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

బి.జె.పి 370 సీట్ల మైండ్ గేమ్

అభిప్రాయం

చంద్ర రాజగోపాల్



ప్రధాని నరేంద్ర మోడీ–అమిత్ షా ద్వయం, బిజెపి–దాని వాట్సప్ యూనివర్సిటీలు...బిజెపికి 370 సీట్లు, తన కూటమిలోని ఇతర పార్టీలకు మరో 30 సీట్లు... మొత్తం 400 సీట్లు సాధిస్తామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయి. ఇదో పెద్ద కుట్ర. 'ఇండియా' బ్లాక్ పార్టీల నైతిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసేందుకు, ప్రజా మైండ్ గేమ్‌ని మార్చేందుకు ఇలా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. బిజెపి 180 సీట్లు దాటడం గగనమే.

దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మొత్తం 128 లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో బిజెపి 2019 ఎన్నికలలో 29 స్థానాలు గెలిచింది. కర్ణాటకలోని 28 స్థానాలకుగాను 25 స్థానాలు, తెలంగాణలో నాలుగు స్థానాలను బిజెపి గెలిచింది. ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ రాష్ట్రంలో బిజెపి 10 స్థానాలకు పరిమితమయ్యే అవకాశం ఉన్నది. తెలంగాణలో గెలిచిన నాలుగు స్థానాలకు అటు ఇటుగా ఉండొచ్చు. తమిళనాడు, కేరళలో సీట్లు పొందే అవకాశం లేదు. తమిళనాడులో ఎన్డీఏ పక్షమైన ఏఐడీఎంకె కూడా ఇప్పుడు దూరమైంది. ఏపీలో టిడిపితో పొత్తు కుదిరినందున ఒకటో, రెండో సీట్లు రావడానికి అవకాశం ఉన్నది.

దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో దక్షిణాదికి చెందిన 128 స్థానాలు పోగా మిగిలిన 415 స్థానాలలో ఎన్డీఏ కూటమి రమారమి 385 స్థానాలు సాధించాలి లేదా బిజెపి 355 స్థానాలు సాధించాలి. ఎన్డీఏ మిత్ర పక్షాలైన జనతాదళ్ (యునైటెడ్), శివసేన (ఏకనాథ్ షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్), ఎన్డీఏ లోని ఇతర చిన్న, చితక పార్టీలకు కేటాయించిన సీట్లు పోగా బిజెపి ఉత్తర భారతంలో పోటీ చేసే సీట్లే 350కి కొద్దిగా అటు ఇటుగా ఉంటాయి.

నార్త్ ఇండియాలో బిజెపి పోటీ చేసే అన్ని సీట్లు గెలిస్తే గాని 370 సీట్లు సాధించలేదు. ఉత్తర భారత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఇటీవల కాలంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బిజెపికి ఊపునిచ్చిన మాట నిజమే. కానీ లోక్‌సభ ఎన్నికలలో ఈ మూడు రాష్ట్రాల నుండి అదనంగా బిజెపి సాధించేదేమీ లేదు. ఈ మూడు రాష్ట్రాలలో 65 లోక్‌సభ స్థానాలుండగా, 2019 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి 61 స్థానాలను, ఎన్డీఏ భాగస్వామ్య పక్షం ఒక స్థానంలో గెలుపొందాయి. అదనంగా గెలుపొందడానికి 3 స్థానాలే ఉన్నాయి. రాజస్థాన్ 2023 అసెంబ్లీ ఎన్నికలలో బిజెపికి, కాంగ్రెస్‌కు ఓట్ల తేడా 2.14 శాతం మాత్రమే. వామపక్షాలు, ఇతర మిత్రపక్షాలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకుంటే ఫలితం మరో విధంగా ఉండేది. ఈ రాష్ట్రాలలో బిజెపికి 15 నుండి 20 స్థానాలు తగ్గడమే తప్ప పెరిగే అవకాశం లేదు. 2019 ఎన్నికలలో గుజరాత్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని 52 లోక్‌సభ స్థానాలకు గాను 52 స్థానాలను (100 శాతం సీట్లు) బిజెపి గెలుపొందింది. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం...ఢిల్లీ, గుజరాత్‌లో ఆప్, కాంగ్రెస్ మధ్య ఎన్నికల పొత్తు కుదరడం, రైతాంగ ఉద్యమంలో హర్యానా రైతులు పెద్దఎత్తున పాల్గొంటున్న నేపథ్యంలో బిజెపికి కనీసం 15 సీట్లు తగ్గే అవకాశం ఉన్నది.

80 లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో 2019లో 49.98 శాతం ఓట్లతో 62 స్థానాలు బిజెపి గెలిచింది. 2014తో పోల్చితే 9 సీట్లు తగ్గాయి. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 41.29 శాతం ఓట్లు మాత్రమే బిజెపి పొందింది. యు.పి లో అయోధ్య తప్ప మిగతా ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోకపోవడం, సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య ఎన్నికల పొత్తు కుదరడం, ప్రభుత్వ వ్యతిరేకత తదితర కారణాల వలన బిజెపికి గత లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే కనీసం 30 సీట్లు తగ్గే అవకాశం ఉన్నది.

హిందీ బెల్టులో మరో ముఖ్యమైన రాష్ట్రం బీహార్. 40 లోక్‌సభ స్థానాలకుగాను 2019లో బిజెపికి 17, ఎన్డీఏ పక్షాలైన జనతాదళ్ (యునైటెడ్)కు 16, లోక్‌జనశక్తి పార్టీ (ఎల్జీపి)కి 6 స్థానాలు వచ్చాయి. నితీష్‌కుమార్ ఊసరవెల్లి రంగులు మార్చినట్లు ప్రభుత్వాలను మార్చడం, బిజెపి నీతిమాలిన చర్యలు, ప్రభుత్వ వ్యతిరేకత వెరసి రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జెడి), కాంగ్రెస్, వామపక్ష కూటమి సగానికి పైగా సీట్లు గెలుచుకునే అవకాశం ఉన్నది.

జార్ఖండ్ మొత్తం 14 సీట్ల గాను 2019లో బిజెపి 11, మిత్రపక్షం ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్ (ఏజేఎస్‌యు) ఒక స్థానంలో గెలిచింది. ఇప్పుడు కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎమ్ ఎమ్) మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పరిశీలకుల అంచనా.

మహారాష్ట్రలోని 42 లోక్‌సభ స్థానాలకుగాను 2019లో బిజెపి 23, అప్పటి ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన శివసేన 18 స్థానాలను పొందాయి. కాంగ్రెస్ ఒకటి, ఎన్సీపి నాలుగు, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచాయి. ఇప్పుడు శివసేన (ఏకనాథ్ షిండే), ఎన్సీపి (అజిత్ పవార్) ఎన్డీఏతో ఉన్నారు. శివసేన (ఉద్ధవ్ థాకరే), ఎన్సీపి (శరద్ పవార్) 'ఇండియా' బ్లాక్‌తో ఉన్నారు. 'ఇండియా' బ్లాక్ పక్షాలు ఐదు సీట్ల కంటే పెరిగే పరిస్థితి ఉంది తప్ప తగ్గేదైతే లేదు.

పశ్చిమ బెంగాల్, ఒరిస్సా మొత్తం 63 సీట్లలో 2019లో బిజెపి పొందిన సీట్లు 26, కాంగ్రెస్ 3, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ 22, ఒరిస్సాలో బిజు జనతాదళ్ 12 స్థానాలలో గెలుపొందాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బిజెపికి బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఒరిస్సాలో బిజెడి ప్రత్యర్థి పార్టీలు. ఈ రాష్ట్రాల్లో బిజెపికి గతం కంటే సీట్లు పెరిగే అవకాశం లేదు.

పంజాబ్ 13, జమ్మూ కాశ్మీర్ 6, గోవా 2...మొత్తం 21 సీట్లలో 2019లో బిజెపి 6, కాంగ్రెస్ 9, అప్పటి ఎన్డీఏ పక్షమైన శిరోమణి అకాలీదళ్ 2, యుపిఏ పక్షం జమ్మూ అండ్ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ 3, ఆప్ ఒక సీటు గెలుపొందాయి. ఇప్పుడు బిజెపి తిరిగి 6 సీట్లు పొందడం గగనమే.

సెవెన్ సిస్టర్స్‌గా పిలవబడే ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో పెద్ద రాష్ట్రమైన అస్సాంలో 14 లోక్‌సభ స్థానాలు వుండగా, మిగతా ఆరు రాష్ట్రాల్లో పది లోక్‌సభ స్థానాలున్నాయి. సహోదర రాష్ట్రం సిక్కింలో ఒక లోకసభ స్థానం. మొత్తం 25 స్థానాలకు గాను 2019 జనరల్ ఎన్నికలలో బిజెపి 15, ఎన్డీఏ పక్షాలు మరో ఐదు గెలిచాయి. అదనంగా ఇక్కడ బిజెపికి, ఎన్డీఏకు సీట్లు పెరిగే అవకాశం లేదు.

మిగతా 6 కేంద్ర పాలిత రాష్ట్రాలైన లక్షద్వీప్, చండీగఢ్, పాండిచ్చేరి, అండమాన్ – నికోబార్, దాద్రా – నాగర్ హవేలీ, డామన్ – డయు లోని 6 లోక్‌సభ స్థానాలకుగాను 2019లో బిజెపికి రెండు, కాంగ్రెస్‌కు రెండు, ఇతరులకు రెండు వచ్చాయి. వీటిలో ఎన్డీఏకి పెరిగేది లేదు. 'ఇండియా'కు తగ్గేది లేదు. అటువంటి పార్టీ తమకు 400 స్థానాలు వస్తాయని ప్రచారం చేసుకుని ప్రజా మైండ్ సెట్‌ని మార్చి అధికారంలోకి వస్తామని చెప్పే అబద్ధాల మోడీ మీడియాకు, బిజెపికి బుద్ధి చెప్పి గద్దె దించాలి. బిజెపిని ఓడించకపోతే దేశానికివే ఆఖరి ఎన్నికలు కావచ్చు. కాబట్టి ప్రజలారా, ప్రజాతంత్ర వాదులారా మేల్కొనండి.

/ వ్యాసకర్త సిపిఎం నెల్లూరు జిల్లా పూర్వ కార్యదర్శి/

వ్యాఖ్య

యుద్ధోన్ముఖంగా జపాన్!

రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జపాన్ మిత్ర దేశాల కూటమి నిర్దేశించిన మేరకు మిలిటరీ బదులు ఆత్మ రక్షణ దళాలను ఏర్పాటు చేస్తూ రాజ్యాంగాన్ని ఆమోదించుకుంది. ఇటీవలి కాలంలో అక్కడి పాలకవర్గం తిరిగి మిలిటరీని ఏర్పాటు చేయాలని, రణతత్పర దేశంగా మారాలని, ప్రపంచ రాజకీయాల్లో తన వంతు పెత్తనం చెలాయించాలని చూస్తున్నది. బుధవారం నాడు వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్–జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా బలమైన రక్షణ సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిజ్ఞ...ఆ దిశలో వేసిన ముందడుగు, ప్రపంచానికి ప్రమాద ఘంటిక మోగించినట్లుగా భావించాలి. చైనాను అడ్డుకోవటం ఈ దేశాల దీర్ఘకాలిక వ్యూహమే అయినప్పటికీ దాన్ని ఎన్నికల ప్రయోజనాలకు ఉపయోగించుకొనేందుకు కూడా చూస్తున్నారు. జపాన్ ప్రధాని కిషిడా మీద జనంలో తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు ఇటీవలి సర్వేలు వెల్లడించాయి. నవంబరులో జరిగే ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ రూపంలో జో బైడెన్ తీవ్ర సవాలును ఎదుర్కొంటున్నాడు. ఈ పూర్వ రంగంలో జనం దృష్టిని మళ్లించేందుకు చైనా బూచిని చూపారని కూడా భావిస్తున్నారు.

ఆసియా–పసిఫిక్ ప్రాంతం లేదా మరెక్కడైనా యథాతథ స్థితిని మార్చేందుకు బలప్రయోగం లేదా ఒత్తిడి ద్వారా ఎవరైనా ప్రయత్నిస్తే దృఢంగా ఎదుర్కొంటామని ఇరువురు నేతలు అన్నారు. చైనాతో సవాళ్లను ఎదుర్కొనేందుకు చేస్తున్న కృషిని కొనసాగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఉక్రెయిన్ ఈ రోజు రష్యా దురాక్రమణకు గురైంది. రేపు తూర్పు ఆసియా కావచ్చని జపాన్ ప్రధాని ఆరోపించాడు. త్వరలో అమెరికా, జపాన్, బ్రిటన్ మిలిటరీ విన్యాసాలు జరపనున్నాయని, అవి ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని జో బైడెన్ అన్నాడు. ఒంటరిగా లేదా మరో దేశంతో కలసి ఎవరు సైనిక విన్యాసాలు జరిపినా, వాటిలో భాగంగా ఆయుధ ప్రయోగాలు, ప్రదర్శనలు చేసినా అది బల ప్రదర్శన, కొన్ని దేశాలను భయపెట్టేందుకు తప్ప మరొకటి కాదు. బుధవారం నాడు రెండు దేశాల అధినేతలు చేసిన ప్రకటనలు ఏదో ఆకస్మికంగా చేసినవి కాదు. మరింత దూకుడుగా మిలిటరీ కూటమిని మార్చేందుకు ఏడాది క్రితమే అమెరికా–జపాన్ చేసిన ప్రకటనను జపాన్ కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకించింది. అమెరికా మిలిటరీ కమాండ్ ఆధీనంలో జపాన్ స్వయం రక్షక దళాలను ప్రతిదాడులు చేసేవిగా, ఇతర సామర్థ్యాలను పెంచేందుకు చూస్తున్నారని, అవసరమైనపుడు శత్రుదేశాలను దెబ్బ తీస్తామని బహిరంగంగా చెప్పటమేనని కూడా పేర్కొన్నది. ఇప్పటి వరకు ఉన్న ఇరు దేశాల ఒప్పందానికి ఇది పూర్తి వ్యతిరేకమని కమ్యూనిస్టు పార్టీ చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత తీసుకున్న విధానాన్ని కేవలం ఒక మంత్రివర్గ తీర్మానంతో మార్చివేస్తున్నారని, పార్లమెంటును, దేశ ప్రజలను సంప్రదించలేదని విమర్శించింది. హిరోషిమా, నాగసాకి ఉదంతాలను చూసిన తరువాత మరోసారి తమ దేశం మిలిటరీ శక్తిగా మారకూడదని, శాంతికి ముప్పు తేకూడదని జపనీయులు భావిస్తున్నారు.

తమను చక్రదిగ్బంధనం చేసేందుకే ఇదంతా అని చైనా భావిస్తున్నది. దానికి అనుగుణంగా తన మిలిటరీ శక్తిని అది మెరుగు పరుచుకుంటున్నది. తైవాన్ దీవి చైనాలో అంతర్భాగమే అయినప్పటికీ దాన్ని బలవంతంగా విలీనం చేసుకొనేందుకు అంగీకరించేది లేదని అమెరికా, దాన్ని సమర్థించే దేశాలు ఒకవైపు పదే పదే చైనాను రెచ్చగొడుతున్నాయి. మరోవైపు దక్షిణ చైనా సముద్రంలోని దీవులను ఆక్రమించుకొనేందుకు చైనా పూనుకున్నదని, నౌకా రవాణా స్వేచ్ఛగా జరిగేందుకు అవరోధాలు సృష్టిస్తున్నదనే ఆరోపణలతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నాయి. చైనా ఆధీనంలోని కొన్ని దీవులు తమవంటూ ఫిలిప్పైన్స్ ఇటీవల వాటిలో ప్రవేశించేందుకు చూడటం దానిలో భాగమే. ప్రబల అర్థిక శక్తిగా ఎదుగుతున్న చైనాను దెబ్బతీసేందుకు అమెరికా దీర్ఘకాలంగా పన్నుతున్న వ్యూహాలలో జపాన్ కీలకమైనది. వర్తమాన రాజ్యాంగం ఉనికిలో ఉన్నంత వరకు జపాన్ ఏ మిలిటరీ కూటమిలోనూ చేరేందుకు అవకాశం లేదు. అందుకే పక్కదారులు వెతుకుతున్నారు. జపాన్ మీద అమెరికా రుద్దిన రక్షణ ఒప్పందం పేరుతో అమెరికా మిలిటరీ అక్కడ తిష్టవేసింది. చతుష్టయ భద్రతా సంప్రదింపులు (క్వాడ్) పేరుతో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా ఒక కూటమిగా ఉండగా, ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా (అకుస్) మరో కూటమిగా ఏర్పడ్డాయి. దీనిలో జపాన్‌ను చేర్చేందుకు అడ్డదారి వెతుకుతున్నారు. ఈ పరిణామాలన్నీ ఆసియాలో ప్రత్యేకించి తూర్పు ఆసియాలో ఆందోళన కలిగిస్తున్నాయి.

– ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ రచనలను పంపాల్సిన మెయిల్: editpageps@ gmail.com

జునైద్ కుటుంబానికి బృందాకరత్ పరామర్శ

జునైద్ (ఫైల్)

న్యూఢిల్లీ : ఈద్ సందర్భంగా జునైద్ కుటుంబ సభ్యులను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పరామర్శించారు. 2017 జూన్ 22న ఈద్‌కు కొన్ని రోజుల ముందు, 15 ఏళ్ల జునైద్‌ను కొందరు మతతత్వ గూండాలు దారుణంగా కొట్టి చంపారు. మతతత్వ నినాదాలిస్తూ, కదులుతున్న రైలులో జునైద్‌ను తీవ్రంగా కొట్టి, కత్తితో పొడిచి, రైలు నుంచి బయటకు విసిరేశారు. జునైద్‌ను రక్షించేందుకు ప్రయత్నించిన అతని సోదరుడిని కూడా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నాటి ఘటనను గుర్తు చేసుకుంటూ బల్లభఘర్‌లోని జునైద్ కుటుంబాన్ని బృందాకరత్ తదితరులు గురువారం పరామర్శించారు. జునైద్ తల్లి సయారా, తండ్రి, జలాలుద్దీన్, ఇతర కుటుంబ సభ్యులను కలుసుకున్నారు.

ముందుగానే రుతుపవనాలు..!

న్యూఢిల్లీ : రాబోయే వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఎల్‌నినో పరిస్థితులు పూర్తిగా తొలగిపోయి.. లా నినా పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొంది. హిందూ మహాసముద్ర ద్విధ్రువ (ఐడిఒ) పరిస్థితులతోపాటు లానినా పరిస్థితులు ఏకకాలంలో యాక్టివ్‌గా మారుతుండడంతో రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాల్లో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజా సమాచారం అందరికీ ఊరటనిస్తోంది. రుతుపవనాల అల్పపీడనాలు పశ్చిమ, వాయవ్య భారతదేశం, ఉత్తర అరేబియా సముద్రంవైపు విస్తరించి స్థిరమైన పంథాను అనుసరిస్తాయని ఐఎండి భావిస్తున్నది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో వర్షపాతం పెరుగుతుందని, సాధారణ వర్షపాతానికి మించి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నది.

వాషింగ్టన్‌లో కాల్పులు

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ సంస్కృతికి ముగింపు కనిపించడం లేదు. తాజాగా అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో బుధవారం ఒక సాయుధుడు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాషింగ్టన్‌లోని కార్వెర్ లాగ్‌స్టన్ వద్ద బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ దారుణం జరిగింది. వాహనంలో వచ్చిన సాయుధుడు అక్కడ వీధిలో ఉన్న ప్రజలపై ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డాడని మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ పమేలా స్మిత్ తెలిపారు.

లోయలో పడిన బస్సు

- పాక్‌లో 17 మంది మృతి

కరాచీ : పాకిస్థాన్‌లో బుధవారం ఒక బస్సు లోయలోపడిన ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మరో 38 మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్ రాష్ట్రంలోని హబ్ పట్టణంలో బుధవారం రాత్రి 8 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. బస్సులోని ప్రయాణికులంతా సింధ్ రాష్ట్రంలోని థాట్టా పట్టణానికి చెందినవారు. వీరంతా బలూచిస్థాన్‌లోని ఖుజ్దార్ జిల్లాలో ముస్లిం సూఫీ క్షేత్రమైన షా నూరానీ వద్దకు నివాళు లర్పించేందుకు వెళుతుండగా ఈ ఘోరం జరిగింది. బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం కరాచీకి దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రమాదంలో గాయపడిన వారిని, మృతదేహాలను కరాచీలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు.

సిఎఎ, ఎన్‌ఆర్‌సి భయంతో
పత్రాల కోసం పరుగులు

- ముంబయిలో ముస్లింల అవస్థలు
- సాయం అందించేందుకు ఉదారంగా ముందుకొస్తున్న న్యాయవాదులు

న్యూఢిల్లీ : సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం) అమలు, ఎన్‌ఆర్‌సి భయం ముంబయిలో నెలకొంది. మరీ ముఖ్యంగా ముస్లింలలో తీవ్ర భయాందోళనలు చోటుచేసుకున్నాయి. పౌరసత్వ గుర్తింపునకు సంబంధించిన పత్రాలు సరిగా ఉన్నాయో, లేదో చూసుకోవడానికి వారు న్యాయవాదుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వీరి అవస్థలను గమనించిన కొందరు న్యాయవాదులు ఉచితంగా సేవలందించేందుకు ఉదారంగా ముందుకొస్తున్నారు. తమ ఆధార్ కార్డులు, జనన ధ్రువపత్రాలు వంటి వాటిల్లో తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో, లేదో అనే విషయాన్ని ముస్లింలు వెరిఫికేషన్ చేసుకుంటున్నారు. అస్సాంలో ఎన్‌ఆర్‌సి తుది జాబితా నుంచి సరైన డాక్యుమెంట్లు లేని కారణంగా సుమారు 19.6 లక్షల మందిని తొలగించిన అంశం ముస్లింలను కలవరపాటుకు గురిచేస్తోంది. తమకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో కూడా ఇదే ఆందోళనలో ఉన్నారు. ఉదాహరణకు మహమ్మద్ అనేది ముస్లిమ్‌లలో చాలా సాధారణమైన పేరు. ఈ పేరు ఉన్న కొందరి డాక్యుమెంట్లలో ఎం అని మాత్రమే రాసి ఉంటుంది. మరి కొన్ని వాటిల్లో మొహమ్మద్ అని రాసి ఉంటుంది.

ముంబయి సెంట్రల్ నాగ్‌పడా జంక్షన్‌లోని తన కార్యాలయంలో ఉచితంగా సేవలందిస్తున్న న్యాయవాది నదీమ్ సిద్ధిఖీ

మరికొన్నింటిల్లో ఎం.హెచ్‌డి అని ఉంటుంది. ఇలా ఒక పేరే వేర్వేరుగా ఉండటంతో అధికారులు అంగీకరిస్తారో, లేదో అనే ఆందోళన ముస్లిమ్‌లలో నెలకుంది. ముస్లిములకు సంబంధించిన అనేక పేర్లల్లో ఇదే సందిగ్ధం ఉంది. దీంతో తమకు న్యాయసహాయం అందించే వారి వద్దకు పరుగులు తీస్తున్నారు. ముంబయి సెంట్రల్‌లోని నాగ్‌పడా జంక్షన్‌కు సమీపంలో 43 ఏళ్ల న్యాయవాది నదీమ్ సిద్ధిఖీ తన కార్యాలయంలోనే గత కొన్నేళ్ల నుంచి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నారు. సిఎఎ రూల్స్ నోటిఫై అయిన దగ్గర నుంచి తమ వద్దకు సహాయార్థం వచ్చే ముస్లిముల సంఖ్య భారీగా పెరిగిందని చెబుతున్నారు. నలుగురు వాలంటీర్ల సహాయంతో ఆదివారం మినహాయించి ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, మళ్లీ రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ ఈ సేవలు అందిస్తున్నారు. సిద్ధిఖీ లాంటి సహాయం అందించే ఇతర న్యాయవాదులు, సంస్థల వద్దకు ముస్లింలు బారులు తీరుతున్నారు. తమ వ్యక్తిగత సమాచారం, ముఖ్యంగా తమ పేర్లు ఇతర గుర్తింపు పత్రాలతో సరిపోలుతున్నాయా, లేదా అని నిర్ధారణ చేయమంటున్నారు. పేర్లలో తప్పులు సరిదిద్దడానికి కనీసం నాలుగు నెలలు పడుతుందని తెలియడంతో వారిలో ఆందోళన మరింతగా పెరుగుతోంది.

మీ ఓటు బిజెపిపై వేటు కావాలి

- ఎన్నికల ప్రచార సభలో మాణిక్ సర్కార్ పిలుపు

ఎన్నికల సభలో మాట్లాడుతున్న మాణిక్ సర్కార్

అగర్తల : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని సర్కారును కూకటివేళ్లతో పెకిలించి, ప్రతిపక్ష 'ఇండియా' బ్లాక్‌కు ఓటు వేసి ప్రజాస్వామ్య, లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రజలను కోరారు. అగర్తలలో కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గానికి 'ఇండియా' బ్లాక్ తరపు అభ్యర్థి ఆశిష్ కుమార్ సాహా, అసెంబ్లీ ఉప ఎన్నికల అభ్యర్థి రతన్ దాస్‌లకు అనుకూలంగా జరిగిన ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, పేలవమైన వేతనాలు, విద్య, ఆరోగ్యం ప్రయివేటీకరణ వంటివి దేశంలో ప్రబలంగా ఉన్నాయనీ, అందుకే ప్రస్తుత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపాల్సినవసరం ఉన్నదని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలకు మద్దతుగా ముందుకు రావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "ప్రజలు ఉద్యోగాలు కోల్పోతున్నారు. కంపెనీలు మూతపడుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఇలా సమస్త ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలకు హాజరవటం, రాజకీయ ప్రసంగాలు వినటమే కాకుండా కుటుంబ సభ్యులను సంఘటితం చేయాలి" అని మాణిక్ సర్కార్ ప్రజలను కోరారు. "2023 (అసెంబ్లీ ఎన్నికలు)లో ఏమి జరిగిందో మీరు చూశారు. ఆ హింస, దౌర్జన్యాలను పునరావృతం చేయాలని వారు చూస్తున్నారు. దీనిని మనం అనుమతించాలా? ఎట్టి పరిస్థితుల్లోను దీనిని అనుమతించకూడదు అని ఆయన ఉద్బోధించారు. బిజెపిని ఇంటికి సాగనంపేందుకు ప్రతి ఒక్కరూ నిర్భయంగా బయటకు వచ్చి మీ ఓటు వేయాలి. మేము మీతో ఉన్నాము. అడ్డుకుంటే రోడ్డుపై కూర్చొని నిరసన తెలపండి అంటూ ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దక్షిణ జిల్లాలోని బైఖోరాలో జరిగిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో సిపిఎం త్రిపుర కార్యదర్శి జితేంద్ర చౌదరి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటమే కాకుండా దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడమేనని అన్నారు. బిజెపి ప్రభుత్వ నియంతృత్వ పాలనలో 140 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రమాదంలో ఉన్నారనీ, అందుకే ఆ పార్టీని అధికారం నుంచి తరిమికొట్టటానికి 27 రాజకీయ పార్టీలు తమ సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి 'ఇండియా' బ్లాక్‌ను ఏర్పాటు చేశాయని ఆయన అన్నారు. త్రిపురలోని రెండు ఎంపి స్థానాలకు రెండు విడతలుగా ఈనెల 19, 26 తేదీల్లో పోలింగ్ జరగనుంది.

హర్యానాలో స్కూల్ బస్ బోల్తా

- ఆరుగురు చిన్నారులు మృతి
- 20 మందికి గాయాలు
- రంజాన్ రోజూ తరగతులపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

మహేంద్రగఢ్ : రంజాన్ పర్వదినం రోజు హర్యానాలో ఘోరప్రమాదం చోటు చేసుకుంది. ఒక స్కూల్ బస్సు బోల్తా పడిన ప్రమాదంలో ఆరుగురు చిన్నారులు మరణించగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. నార్నౌల్ జిల్లాలో మహేంద్రగఢ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం సమయంలో బస్సు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని, బస్సుకు ఫిట్‌నెస్, ఇతర సర్టిఫికెట్లు కూడా లేవని అధికారులు చెబుతున్నారు. పాఠశాల బస్సుకు సరైన పత్రాలు లేని కారణంగా యాజమాన్యంపై కేసు నమోదు చేసి రూ.15, 500 జరిమానా విధించినట్లు రవాణా శాఖ అధికారులు చెప్పారు. రంజాన్ పండగ రోజు పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన వార్తపై హర్యానా ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వ సెలవు రోజైన రంజాన్ నాడు తరగతులు నిర్వహించడంపై విచారణకు ఆదేశించింది. పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు విద్యాశాఖ మంత్రి సీమాత్రిఖ తెలిపారు. ఆసుపత్రులో చికిత్స పొందుతున్న చిన్నారులను మంత్రి పరామర్శించారు.

లవ్ జీహాద్ ఆరోపణలపై ముస్లిం విద్యార్థిపై దాడి

- విచారణకు ప్రత్యేక బృందం

పూణే : లవ్ జీహాద్ పేరుతో ముస్లిం విద్యార్థిని తీవ్రంగా కొట్టిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పూణే పోలీసులు తెలిపారు. బాధిత విద్యార్థి కథనం ప్రకారం మహారాష్ట్రలోని సావిత్రిబాయి ఫూలే పూణే యూనివర్శిటీలో మొదటి సంవత్సరం చదువుతున్న 19 ఏళ్ల ముస్లిం విద్యార్థి ఈ నెల 7న మధ్యాహ్నం క్యాంపస్‌లో మరో ఇద్దరు తనతోటి విద్యార్థినులతో కలిసి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో మూడు బైకులపై వచ్చిన ఆరుగురు ఆధార్ కార్డులివ్వాలంటూ వారిని అడిగారు. అనంతరం లవ్ జీహాద్ కోసం వచ్చావంటూ ముస్లిం విద్యార్థిని తీవ్రంగా కొట్టారు. షోలాపూర్ జిల్లాలో నివసిస్తున్న విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి దుర్భాషలాడారు. నిందితులను గుర్తించేందుకు సిసి టివి ఫుటేజిలను పరిశీలిస్తున్నామని అదనపు పోలీసు కమిషనర్ మనోజ్‌పాటిల్ చెప్పారు.

ఐదో ఏటా ఈద్ ప్రార్థనలకు అడ్డంకి

- కాశ్మీర్‌లో జామియా మసీదు మూసివేత

శ్రీనగర్ : శ్రీనగర్‌లోని చారిత్రక జామియా మసీదులో వరుసగా ఐదో ఏడాది కూడా ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనలకు అనుమతించలేదు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్రార్థనలు నిర్వహించాల్సి ఉండగా, సాయుధ పోలీసులు జామియా మసీదు గేట్లు మూసివేశారు. ప్రార్థనలకు అనుమతి లేదని తెలియజేశారు. మత గురువు మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌ను తెల్లవారుజాము నుంచి గృహ నిర్బంధంలో ఉంచారు. పోలీసుల చర్యను పలువురు మతపెద్దలు, సంఘాలు ఖండించాయి.

ఈద్ ముబారక్

ఇజ్రాయిల్ దాడుల్లో సర్వం కోల్పోయిన పాలస్తీనా ముస్లిములు శుక్రవారం అల్ అక్సా మసీదు వద్ద రంజాన్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

నేషనల్ హెరాల్డ్ ఆస్థుల స్తంభనకు సమర్థన

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్, యంగ్ ఇండియా పత్రికలకు చెందిన రూ. 751 కోట్లను ఆస్థులను మనీలాండరింగ్ చట్టం కింద ఇడి స్తంభింపచేయడాన్ని పిఎంఎల్ఎ అథారిటీ తాజాగా సమర్థించింది. ఈ రెండు పత్రికలు కాంగ్రెస్ యాజమాన్యంలోని అసోసియేట్ జనర్నల్ లిమిటెడ్ (ఎజెఎల్) నిర్వహణలో ఉన్నాయి. బిజెపి నాయకుడు సుబ్రమణ్యస్వామి చేసిన ఫిర్యాదు ఆధారంగా నేషనల్ హెరాల్డ్ కేసును ఇడి దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ఇడి ఈ ఆస్థులను 2022లోనే స్థంభింపచేసింది. కాగా, మరోవైపు కాంగ్రెస్ ఖాతాలను కూడా ఆదాయపన్ను శాఖ ఇప్పటికే స్థంభింపచేసిన సంగతి తెలిసిందే.

ఇజ్రాయిల్ మరో దాష్టీకం

మీడియాతో మాట్లాడుతున్న ఇస్మాయిల్ హనియే

- హమాస్ చీఫ్ ముగ్గురు కుమారులు, నలుగురు మనవళ్ల హత్య

గాజాసిటీ: ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా హమాస్ రాజకీయ విభాగం అధిపతి ఇస్మాయిల్ హనియే ముగ్గురు కుమారులను, నలుగురు మనవళ్లను యూదు దురహంకార సైన్యం బుధవారం అమానుషంగా పొట్టనబెట్టుకుంది. నాజీలను తలపిస్తున్న ఇజ్రాయిల్ ఆర్మీ చర్యపై అంతర్జాతీయంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈద్ సందర్భంగా గాజా సిటీని సందర్శించేందుకు హనీయే ముగ్గురు కుమారులు, నలుగురు మనవళ్లు కారులో వెళ్తుండగా ఇజ్రాయిల్ ఆర్మీ ఆ వాహనంపై బాంబులు వేసింది. ఈ దాడిలో కారు మొత్తం తునాతునకలైంది.

అందులో ప్రయాణిస్తున్న వారంతా చనిపోయారు. ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్, ముజాహిద్దీన్ మూవ్‌మెంట్, అన్సర్ అల్లా తదితర సంస్థలు తీవ్రంగా ఖండించాయి. నాజీ సేనల పిరికిపంద చర్యగా దీనిని అభివర్ణించాయి. దీనిపై హనీయే స్పందిస్తూ, తన పిల్లలను చంపడం వల్ల హమాస్ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. గాజా కోసం పోరాటంలో ఎంతో మంది రక్తతర్పణం చేస్తున్నారని, వారి రక్తం కన్నా తన పిల్లల రక్తం విలువ ఎక్కువేమీ కాదని అన్నారు. పాలస్తీనా పూర్తి స్వాతంత్ర్యం కోసం హమాస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రఫాపై ఇజ్రాయిల్ దాడి మమ్మల్నేమీ భయపెట్టలేదని, దీనికి దీటుగా బదులిస్తామని హమాస్ నేత అన్నారు.

హమాస్ నాయకుడి పిల్లలు, నలుగురు మనవళ్లను చంపిన పాశవిక చర్యకు బాధ్యత వహించకుండా తప్పించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రయత్నిస్తున్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా సైన్యం ఈ ఆపరేషన్ నిర్వహించిందని ఆయన ఇజ్రాయెల్ మీడియాకు చెప్పారు. ఇస్మాయిల్ హనీయె అమీర్, మహ్మద్ అబెల్, హాజీమ్ హనీయేలను, వారి పిల్లలను లక్ష్యంగా చేసుకున్నారని వారు హమాస్ యోధులని హమాస్ పేర్కొంది.

యుద్ధాన్ని విరమించాలంటూ ఇజ్రాయెల్‌లో పెద్దయెత్తున నిరసనలు కొనసాగుతున్నాయి. మరో వైపు కాల్పుల విరమణకు సంబంధించి చర్చలు ఒక కొలిక్కి వస్తున్న తరుణంలో ఇజ్రాయిల్ ఈ హత్యాకాండకు పాల్పడడాన్ని బట్టి శాంతియత్నాలకు గండి కొట్టాలన్నదే నెతన్యాహు ప్రభుత్వ వైఖరిగా ఉందని అర్థమవుతోందని అంతర్జాతీయ విశ్లేషకులు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. హమాస్ చీఫ్ కుటుంబ సభ్యుల హత్య ఘర్షణను మరింత తీవ్రతరం చేస్తుందని ఇజ్రాయెల్ పౌరులు ఆందోళన చెందుతున్నారు.

ఈసారి యునిసెఫ్ సహాయక సిబ్బందిపై దాడి

ఈద్ రోజున కూడా గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆగలేదు. ఇజ్రాయెల్ దక్షిణ గాజాలోని రఫా శిబిరం, మధ్య ప్రాంతంలోని నుసెరాత్ శిబిరంపై దాడి చేసింది. యూనిసెఫ్ రిలీఫ్ కాన్వాయ్‌పై ఇజ్రాయెల్ సైన్యం గురువారం విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. అంతకుముందు, ఇజ్రాయెల్ దాడిలో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సహాయక సిబ్బంది చనిపోయారు. ఆరు మాసాలుగా సాగిస్తున్న ఈ దాడుల్లో 34,000 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు.

ఇరాన్‌పై నేరుగా దాడికి దిగుతాం

ఇజ్రాయిల్ బెదిరింపు

జెరూసలెం : ఇరాన్ తన భూభాగం నుండి ఇజ్రాయిల్‌పై గనుక దాడి చేసినట్లైతే తాము ఇరాన్‌పై ప్రత్యక్షంగా దాడికి దిగుతామని ఇజ్రాయిల్ బెదిరించింది. సిరియాలో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం పేలుడులో ఇరాన్ జనరల్స్ చనిపోయిన నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లాయి. ఈనెల ఆరంభంలో డమాస్కస్‌లో తమ కాన్సులేట్‌పై దాడికి కచ్చితంగా ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని పునరుద్ఘాటించారు. ఈ తరుణంలో ఇజ్రాయిల్ హెచ్చరిక వెలువడింది. ఆ దాడికి ఇజ్రాయిల్ కారణమని ఇరాన్ ఆరోపిస్తోంది. ఆ దాడిలో 12మంది చనిపోయారు. ఈ దాడిలో తమ ప్రమేయం వుందని ఇజ్రాయిల్ ప్రకటించలేదు. అమెరికా మాత్రం ఇజ్రాయిల్ ఈ దాడికి బాధ్యత వహించాలని పేర్కొంది. రంజాన్ ప్రార్థనల సందర్భంగా ఆయతుల్లా ఖమేని మాట్లాడుతూ, కాన్సులేట్ కార్యాలయంపై ఇజ్రాయిల్ వైమానిక దాడి చేసి తప్పు చేసిందని, ఇది, ఇరాన్ భూభాగంపై దాడి చేసినట్లే తాము భావిస్తున్నామని అన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం ఇందుకు శిక్ష అనుభవించాలని అన్నారు. అయితే ఏ రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామో చెప్పలేదు. గాజాలో యుద్ధానికి ఇజ్రాయిల్‌కు ఈ దేశాలు సాయం చేస్తున్నాయంటూ పశ్చిమ దేశాలను కూడా ఆయతుల్లా విమర్శించారు

సిఎఎపై కాంగ్రెస్ మౌనం

- పినరయి విజయన్ విమర్శ

తిరువనంతపురం : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో మౌనం వహించడాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. బిజెపి, సంఘపరివార్ ఆలోచనా తీరుకు కాంగ్రెస్ వైఖరి ఊతమిచ్చేదిగా ఉందన్నారు. సిఎఎను వ్యతిరేకిస్తూ వామపక్ష సంఘటనతో తొలుత చేతులు కలిపిన కాంగ్రెస్ కేరళ శాఖ తర్వాత జాతీయ నాయకత్వ ఆదేశాల మేరకు వెనకడుగు వేసిందని విజయన్ విమర్శించారు. అట్టింగాళ్‌లో సిపిఎం అభ్యర్థి వి.జాయ్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. సిఎఎపై కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ మౌనం పాటిస్తున్నారని, ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా దీనిపై ఏమీ మాట్లాడలేదని అన్నారు. అమెరికాతో సహా పలు దేశాలు సిఎఎను విమర్శిస్తూ వ్యతిరేకిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం దీనిపై ఒక వైఖరి తీసుకోలేకపోతోందని విమర్శించారు. మాజీ మంత్రి, సిపిఐ(ఎం) అభ్యర్థి థామస్ ఇజాక్‌ను కెఐఐఎఫ్‌బి మసాలా బాండ్ కేసులో ఎందుకు ఇడి అరెస్టు చేయలేదని కాంగ్రెస్ ప్రశ్నిస్తోందన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యుడిఎఫ్ ఎంపీలకు ఎవరైతే ఓటు వేశారో వారు ఇప్పుడు నిరాశ చెందుతున్నారని అన్నారు. లౌకికయేతర జాతీయ సమస్యలపై ఒక్కసారి కూడా ఆ ఎంపీలు తమ వాణి వినిపించలేదని విమర్శించారు. శశి థరూర్, కె.సి.వేణుగోపాల్ వంటి సీనియర్ కాంగ్రెస్ నేతలు పలువురు సిఎఎను తాము మొదటనుండి వ్యతిరేకిస్తునే వున్నామని చెబుతూ వస్తున్నారు. సిఎఎకు వ్యతిరేకంగా తాను లోక్‌సభలో అనేకసార్లు ప్రసంగించానన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించలేం

- సమాచార హక్కు చట్టం దరఖాస్తును తిరస్కరించిన ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలను వెల్లడించడానికి ఎస్‌బిఐ నిరాకరించింది. ఎన్నికల బాండ్లు విలువైన వ్యక్తిగత సమాచారం అని పేర్కొంటూ ఆర్‌టిఐ కింద వచ్చిన దరఖాస్తును ఎస్‌బిఐ తిరస్కరించింది. భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఎన్నికల బాండ్ల వివరాలను బహిరంగంగా ప్రజలకు ప్రకటించినా ఎస్‌బిఐ ఈ విధంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. ఎన్నికల బాండ్ల స్కీమ్ 'రాజ్యాంగ విరుద్ధం, ఏకపక్షం' అని పేర్కొంటూ వాటిని సుప్రీంకోర్టు ఫిబ్రవరి 15న రద్దు చేసింది. ఏప్రిల్ 12, 2019 నుంచి ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి ఇవ్వాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పు తరువాత మార్చి 12 నుంచి ఎన్నికల బాండ్ల వివరాలను ఇసి వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ తరువాత అంటే మార్చి 13న ఆర్‌టిఐ కార్యకర్త లోకేష్ బాత్రా ఎన్నికల బాండ్ల పూర్తి సమాచారాన్ని డిజిటల్ రూపంలో ఇవ్వాలని కోరుతూ ఎస్‌బిఐకి ఆర్‌టిఐ చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తును ఎస్‌బిఐ ఈనెల 10న తిరస్కరించింది. ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఇ), 8(1)(జె) కింద దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. 'మీరు కోరిన సమాచారం కొనుగోలుదారులు, రాజకీయ పార్టీలకు సంబంధించింది. కనుక ఇది వ్యక్తిగత సమాచారం కిందకు వస్తుంది. కాబట్టి బహిర్గతం చేయలేం. మీరు కోరిన దరఖాస్తుకు ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఇ), 8(1)(జె) కింద మినహాయింపు ఉంటుంది' అని సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ బుధవారం సమాధానం ఇచ్చారు. ఎన్నికల బాండ్ల కేసులో ఎస్‌బిఐ తరుపున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వేకు చెల్లించిన ఫీజు వివరాలను కూడా బాత్రా కోరారు. దీనికి కూడా ఎస్‌బిఐ నిరాకరించింది. ఈ విషయాలను లోకేష్ బాత్రా మీడియాకు వెల్లడించారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారాన్ని ఇవ్వడానికి కూడా ఎస్‌బిఐ తిరస్కరించడం విచిత్రంగా ఉందని బాత్రా వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి వైభవ్ కుమార్ తొలగింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి వైభవ్ కుమార్‌ను విజిలెన్స్ డైరెక్టరేట్ విధుల నుండి తొలగించింది. తాత్కాలిక నియామకాలకు సంబంధించి కేంద్ర సివిల్ సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించి వైభవ్ కుమార్‌ను నియమించారని విజిలెన్స్ డైరెక్టరేట్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేశాడని వైభవ్ కుమార్‌పై 2007లో నోయిడా పోలీసులు కేసు నమోదు చేశారు. కేజ్రీవాల్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా నియమించే సమయంలో ఈ కేసు వివరాలను వెల్లడించలేదని విజిలెన్స్ విభాగం పేర్కొంది. లిక్కర్ పాలసీకి సంబంధించి ఈ నెల 8న ఇడి వైభవ్ కుమార్‌ను విచారించిన సంగతి తెలిసిందే.

ప్రజాస్వామ్యాన్ని నిరీర్యం చేస్తోన్న బిజెపి : ఆప్

ఈ చర్యపై ఆప్ నేత జాస్మిన్ షా తీవ్రంగా మండిపడ్డారు. తప్పుడు కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సహా కేజ్రీవాల్ సిబ్బంది మొత్తాన్ని తొలగించే పని మొదలు పెట్టారని విమర్శించారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మరో ఆప్ ఎమ్మెల్యేపై ఇడి దృష్టి

మరో ఆప్ నేతపై వేటు వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సిద్ధమైంది. ఓఖ్లా ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌పై అరెస్ట్ వారెంట్ కోరుతూ ఇడి బుధవారం ఢిల్లీ కోర్టుకు వెళ్లింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డ్ నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయనను విచారణ చేయాలని ఇడి కోరింది. దరఖాస్తుకు మద్దతుగా కొన్ని పత్రాలు దాఖలు చేయడానికి ఇడి సమయం కోరడంతో సిబిఐ, ఇడి ప్రత్యేక న్యాయమూర్తి రాకేష్ సియాల్ విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేశారు.

స్కాన్ చేయండి.. స్కామ్ చూడండి

- బిజెపికి వ్యతిరేకంగా తమిళనాడులో పోస్టర్లు

చెన్నై : తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు జరగటానికి కొన్ని రోజుల సమయమే ఉన్నది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న అక్కడ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఈ ఎన్నికలను కేంద్రంలోని అధికార బిజెపి చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. అక్కడ బీజేపీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్కామ్(కుంభకోణం)కు పాల్పడిందంటూ పలు ప్రదేశాల్లో కనిపించాయి. ఈ పోస్టర్లలో పైభాగంలో 'జీ పే' అని రాసి ఉన్నది. ప్రధాని మోడీ ఫొటోతో పాటు దానిపై ఒక క్యూఆర్ కోడ్ ఉన్నది. "స్కామ్ చూడటానికి స్కాన్ చేయండి" అని దానిపై రాసి ఉన్నది. ఆ పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఒక వీడియో ఓపెన్ అవుతున్నది. ఈ వీడియోలో ఒక వ్యక్తి.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిజెపి అవినీతి గురించి, కాగ్ నివేదిక హైలెట్ చేసిన అవకతవకల గురించి వివరిస్తూ కనిపిస్తుంది. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో అవినీతి గురించి వివరించటమూ ఆ వీడియోలో ఉన్నది. బడా కార్పొరేట్లకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల మేర రుణాలను రైటాఫ్ చేసిందని ఆ వీడియో వివరించింది. బిజెపిని తిరస్కరించి, ఇండియా బ్లాక్‌కు మద్దతు తెలపండి అని ఓటర్లను కోరటం అందులో కనిపించింది. తమిళనాడులోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకు ఈనెల 19న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు ఒక వారం రోజుల సమయమే మిగిలి ఉండటం, బిజెపి కేంద్ర అధినాయకత్వం రాష్ట్రంలోని ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తరుణంలో ఇలాంటి పోస్టర్లు తమిళనాడులో దర్శనమివ్వటం ఆ పార్టీకి ప్రతికూల అంశమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బ్యాంక్‌ను మోసగించిన కేసులో వియత్నాం మహిళా వ్యాపారవేత్తకు ఉరిశిక్ష

హోచిమిన్ సిటీ : బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో నేరం రుజువుకావడంతో వియత్నాంలో ఒక మహిళా వ్యాపారవేత్తకు ఉరిశిక్ష విధించారు. సైగాన్ కమర్షియల్ బ్యాంక్ (ఎస్‌సిబి)ను మహిళా వ్యాపారవేత్త ట్రూంగ్ మై లాన్ ఒక దశాబ్దం పాటు మోసగించారని, సుమారు 12.5 బిలియన్ అమెరికా డాలర్లను బ్యాంక్ నుంచి కాజేశారని కేసు నమోదైంది. 2022 అక్టోబరులోనే లాన్‌ను అరెస్టు చేశారు. కుంభకోణం విలువ 27 బిలియన్ అమెరికా డాలర్లుగా ప్రాసిక్యూషన్ అంచనా వేసింది. ఇది వియత్నం గత ఏడాది జిడిపిలో ఆరు శాతానికి సమానంగా తెలిపింది. స్కాంను కప్పిపుచ్చడానికి వివిధ స్థాయి అధికారులకు 5.2 మిలియన్ల డాలర్లు లంచంగా ఇచ్చారని లాన్‌పై అభియోగాలు ఉన్నాయి. ఈ కేసును ఐదు వారాలపాటు ఐదుగురు జడ్జీలు ఉన్న ధర్మాసనం విచారించింది. గురువారం తీర్పును వెల్లడించింది.

మీ కోసం

వడియాలు పెట్టేటప్పుడు పిండి ఉడికిన తర్వాత కొద్దిగా మజ్జిగ కలిపితే, వడియాలు తెల్లగా వస్తాయి.

జీవన సౌరభం

సరిదిద్దుకోని తప్పు భవిష్యత్తులో పెద్ద ఆపదను తెచ్చిపెడుతుంది.

టిష్యూ పేపర్

'**నా**న్నా, పక్క వీధిలో పుచ్చకాయలు అమ్ముతున్నారంట. వెళ్లి కొనుక్కుని రానా' అని ఆరవ తరగతి చదువుతున్న చైతన్య తన తండ్రిని అడిగాడు. 'అలాగే.. 'నా చొక్కా జేబులో డబ్బులు, టేబులు మీద టిష్యూ పేపర్ తీసుకొని ప్రణవ్‌తో కలసి వెళ్లు' అని తండ్రి సమాధానం చెప్పాడు.

తండ్రి జేబులో డబ్బులు, టిష్యూ పేపరుతో పాటు పెద్ద సంచి తీసుకొని ప్రణవ్‌తో బయటకు వచ్చాడు చైతన్య. చైతన్య మామయ్య కొడుకే ప్రణవ్. సెలవులు కావడం వల్ల చైతన్య ఇంటికి వచ్చాడు.

'వేసవి తాపాన్ని, దాహాన్ని తీర్చగల అద్భుతమైన ఫలం పుచ్చకాయ. ఇందులో ఎన్నో విటమిన్లు పోషకాలు వున్నాయని మా మాస్టారు చెప్పారు' అని రోడ్డు మీద నడుస్తూ చైతన్య ప్రణవ్‌తో మాట్లాడుతున్నాడు. 'ఇదంతా సరే కానీ, పుచ్చకాయలు కొనడానికి, టిష్యు పేపర్ ఎందుకురా' అని అడిగాడు ప్రణవ్. 'పద, నువ్వే తెలుసుకుందువు' అన్నాడు చైతన్య.

రోడ్డు పక్కన లగేజీ వ్యానులో పుచ్చకాయలు అమ్ముతున్న వ్యక్తి దగ్గరకు వెళ్లి 'అన్నా మంచి పుచ్చకాయ ఒకటి కోసి ఇవ్వు' అన్నాడు చైతన్య.

'ఇవన్నీ మా తోటలో పండినవే. మంచిదే ఇస్తాను' అంటూ ఒక పుచ్చకాయ తీసుకొని సగంగా కోశాడు వ్యాపారి. వెంటనే చైతన్య తన దగ్గరున్న టిష్యూ పేపరుతో ఆ పుచ్చకాయ ముక్కపై రుద్దగానే టిష్యూ పేపరు ఎర్రగా మారిపోయింది. ఆ పుచ్చకాయ సహజంగా పండింది కాదని చైతన్య గ్రహించాడు.

'అన్నా, ఈ పండుకు కెమికల్స్ ఇంజెక్ట్ చేసి ఎర్రదనం తెప్పించారు. ఇది ఆరోగ్యానికి హానికరం. నాకు వద్దు. సహజంగా పండిన పండు అయితే టిష్యూ పేపరుకు ఇలా ఎర్ర రంగు అంటుకోదని మా మాస్టారు చెప్పారు. ఇది కల్తీ పండని నేను మా నాన్నకు చెబుతాను. ఆయన ఫుడ్ ఇన్‌స్పెక్టరును తీసుకొని వస్తారు' అంటూ అక్కడి నుంచి వెనుదిరిగారు స్నేహితులిద్దరూ.

తండ్రిని పిలుచుకొని వచ్చేటప్పటికి పుచ్చకాయల బండి అక్కడ లేదు. కెమికల్స్ వాడిన పండ్లను అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులు శిక్షిస్తారన్న భయంతో వ్యాపారి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చైతన్య తండ్రి ఈ సమాచారాన్ని 'ఆహార పదార్థాల కల్తీ నివారణ సంస్థకు' అందించారు. అవగాహనతో ఉంటే కల్తీ పదార్థాల నుంచి దూరంగా ఉండవచ్చని ప్రణవ్‌కి అర్థమైంది.

- ఓట్ర ప్రకాష్ రావు,
తిరుత్తణి, 097874 46026.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



నేను గీసిన బొమ్మ



జి.వర్షిత్ సాయి,
1వ రతగతి,
ఆదోని, కర్నూలు జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ పిల్లల ప్రవర్తనకు మీరే బాధ్యులు ..!

ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య అంతరం పెరిగిపోతోంది. పిల్లలను ప్రేమ, ఆప్యాయతలు, మంచి చెడుల విశ్లేషణలతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై వుంది. పిల్లలు దురుసుగా మాట్లాడినా, ప్రవర్తించినా తమకేమీ పట్టనట్లు వ్యవహరించే తల్లితండ్రులు చాలామందే ఉంటారు. ఈ విపరీత ప్రవర్తన పిల్లలను హింసాత్మక దాడులకు ప్రేరేపిస్తుందని ఎంతమందికి తెలుసు? ఈ ప్రవర్తనకు అమ్మానాన్నే ముఖ్య కారణమని చెప్పినా ఏ తల్లీదండ్రీ ఒక పట్టాన ఒప్పకోరు. ఇటీవల అమెరికాలో జరిగిన ఓ ఉదంతం, పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల బాధ్యతను మరోసారి ఎత్తి చూపించింది. తమ గారాల కొడుకు హింసాత్మక ప్రవర్తనకు పరిహారంగా ఇప్పడా తల్లిదండ్రులు జైలు శిక్ష అనుభవిస్తున్నారు.



ఈథన్ క్రూంబ్లే (17) అమెరికాలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో ఉన్నత విద్య చదివేవాడు. 2021లో తన దగ్గర ఉన్న 9 ఎం.ఎం చేతి తుపాకీతో తన సహ విద్యార్థులను(4) కాల్చి చంపాడు. ఈ దారుణ ఘటనలో మరికొంతమంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ దారుణానికి తెగబడే సమయానికి ఈథన్ వయసు 15 ఏళ్లు. అప్పటి నుంచి తను జైల్లోనే ఉన్నాడు. ఆ కేసు విచారణలో భాగంగా ఈథన్ తల్లిదండ్రులైన జేమ్స్, జెన్నీఫర్ క్రూంబ్లేకు మిచిగాన్ కోర్టు తాజాగా 10 నుండి 15 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ ఈనెల 9న తీర్పు వెలువరించింది.

ఈథన్ అలా ప్రవర్తించడానికి పూర్తి బాధ్యత తల్లిదండ్రులదే అని కోర్టు వ్యాఖ్యానించింది. పిల్లవాడి పెంపకంలో వారిరువురూ విఫలమయ్యారని పేర్కొంది. 'ఈ ఆరోపణలు కేవలం పేలవమైన తల్లిదండ్రుల బాధ్యత గురించే చేయడం లేదు. రాబోయే తరాల్లో పునరావృతమయ్యే, లేక లోపించే చర్యలను నియంత్రించేందుకు కూడా!' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఈ తీర్పుతో ప్రపంచమంతా తల్లిదండ్రుల పాత్రపై మరోసారి చర్చిస్తోంది. పిల్లలకు మంచి చదువు, ఉపాధి చూపించడంతోనే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదు. వారు పెరిగే ప్రతి దశలో కీలక బాధ్యతగా వ్యవహరించాలి. మంచి, చెడులు బేరీజు వేసి చెప్పడం దగ్గర నుంచి అనేక విషయాలు వారికి అర్థమయ్యేలా చెప్పాలి. తీర్పు వెలువడిన క్షణంలో ఈథన్ తల్లి సరిగ్గా ఈ అంశంపైనే పశ్చాత్తాప పడింది.

'నేను నా బిడ్డ కష్టసుఖాల్లో ఎప్పుడూ భాగం కాలేదు. తనకేమి కావాలో, వద్దో తెలుసుకోలేదు. చాలామంది తల్లిదండ్రుల లాగే నేను కూడా నా బిడ్డ ప్రవర్తనలో వస్తున్న మార్పులపై శ్రద్ధ పెట్టలేదు. ఫలితంగా ఇప్పుడు ఇలా శిక్ష అనుభవించాల్సి వస్తోంది' అంటూ తీర్పు తరువాత జెన్నిఫర్ వ్యాఖ్యానించింది. జెన్నీ వ్యాఖ్యల్లో ప్రతి తల్లీ తమ బిడ్డల పట్ల తాము ఎంత బాధ్యతగా ఉంటున్నారో బేరీజు వేసుకోవచ్చు.

'నా బిడ్డ వల్ల నష్టపోయిన కుటుంబాలకు క్షమాపణలు చెప్పుకుంటున్నాను. ఏ తండ్రీ పిల్లల మానసిక స్థితిని పట్టించుకోకుండా ఉండకూడదు. అలా చేసినందుకే ఈ రోజు మూల్యం చెల్లించుకుంటున్నాను' అని ఈథెన్ తండ్రి, తీర్పు అనంతరం వ్యాఖ్యానించాడు. పిల్లవాడి ప్రవర్తనను సరిగ్గా బేరీజు వేసుకోని ఆ తండ్రి, ఘటన జరగడానికి నాలుగు రోజుల ముందే చేతి పిస్తోలుని ఈథన్‌కి బహుమతిగా ఇచ్చాడు. ఆ తుపాకీని స్కూలు బ్యాగులో భద్రపరుచుకున్న ఈథన్ ఒకానొక విపరీత క్షణాన ఈ దారుణానికి పాల్పడ్డాడు.

'తల్లిదండ్రులిద్దరూ తమ బిడ్డ ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టలేదు. స్కూలు యాజమాన్యం హెచ్చరించినా లెక్క చేయలేదు. కాల్పులు జరిగిన రోజు ఉదయం వేళ ఈథన్ స్కూలు యాజమాన్యం జేమ్స్, జెన్నీలను స్కూలుకి పిలిపించి తన విపరీత ప్రవర్తన గురించి హెచ్చరించింది. 'క్రిస్మస్ రోజు తుపాకీ బహుమతిగా అందుకున్న ఓ వ్యక్తి బొమ్మ, అతని చుట్టూ 'రక్తం అన్ని చోట్ల ప్రవహిస్తోంది. ఆలోచనలను ఎవరూ నియంత్రించలేరు. సహాయం చేయండి' అని రాసుకున్న ఈథన్ పుస్తకాన్ని చూపించినా వారు ఖాతరు చేయలేదు. పిల్లవాడ్ని ఇంటికి తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వమని రెండు రోజుల తరువాతే స్కూలుకు పంపమని యాజమాన్యం చెప్పింది. కానీ, సమావేశం ముగిసిన స్వల్ప వ్యవధిలోనే ఈథన్ కాల్పులు జరిపాడ'ని బాధిత తల్లిదండ్రుల న్యాయవాది కోర్టులో వినిపించిన వాదనలు ప్రతి తల్లిదండ్రికీ తమ బాధ్యతను గుర్తు చేస్తున్నాయి.

ఈ తరహా విచారణలు ఈథన్ కేసులోనే కాదు; కొంతకాలంగా పిల్లల విపరీత ప్రవర్తనలకు తల్లిదండ్రులదే బాధ్యత అని న్యాయవాదులు తమ వాదనలను బలంగా వినిపిస్తున్నారు. నేరుగా తల్లిదండ్రులపై అభియోగాలు మోపకపోయినా బాధ్యులుగా మాత్రం నిరూపించి శిక్షలు వేస్తున్నారు. ఆరేళ్ల పాప తన స్కూలు టీచరును కాల్చి చంపిన ఘటనలో పాప తల్లి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపి, నిందితురాలిగా శిక్షించారు. అలాగే హాయ్‌ల్యాండ్ పార్కులో ఒక పిల్లవాడు జరిపిన కాల్పుల్లో ఏడుగురు చనిపోయారు. డజన్ల కొద్దీ జనం గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యుడిగా ఆ పిల్లవాడి తండ్రి అరెస్టు అయ్యాడు. పిల్లవాడి పరిస్థితి అర్థం చేసుకోకుండా అతడికి గన్ లైసెన్సు ఇప్పించినందుకు అతను శిక్షార్హుడయ్యాడు.

పిల్లల బాధ్యత 'నీది అంటే నీది' అని వాదులాడుకునే తల్లిదండ్రులు చాలామందే ఉంటారు. ఎవరిది? అన్న చర్చ అనవసరం. ఉద్యోగాల్లో, ఇంటిపనుల్లో తలమునకలైనా, ప్రతి అమ్మానాన్న, పిల్లలకంటూ ప్రత్యేక సమయాన్ని కేటాయించాలి. పిల్లల్లో వస్తున్న మానసిక, శారీరక ఒత్తిడులను ఎప్పటికప్పుడు గమనించుకోవాలి. విపరీతాలకు పోతుంటే వారించాలి. 'ఎంత చెప్పినా వినడం లేదు.. మొండిగా ప్రవర్తిస్తున్నారు' అని తప్పించుకోవద్దు. పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. వాళ్లు చేసిందే చేస్తారు. చెప్పిందే చెబుతారు. కాబట్టి.. భార్యాభర్త ఇద్దరూ ఒకరి పట్ల ఒకరు ఎంత గౌరవంగా, బాధ్యతగా వ్యవహరిస్తారో, పిల్లలు కూడా అంతే సక్రమంగా పెరుగుతారు. మొదటి మార్పు అమ్మానాన్న నుండే మొదలవ్వాలి. అప్పుడే పిల్లలు మీరు కలలు గన్న బంగారు భవిష్యత్తును అనుభవిస్తారు.

- జ్యోతిర్మయి

న్యాయస్థానంలో ఓ అమ్మ కన్నీరు



'**ఘ**టన జరిగిన తరువాత మేల్కొన్న మీరు మీ బిడ్డకు విపరీతాలు చేయొద్దని హితవు చెప్పే సమయంలో, నేను కూడా నా బిడ్డకు సందేశం ఇచ్చాను. 'నేను నిన్ను ప్రేమిస్తున్నానని. నన్ను అమ్మా అని ఒక్కసారి పిలవమని ప్రాధేయపడ్డాను. కానీ, నా బిడ్డ అవేమీ వినిపించుకోలేని స్థితిలోకి వెళ్లిపోయింది. మీ బిడ్డ బాధ్యతల నుంచి మీరు దూరంగా వెళ్లిపోయారు. మీరు చేసినదానికి నేను శిక్ష అనుభవిస్తున్నాను. గుండెలనిండా దు:ఖంతో నేను నా గారాల తల్లికి తుది వీడ్కోలు పలికాను' అంటూ కోర్టు విచారణలో నికోల్ బౌసోలైల్ భావోద్వేగంగా మాట్లాడుతుంటే అక్కడ వున్న వారందరి కళ్లు చెమ్మగిల్లాయి. ఈథన్ జరిపిన కాల్పుల్లో నికోల్ 17 ఏళ్ల కుమార్తె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది.

'వార్-2'లోకి ఎన్‌టిఆర్

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న వార్ సినిమా సీక్వెల్ 'వార్-2'లో జూనియర్ ఎన్టీఆర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని ఎన్టీఆర్ లుక్ బయటకు వచ్చింది. ఎన్టీఆర్ ఈ సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లారు. యష్ రాజ్ ఫిలిమ్స్ ఈ సినిమాని నిర్మిస్తోంది. ఈ సినిమాని వచ్చే ఏడాది ఆగస్టు 14న రిలీజ్ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

రామ్ చరణ్‌కి గౌరవ డాక్టరేట్



నటుడు రామ్ చరణ్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. చెన్నైలోని వేల్స్ వర్చువల్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈ నెల 13వ తేదీన చెన్నైలోని పల్లవరంలోని వేల్స్ వర్చువల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం జరగనుంది. యూనివర్సిటీ ఛాన్సలర్, సినీ నిర్మాత ఈసరి గణేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఇదే వేడుకలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అధ్యక్షుడు డీజీ సీతారాం, రామ్ చరణ్‌లకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

రాజమౌళి దంపతుల డ్యాన్స్

దర్శకుడు రాజమౌళి తన వర్క్, ఫ్యామిలీ టైమ్‌ను చక్కగా బ్యాలెన్స్ చేస్తుంటారు. ఇటీవల ఓ వివాహ వేడుకల్లో పాల్గొని తన సతీమణి రమతో డ్యాన్స్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ సిఇఒ, నిర్మాత చెర్రీ కుమార్తె వివాహ వేడుకల్లో రాజమౌళి తన సతీమణి రమతో కలిసి పాల్గొన్నారు. ప్రభుదేవా హిట్స్‌లో ఒకటైన 'అందమైన ప్రేమరాణి' పాటకు వీరిద్దరూ స్టెప్పులేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.



సెప్టెంబర్ 5న గోట్ విడుదల

తమిళ హీరో విజయ్ నటిస్తున్న 68వ సినిమా 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్-గోట్' సెప్టెంబర్ 5వ తేదీన విడుదల కానుందని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ నిర్మిస్తోంది. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు, మిక్ మోహన్, జయరాం, కన్నడ హీరో కిచ్చా సుదీప్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. 1971లో డిబి కూపర్ అనే వ్యక్తి విమానంలో భారీ దొంగతనానికి పాల్పడి దానిలో నుంచి పారాచ్యూట్‌తో దూకేశాడు. ఆ వ్యక్తి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఆ మిస్టరీని కథాంశంగా తీసుకుని ఈ సినిమా నిర్మిస్తున్నట్లుగా సమాచారం.

'లక్కీ భాస్కర్' టీజర్ వచ్చేసింది!

దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'లక్కీ భాస్కర్' చిత్రం టీజర్ విడుదలైంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో దుల్కర్, బ్యాంక్ క్యాషియర్‌గా కనిపించనున్నారు. ఒక మధ్య తరగతి వ్యక్తి భారీ మొత్తంలో డబ్బు ఎలా సంపాదించాడు? అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనే ప్రశ్నలతో టీజర్‌ని కట్ చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

త్వరలో 'మ్యూజిక్‌షాపు మూర్తి' టీజర్

సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ అజయ్ ఘోష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మ్యూజిక్‌షాపు మూర్తి'. కథ, డైరెక్టర్ శివ పాలడుగు, హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మాతలు. త్వరలోనే టీజర్, వచ్చేనెలలో సినిమాను విడుదల చేస్తామని చిత్రనిర్మాతలు ప్రకటించారు. సాధించాలనే కాంక్ష ఉండి పట్టుదలతో పనిచేస్తే ఏ వయస్సు వారైనా దానిలో విజయం సాధిస్తారు అన్న ఇతివృత్తం చుట్టూ ఈ చిత్రం ఉంటుందని వివరించారు. ప్రధాన పాత్రలో అజయ్‌ఘోష్ తన అసమాన ప్రతిభను ప్రదర్శించారని చెప్పారు.

సింధుకు చుక్కెదురు

- ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పరాజయం
- తనీశ, అశ్విని జోడీ, ప్రణయ్ సైతం
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట టీమ్ ఇండియా షట్లర్లకు గట్టి ఎదురుదెబ్బ. పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు ఆశిస్తున్న మన షట్లర్లు.. బ్యాడ్మింటన్ పవర్‌హౌస్‌లు తలపడే ఆసియా చాంపియన్‌షిప్స్‌లో సత్తా చాటాలని తపించారు. కానీ వరల్డ్ నం.1 జోడీ సాత్విక్, చిరాగ్‌లు పోటీ నుంచి తప్పుకోగా.. బరిలో నిలిచిన అగ్ర షట్లర్లు సింధు, లక్ష్యసేన్, ప్రణయ్, శ్రీకాంత్‌లు మట్టికరిచారు. ఆసియా బ్యాడ్మింటన్ వైఫల్యంతో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరింత ఒత్తిడిలో పడ్డారు!.

నింగ్‌బో (చైనా) : ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్ల పోరాటానికి తెరపడింది. జంబో బృందంతో చైనాకు చేరుకున్న భారత బ్యాడ్మింటన్ జట్టు.. రెండో రౌండ్‌కే చాప చుట్టేసింది. 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట ఫామ్‌లోకి రావాలని ప్రయత్నిస్తున్న రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలైంది. 69 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో పి.వి సింధు పోరాడినా ఓటమి తప్పలేదు. మ్యాచ్‌కు ముందు చైనా షట్లర్, ఆరో సీడ్ హన్ వీపై 5-0 క్లీన్ రికార్డుతో బరిలోకి దిగిన సింధు మూడు గేముల మ్యాచ్‌లో నిరాశపరిచింది. 18-21, 21-13, 17-21తో సింధు పోరాడి ఓడింది. ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌ను సింధు దూకుడుగా మొదలెట్టింది. 8-4తో ఆరంభంలోనే ఆధిక్యం దక్కించుకుంది. 14-8తో మరింత ముందుకెళ్లిన సింధు ఆ తర్వాత వరుస తప్పిదాలు చేసింది. సుదీర్ఘ ర్యాలీలతో సింధుపై పైచేయి సాధించిన చైనా షట్లర్ 15-15తో స్కోరు సమం చేసింది. గేమ్‌ను నియంత్రణలోకి తీసుకున్న హన్.. వెనక్కి తగ్గలేదు. 21-18తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. కీలక రెండో గేమ్‌లో సింధు ఎదురుదాడి చేసింది. దూకుడుగా ఆడుతూ పాయింట్ల వేట సాగించింది. దీంతో 16-8తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పుంజుకునేందుకు చైనా అమ్మాయి ఎన్ని ప్రయత్నాలు చేసినా సింధు జోరు తగ్గలేదు. 21-13తో రెండో గేమ్‌ను సింధు సొంతం చేసుకుంది. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. డిసైడర్‌లో సింధుకు మంచి ఆరంభం దక్కినా.. తెలుగు తేజం సద్వినియోగం చేసుకోలేదు. 8-4తో చైనా అమ్మాయి ముందంజలోకి వెళ్లింది. లాంగ్ ర్యాలీలతో దూకుడు ప్రదర్శించిన చైనీస్ షట్లర్ ఈ క్రమంలో తప్పిదాలు చేసింది. దీంతో 10-10తో స్కోరు సమమైంది. ఈ సమయంలో పుంజుకున్న హన్ 17-10తో భారీ ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత సింధు చేసిన ప్రయత్నం పాయింట్ల అంతరం కుదించేందుకే సరిపోయింది. 21-17తో నిర్ణయాత్మక గేమ్‌తో పాటు క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను సైతం హన్ వీ సొంతం చేసుకుంది.

ముగిసిన పోరాటం : ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత పోరాటానికి తెరపడింది. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ పరాజయం పాలైంది. ప్రీ క్వార్టర్‌ఫైనల్లో 17-21, 12-21తో మూడో సీడ్ జపాన్ షట్లర్ల చేతిలో అశ్విని, క్రాస్టో ఓటమి చెందారు. తొలి రౌండ్లో భారత షట్లర్లకు వాకోవర్ లభించిన సంగతి తెలిసిందే. ఇక పురుషుల సింగిల్స్ విభాగంలో హెచ్.ఎస్ ప్రణయ్ సైతం పరాజయం పాలయ్యాడు. ఏడో సీడ్ ప్రణయ్ 18-21, 11-21తో అన్‌సీడెడ్ చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ యి చేతిలో కంగుతిన్నాడు.

పోరాడి ఓడిన నాగల్

- మోంటే కార్లో మాస్టర్స్ 20224

మోంటే కార్లో (మొనాకో) : భారత వర్థమాన టెన్నిస్ క్రీడాకారుడు సుమిత్ నాగల్ మోంటే కార్లో మాస్టర్స్ 2024 టోర్నమెంట్‌లో పోరాడి ఓడాడు. ఏటీపీ 1000 టోర్నీ ప్రధాన డ్రాకు చేరుకోవటంతోనే రికార్డులు పరంపర మొదలుపెట్టిన నాగల్ తొలి రౌండ్లో అసమాన విజయంతో అందరి దృష్టిని ఆకర్షించాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో సుమిత్ నాగల్ పోరాడి ఓడాడు. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో 3-6, 6-3, 2-6తో సుమిత్ నాగల్ పరాజయం పాలయ్యాడు. వరల్డ్ నం.7, డెన్మార్క్ ఆటగాడు హోల్గర్ రూనెపై నాగల్ ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. తొలి, చివరి సెట్‌లో వెనుకంజ వేసినా రెండో సెట్‌లో చెప్పుకోదగిన విజయం సాధించాడు. రెండు గంటల 11 నిమిషాల మ్యాచ్‌లో సుమిత్ నాగల్ మూడు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. డెన్మార్ ఆటగాడు రూనె ఐదు బ్రేక్ పాయింట్లతో పైచేయి సాధించాడు. పాయింట్ల పరంగా నాగల్ 70-88తో గట్టి పోటీ ఇచ్చాడు. రూనె 15 గేములు గెల్చుకోగా.. సుమిత్ నాగల్ 11 గేమ్‌లతో మెప్పించాడు. మోంటో కార్లో మాస్టర్స్ టోర్నమెంట్‌లో ఓ భారత ఆటగాడికి ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావటం గమనార్హం.

ప్రజ్ఞానంద, విదిత్ విజయాలు

- ఫిడె క్యాండిడేట్స్ చెస్ 2024

న్యూఢిల్లీ : ఫిడె క్యాండిడేట్స్ చెస్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఆరో రౌండ్‌లో అదరగొట్టారు. ఐదో రౌండ్‌లో డ్రాలు ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, విదిత్‌లు 24 గంటల్లోనే విజయాలతో పుంజుకున్నారు. ఆరో రౌండ్ మ్యాచ్‌లో ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో సెమీ టర్రాస్ డిఫెన్స్‌లో నిజత్ అబసోవ్‌పై విజయం సాధించాడు. విదిత్ గుజరాతీ సైతం 40 ఎత్తుల్లో సిరిసిలియన్ సోజెన్ ఎటాక్‌లో అలిరెజాపై గెలుపొందాడు. డి. గుకేశ్ కీలక మ్యాచ్‌లో హికారు నకమురతో మ్యాచ్‌ను 40 ఎత్తుల్లో డ్రా చేసుకున్నా.. పాయింట్ల పట్టికలో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ ఇయాన్, టాప్ సీడ్ ఫాబియానోలు తమ మ్యాచ్‌ను 40 ఎత్తుల్లో డ్రాగా ముగించారు.

దిగొచ్చిన ఫ్రెంచ్ అథ్లెటిక్స్!

భారత అథ్లెట్ల పోటీకి అనుమతి

పారిస్ : ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య జోక్యంతో ఫ్రెంచ్ అథ్లెటిక్స్ నిర్వాహకులు దిగి వచ్చారు. ఇటీవల వాడా విడుదల చేసిన 2022 వార్షిక డోపింగ్ నివేదిక ప్రకారం భారత్‌లో అత్యధిక శాతం పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. డోపింగ్ అంశంలో ఎటువంటి రిస్క్ తీసుకునే ఆలోచనలో లేని ఫ్రెంచ్ అథ్లెటిక్స్.. అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్యాలెండర్‌లో భాగమైన ' ది మీటింగ్ డె లిమోగస్' టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్న ముగ్గురు భారత అథ్లెట్లను పోటీ నుంచి దూరం పెట్టింది. ఫ్రెంచ్ అథ్లెటిక్స్ నిర్వాహకుల నిర్ణయం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించింది. దీంతో టోర్నీ నిర్వాహకులు తప్పిదాన్ని సరిదిద్దుకున్నారు. ముగ్గురు భారత అథ్లెట్లు పోటీపడవచ్చని తాజాగా ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా, వాడా నివేదిక ప్రకారం భారత్‌లో 3865 శాంపిల్స్ (బ్లడ్, యూరీన్)ను పరీక్ష చేశారు. ఇందులో 3.2 శాతం అనగా 125 శాంపిల్స్ పాజిటివ్‌గా తేలాయి. కనీసం 2000 శాంపిల్స్ పరీక్ష చేసిన దేశాల్లో భారత్‌లోనే అత్యధిక పాజిటివ్ రేటు నమోదైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68